# ప్రపత్తి శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాసపత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 11 జనవరి 2025 పేజీలు: 48 వెల: 30/-



# ముఖచిత్రపరిచయం




జాతి ఔన్నత్యాన్ని ఉనికిని పరిరక్షించడానికి సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక సేవ రెండు మార్గాల ద్వారానే సుసాధ్యం అన్న ప్రగాఢ నమ్మకంతో ప్రపత్తి శ్రీసన్నిధానం పత్రిక ముందుకు వెళుతోంది. శ్రీసన్నిధానం ట్రస్ట్ ప్రారంభించి మూడవ వార్షికోత్సవానికి సిద్ధం అవుతున్న వేళ పరమ భాగవతోత్తముల మంగళాశాసనాలు తీసుకోవాలన్న సంకల్పం మరింత ఉత్సాహాన్ని చేకూర్చింది. ఈ విజ్ఞాపనను మన్నించిన ఎందరో మహానుభావులు తమ ఆశీస్సులను, సూచనలను అక్షర రూపంలో అందించారు. "యద్భావం తత్ భవతి" అన్న ఆర్యోక్తి, 'ధర్మనీతి' అక్షరసత్యం అని నమ్ముతున్న ప్రపత్తి శ్రీసన్నిధానం పెద్దల అభిప్రాయాలను ఈ సంచికలో ప్రచురిస్తోంది. 'మంచి మాట ఎప్పుడు చెప్పినా, సమాజహితానికి కృషి చేసే ఏ కార్యమైనా అది సర్వ జన ఆమోదమే!' కనుక పండితుల భావనలకు, ఆలోచనలకు రూపంగా ముఖచిత్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఇది.

ఆధ్యాత్మిక భావచైతన్యం కలిగించే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రపత్తి శ్రీసన్నిధానం పత్రికను పాఠకులు ఆదరిస్తూ భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాము.

## సమాచారము కొరకు

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323, ఇ-మెయిల్ prapatti.srisannidhanam9@gmail.com

-ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

- ఎడిటర్

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

**సంపుటి: 1 - సంచిక: 11 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి జనవరి 2025 వెల : 30**


ఇందులో


04.సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
06.మంగళాశాసనాలు
11.శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
13.శ్రీపతిస్తుతి - మంచిమాట
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు
15.శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
17.దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు
19.భాగవతంలో భగవంతుని అవతారగాథలు
శ్రీమతి తిరుమల నీరజ
21.కర్మఫలం - ధర్మబలం
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు
22.గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య
23.త్రివిక్రముడిగా ఎదిగిన వామనమూర్తి
శ్రీమాన్ డా॥ వోలేటి రవికుమారాచార్యులు
24.శ్రీగోదా కల్యాణము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
26.జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
28.భగవదాలయములు - నియమనిబంధనలు
శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు
29.అహల్యా మాత
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
30.శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
32.జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు
33.శ్రీసంప్రదాయ సేవలో శ్వాస్
35.ఋషివాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా.యం.టి. ఆళ్వార్ స్వామి.
36.తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు
37.వానమామలై చరిత్ర
శ్రీమతి వనం ఉషారాణి
38.శ్రీభాష్యంలో శ్రీరామాయణ సూక్తుల ఉట్టంకనం
శ్రీమాన్ శ్రీ డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు
39.పాదుకాసహస్రావిర్భావవమ్
శ్రీమాన్ శ్రీ ఇయుణ్ణి శ్రీనివాసాచార్యులు
41.అమృతత్వము
శ్రీమాన్ శ్రీ మరింగంటి కులశేఖరాళ్వారు
42.శ్రీపరాంకుశ సుధాంబోధి
శ్రీమాన్ పి.కృష్ణమూర్తి
43.మన దేవాలయాలు
47.బాలవిజ్ఞానం
శ్రీమతి విజయ కందాళ


నెలవారిపంచాంగం, పుస్తక పరిచయం, ఆధ్యాత్మిక వార్తలు, శ్రీసన్నిధిపదకేళి

## సంపాదకీయం

# ధర్మ సంరక్షణ బాధ్యత అందరిదీ!!



ఇరుగు పొరుగు దేశాలలో ఏమి జరుగుతోంది. సంప్రదాయ మూలస్తంభాలను కూకటి వేళ్ళతో పెకిలించే యత్నం జరుగుతోంది. సెక్యులర్ ముసుగులో పెదవి విప్పలేని పరిస్థితి, బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ పూజారి (హిందూ మత పెద్ద చిన్మయ్ కృష్ణ దాస్)ను దేశ ద్రోహం నేరం మోపి జైలులో పెట్టిన వ్యవహారం చిలికిచిలికి గాలివానలా తయారైంది. వాస్తవాన్ని ఇది వాస్తవం అని చెప్పేవారు లేకపోవడంవల్ల మసిపూసి మారేడుకాయ చేసిన చందంగా పరిస్థితి తయారైంది. బంగ్లాదేశ్ అంతటా విస్తృత నిరసనల మధ్య ఈ పరిణామం జరిగింది. తాజాగా మరో ఇద్దరు (ఇస్కాన్) హిందూ పూజారులను బంగ్లా పోలీసులు అరెస్ట్ చేశారు, వీరు జైల్లో ఉన్న చిన్మయ్ కృష్ణ దాస్ శిష్యులు కావడం విశేషం. చిట్టోగ్రామ్‌లోని జైలులో ఉన్న చిన్మయ్ దాస్‌కు ఆహారం తీసుకువెళ్లిన సందర్భంలో మరో ఇద్దరు పూజారులను అరెస్టు చేసారు. ఒక దశలో ఇస్కాన్ సంస్థను బ్యాన్ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించి ఇది అంతర్జాతీయ సంస్థ కనుక ఆరోపణను కోర్టు త్రోసిపుచ్చింది. హిందూ మత సంస్థ మద్దతుదారులు, ఇస్కాన్ మద్దతుదారులు వివిధ దేశాలలో నిరసనలు చేపట్టినా, భారత దేశంతోపాటు పలు దేశాలు వ్యవవహారాన్ని ఖండించినా పశ్చిమబెంగాల్ తాత్కాలిక ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. వాస్తవాన్ని గమనిస్తే పూజారి వ్యవహారం జటిలం అవుతున్నట్లే అతని ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది మరో మతానికి సంస్కృతికి సంబంధించిన వ్యవహారం అయితే గగ్గోలు పేట్టేవారు. అక్కడ పెట్టిన కేసులు, ఆరోపణలు తీవ్రమైనవి కావడంతో గట్టిగా స్పందించడం లేదన్న భావన వెలువడుతోంది. కృష్ణలీలలు, కృష్ణతత్వాన్ని ప్రచారం చేస్తున్న ఇస్కాన్ గీత బోధనలను చేస్తుందే తప్ప మరోమాట ఎరుగదు.

శ్లో : యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

ధర్మం నశించి అధర్మం పెచ్చుపెరిగినప్పుడల్లా నన్ను నేనే సృష్టించుకుంటానని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత 4వ అధ్యాయం 7 శ్లోకంలో అర్జునునికి ఉపదేశం చేస్తున్న సందర్భంలో ఉటంకించారు. కృతయుగం (సత్యయుగం), త్రేతాయుగం, ద్వాపరయుగాలలో ఎందరో అసురులుపుట్టినా, భగవంతుడు భక్తులకోసం తానైవచ్చి అసురులను అంతమొందించాడు. అయితే పాపం పండాలన్నట్లు శిశుపాలుని వందోతప్పువరకూ శిక్షించలేదు.

ధర్మం నాలుగు పాదాలపై నడవాలన్న నియమం ఉన్నా కలియుగంలో అంటే ప్రస్తుతం నడుస్తున్న కాలంలో ఒకటే పాదంపై ధర్మం నడుస్తోంది. అసురులు మనుషుల్లో కలిసి మనుషుల్లా మెదలుతున్న వేళ వారి సంఖ్యాబలం నానాటికి పెరుగుతోంది. అంటే అసుర ప్రవృత్తికల వారి బలం నానాటికీ పెరుగుతుంది. బలం బలగం ఉన్నవారిదే న్యాయం అన్న చందంగా తయారైంది. ముఖ్యంగా భక్తుల ఉద్ధరణకోసమే అవతరిస్తాడన్న ప్రగాఢనమ్మకంతో మెదిలితే సరిపోదు. దీనికి సరైన మార్గం కనిపెట్టాలి. మధ్యేమార్గం అన్వేషించాలి. సర్వేజనాః సుఖినో భవంతు అని నిత్యం ప్రార్థనలు చేసే జాతిని, వారిశ్రేయస్సును పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. "ధర్మో రక్షతి రక్షితః" అని ఉంది. అంటే ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని కాపాడుతుంది అని అర్థం. కాని ధర్మరక్షణ స్వరక్షణమే అవుతుందని వాదన కూడా ఉంది. "ధర్మో రక్షతి రక్షితః" అనే సంస్కృత శ్లోకం మనుస్మృతి లోనిది మరియు మహాభారతంలో కనిపిస్తుంది. రామాయణంలోనూ కనిపిస్తుంది. ధృ" అనే ధాతువు నుండి "ధర్మం" అనే పదం పుట్టింది. "ధృ" అంటే ధరించడం అని అర్థం. దానంతట అది సహజంగా ధరింపబడిందే ధర్మం. అంటే అది అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అన్ని మతాలకు కూడ సహజంగా ఉంటుంది.

ధర్మ ఏవ హతోహంతి, ధర్మో రక్షతి రక్షితః।
తస్మాత్ ధర్మో న హంతవ్యో, మానో ధర్మోహతోవధీత్॥

అని మనుస్మృతిలో ప్రస్తావించారు. శ్రీరామాయణంలో ధర్మసూక్ష్మం వివరించారు. ఇక్కడ ఒక కుటుంబాన్ని తీసుకుంటే భర్త, భార్య, కుమారుడు, కూతురు ఇలా ఎవరి ధర్మం వారిదే! వారు ఆచరించాల్సిందే! అలాగే పాలకులు, ప్రజలు సమసమాజ స్థాపనకోసం ఈ ధర్మాన్ని అందరూ పాటించి, అవసరంమేరకు స్పందించాలి. అప్పుడే సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించ బడతాయి. నిలబడతాయి.

-కొడ్లపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**పుష్యమాసం 31-12-25 శుక్లపక్షంతో ప్రారంభమై 29-01-25 వరకు, 30-02-25 నుండి మాఘమాసం**

10-01-2025 వరకు పూర్వాషాఢ కార్తి, 11-01-2024 నుండి ఉత్తరాషాఢ కార్తి 24-01-2024 నుండి శ్రావణ కార్తి,

**పండుగలు** : 01-01-25 ఆంగ్ల నూతన సంవత్సరం, 10-01-25 సర్వేషాం (వైకుంఠ) ముక్కోటి ఏకాదశి, 12-01-25 స్వామి వివేకానంద జయంతి, 13-01-25 పౌర్ణమి, భోగి, గోదాకళ్యాణం, 14-01-25 సంక్రాంతి పండుగ, మకరసంక్రమణం, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం 15-01-25 కనుమ పండుగ, 17-01-25 సంకష్టహర చతుర్థి 18-01-25 త్యాగరాజ ఆరాధనోత్సవాలు, 25-01-25 సర్వేషాం ఏకాదశి, 26-01-25 గణతంత్రదినోత్సవం,, 29-01-25 అమావాస్య.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల అన్నిరంగముల వారికి బాగుంటుంది. జీవనం సంతోషంతో ముందుకు సాగును. సంతోషకర వార్తలు వింటారు. సమస్యలు పరిష్కారం అగును

**వృషభం:** ఈ నెల అన్నిరంగముల వారికి బాగుంటుంది. చేయు వృత్తివ్యాపారాదులు బాగా సాగును. ఆర్థికంగా అనుకూలత. ఆరోగ్యలాభం.

**మిథునం:** ఈనెలలో చేయువృత్తి వ్యాపారాలందు రాణింపు, ఆరోగ్యం బాగుండును. ఆర్థిక లావాదేవీలు అనుకూలత, సరైన సమయానికి ధనం చేతికందును. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొని విజయంసాధిస్తారు.

**కర్కాటకం:** ఈ నెల శుభాశుభమిశ్రమంగా ఉండును. పనులయందు ఆటంకాలు, సమస్యలలో చిక్కుకొనుట, ఊహించని పరిణామాలు, ద్వితీయార్ధంలో అనుకూలత,

**సింహం:** ఈ నెల అనుకూలత ఉండదు. ప్రతీ విషయంలో ప్రతికూలత. ధననష్టములు, ఊహించని సంఘటనలు, బంధుమిత్రాదులతో సోదరులతో విరోధములు, వాహనప్రమాదాలు, జాగ్రత్తగా ఉండేది.

**కన్య:** ఈనెలలో కార్యాలందు జయం. నూతన వస్త్ర, వస్తుప్రాప్తి, బంధుమిత్రులతో విందులు, వినోదాలు, దూరప్రయాణాలు, కుటుంబసంతోషాలు, ఆనందంగా ఉండుట, సమస్యల నుండి బయటపడుట,

**తుల:** ఈనెలలో అన్నివిధాలుగా అనుకూలమే. చేయువృత్తి వ్యాపారాలందు లాభములు, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి.

**వృశ్చికం:** ఈనెల అనుకూలమే. చేయువృత్తి వ్యాపారాలందు ఆధ్యికత, ఆదాయం బాగుండును. అనుకూల వాతావరణం. సమస్యలు తీరును.

**ధనుస్సు:** ఈ నెల ప్రతిపనిలో ఉత్సాహంగాఉంటారు. సమస్యలు పరిష్కారమగును. నూతన పరిచయాలు లాభించును. వ్యవహార జయం, శత్రువులే మిత్రులగుట.

**మకరం:** ఈ నెలలో ధనవ్యయం ఉన్నప్పటికీ మిగిలిన విషయాలలో అనుకూలత. ఆరోగ్యం బాగుంటుంది. సంతాన సౌఖ్యం, వాహన మార్పులు,

**కుంభం:** ఈ నెలలో శుభాశుభమిశ్రమ ఫలితాలు ఉండును. వృత్తి వ్యాపార, వ్యవహారాలు కలిసివచ్చును. ఆనందమైన జీవనం, చివరకు మీదే విజయం.

**మీనం:** ఈ నెల ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడుదురు. ఆర్థిక లావాదేవీలు బాగుండును. ఇతరుల వ్యవహారములో జోక్యం వల్ల నష్టపోవుదురు.

### 'హనుమాన్ చాలీసా'

శ్రీరామచరిత మానస్ వ్రాసినది శ్రీరామభక్తాగ్రగణ్యుడు తులసీదాసగోస్వామి. తులసీదాసు శ్రీరామచరిత మానస్ గానం చేస్తే హనుమే స్వయంగా వచ్చేవాడు. ఎక్కడ శ్రీరామ సంకీర్తన జరిగినా ఆయా ప్రదేశాలకి హనుమ వేంచేస్తాడు.

ఓసారి తులసీదాస్ శ్రీరామచరిత మానస్ గానం చేశాక, అంతా వెళ్ళిపోయారు. ఒక్క వృద్ధమూర్తి తన్మయంతో అలాగే ఉండిపోగా, తులసీదాసు ఆయన పాదాలకి నమస్కరించాడు. ఆ వృద్ధ రూపంలో నున్న హనుమంతుడు తులసీ దాసుకు తన దివ్య దర్శనాన్ని ఇచ్చాడు.


### మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు**

**31-01-2025**

# ఉత్తరోత్తరాభివృద్ధిరస్తు





ంగిరి శ్రీనివాసమూర్తి     నవంబర్ 2024   వెల : 30

18.కార్తీక మాస వైభవము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
20.జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
22.ధృవోపాఖ్యానం
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
23.అష్టలక్ష్మీ వైభవం
శ్రీమతి వంగల రాధిక
24.శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
26.జీవుడు కర్మను స్వతంత్రుడై చేసాడా?

# పాఠక లోకానికి శుభాకాంక్షలు



ప్రపత్తి శ్రీసన్నిధానం పత్రికను ప్రేమతో ఆదరిస్తున్నటువంటి పాఠక లోకానికి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఎంతో ప్రేమతో ఆదరిస్తున్న మీ అందరికి కూడా భగవంతుడు ఆయురారోగ్య భోగ భాగ్యములు ఇవ్వాలని పరమాత్మను ప్రార్థన చేస్తూన్నాము.

**నంబి వేణుగోపాలాచార్య కౌశిక**
**ప్రముఖ జోతిష్య, వాస్తు సిద్ధాన్తి, జగిత్యాల**

# సత్సంకల్ప పదములు వర్ధిల్లాలి!



ప్రపత్తి శ్రీసన్నిధానం సంచికను నడుపుచున్న కార్యవర్గానికి భగవద్ భాగవత ఆచార్యుల పరిపూర్ణ అనుగ్రహ శుభ మంగళాశాసనములు కలుగుగాక! కొందరి వద్ద ధనం రాసులుగా ఉంటుంది. కాని ఇతరులకు ఉపయోగపడదు. ధనం పది మందికి ఉపయోగపడాలి. పదిమంది ఆకలి తీర్చాలి, అవసరాలు గడపాలి. ఆధనం ఎవరి దగ్గర చేరి పేరుకు పోతుందో వారే ఆధనంతో పదిమందిని ఆదుకోవాలి. అట్లాంటి ధనం పదికాలాల పాటు ఉండాలి. ఆలాగ పలువురిని ఆదుకునే ధనవంతులైన సత్పురుషులు పదికాలాల పాటు సుఖశాంతులతో సద్బుద్ధితో, ఔదార్యంతో, అభ్యుదయంతో వర్ధిల్లాలి. సేలయేళ్ళవంటి సత్పురుషులు పదికాలాల పాటు బాగా ఉండాలి. వారి విద్యాధనమే బురదలేని తేటనీరు. అవి చక్కగా వికసించి తేనెలూరు పద్మాలు వారి ఐశ్వర్యం. ఆ తేనెలకు లోభపడి తుమ్మెదలు చేరి ఆనందిస్తున్నట్లుగా విద్వాంసులనుచేరి వారి వద్దవున్న విద్యాధనం వెలికి తీసి చక్కటి సంచికను వెలువరించి శ్రీసన్నిధానం వారు చేస్తున్న కృషి అభినందనీయం. విద్వద్వినోదాన్ని కలిగించే వీరు సదా చల్లగా నిండుగా ఉండాలి. జలజల నిరంతరం పారు సెలయేరు. ఆసెలయేటి పద్మాలు సత్పురుషుల చెంతనున్న ధనం ఆపద్మాలు తేనెలూరునవి. అటువంటి విశేష వ్యాసములతో అందరిని అలరిస్తున్న శ్రీసన్నిధానం వారు ధన్యజీవులు. వీరికి శ్రీగోదా రంగనాథుడు, కలియుగ దైవం శ్రీనివాసుని అనుగ్రహముతో ఈ సంచిక దినదిన ప్రవర్ధమానమై శోభిల్లు గాక యని పెరుమాళ్లని ఆచార్యులని ప్రార్థిస్తూ.

ఇట్లు
దైవజ్ఞభూషణ సిద్ధాంతరత్న
**తి.న.చ సంపత్కుమార కృష్ణమాచార్య**
సిద్ధాన్తి,
జీయర్ పీఠ, యాదాద్రి దేవస్థాన
ఆస్థాన సిద్ధాన్తి, జనగామ

# ఎంతో అభ్యుదయాన్ని సాధించాలి

శ్రీమతే రామానుజాయనమః


ప్రపత్తి శ్రీసన్నిధానం మాసపత్రిక ప్రారంభమై మూడవ సంవత్సరం జరుగుతున్నది. ఈ పత్రిక ద్వారా ఆధ్యాత్మిక వ్యాసాలను ముద్రించి ఆధ్యాత్మికమైన జ్ఞానాన్ని పాఠకులకు పంచుతున్న పత్రిక ఇది. ఈ రోజుల్లో పత్రిక నడపడం చాలా కష్టంతో కూడుకొన్నది. అందులో ఆధ్యాత్మిక పత్రిక మరింత కష్టం. పుస్తకాలు చదవటమే తగ్గుతున్న ఈ కాలంలో ఇటువంటి గొప్ప బాధ్యతను తీసుకొని అందరిలోనూ ఆధ్యాత్మికపు ప్రకాశాన్ని కలుగజేయాలనే ఉద్దేశంతో ఇలాంటి పత్రిక నిర్వహించటం అనేది చాలా సాహసమైన విషయమే! అయినా ఇది ప్రస్తుత కాలానికి అవసరం.



ఈ పత్రికలో ముద్రింపబడుతున్న వ్యాసాలు కూడా సార్వజనీనంగాను ఉంటున్నాయి. శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన పద్ధతిలోనూ ఇందులో వ్యాసాలు ముద్రింపబడుతున్నాయి. ఏదేమైనా మనందరిలో ఆధ్యాత్మిక చైతన్యము పంచుతున్న ఈ మాస పత్రిక మరింత ముందుకు వెళ్లి ఎంతో అభ్యుదయాన్ని సాధించాలి అని భద్రాచల శ్రీసీతారామచంద్ర మాహాప్రభువుల వారిని ప్రార్థిస్తూ వున్నాము.

**కొమాండూరు ఇళైయవిల్లి స్థలశాయి**
స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం
భద్రాచలం

# ఆదరించి అభిమానించాలి



మన పత్రిక ప్రపత్తి శ్రీసన్నిధానం మూడు వర్షములు పూర్తయిన ప్రత్యేక సంచిక ఇది. శ్రీ అనగా లక్ష్మీ దేవి యని రూఢ్యర్థము. శ్రీసన్నిధానం అనగా లక్ష్మీ దేవి మరియు సంపద సమీపంలో ఉండుట అని అర్థం. సంపద, ఐశ్వర్యం అంటే భగవంతుని చరణారవిందములే! "ధనం మదీయం తవ పాద పంకజం" అన్నారు ఆళవందారులు. భగవద్రామానుజులు కూడా "యుగ్మ రుక్మ వ్యామోహితః తదితరాణి తృణాయ" అన్నారు. ప్రపత్తి అనగా శరణాగతి న్యాసము.

భగవంతుని పొందు సత్ మార్గాలలో కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తి మార్గాలు ప్రధానమైనవి. కర్మ జ్ఞానములు అద్వారాకములు. భక్తి సద్వారకము. ప్రపత్తి అద్వారకము, సద్వారకము కూడా.

అటువంటి ప్రపత్తి శ్రీసన్నిధానం అను పేరు కలిగి, అట్టి విషయములను తెలియజేసే ఈ పత్రికను చదివినా, విన్నా జ్ఞానమే కాకుండా సకల శుభాలు కలుగుతాయి. అట్టి ప్రపత్తి శ్రీసన్నిధానము పత్రికను ఆదరించి అభిమానించాలని కోరుకుంటున్నాను.

**అమరవాది వెంకటనర్సింహాచార్యులు**

# ఎన్నో అంశాలపై చక్కటి వ్యాసాలు


శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక పాఠకులకు ఎన్నోఎన్నో అపూర్వ విషయాలను అందిస్తూ వస్తుంది. ఇందులో ముఖ్యంగా వేదం, ఇతిహాసం, పురాణం, ప్రబంధం, ఆగమం, జ్యోతిష్యం, ఇలాంటి ఎన్నో అంశాలపై చక్కటి ఆసక్తి కలిగేటివంటి వ్యాసములను పెద్దల కృపతో అనుగ్రహిస్తున్నారు. వివిధ ప్రాంతాలలో ఉన్నటువంటి పాఠకులకు ఈ పత్రిక అందటం చాలా సంతోషకర మైనటువంటిది. ఇంకో ముఖ్యవిషయం ఏమిటంటే అందరిని కలుపుకుంటూ, ప్రోత్సహిస్తూ ప్రతి వారిలో వున్న ఒక ప్రజ్ఞని వెలికితీసేటువంటి ప్రక్రియ శ్రీసన్నిధానంకే స్వంతం అని చెప్పటం ఏమాత్రం అతిశయోక్తికాదు. భగవద్భాగవత ఆచార్య కటాక్షముతో ఉత్తరోత్తర అభివృద్ధి చెందాలని శ్రియఃపతి తిరువడిగళ్లలో ప్రార్థిస్తూ



అడియేన్ రామానుజ దాసన్

**డా।। పోలేటి రవికుమారాచార్యులు**

# భక్తి మానస పుత్రికా




శ్రీసన్నిధాన మిత్యాఖ్యా
మాసాధ్యాత్మికపత్రికా।
జీయాదాచంద్ర తారార్కం
భక్తి మానస పుత్రికా॥

శ్రీసన్నిధానం సుమతిం దదానం
శ్రీసంప్రదాయార్థ నిధిం దధానమ్।
విద్వద్వర వ్యాస తతే ర్నిధానం
జీయాత్ప్రపత్తేః వివృతిప్రధానమ్॥

**గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు**

# నూతన ఒరవడిలో శ్రీసన్నిధానం




ప్రపత్తి శ్రీసన్నిధానం పత్రిక పేరు ఎంతో మంచి పేరు. శ్రీ లక్ష్మీ సన్నిధానంలో మనను ఎప్పుడు నిలిపేదే ఈ శ్రీసన్నిధానం. "శ్రీ" (కైంకర్యం) సన్నిధానంలో ఎప్పుడు నిలిపేది. "శ్రీ" (ఐశ్వర్యం) సన్నిధానంలో మనను ఎప్పుడు నిలిపేది. "శ్రీ" సంప్రదాయ సౌరభాలను శ్రీవైష్ణవ లోకానికి అందించాలనే మహాసంకల్పంతో మన ముందుకు వచ్చినదీ శ్రీసన్నిధానం అనే మాస పత్రిక. ఈ శ్రీసన్నిధానం మూస పత్రికల బాటలో పోక నూతన ఒరవడిని సృష్టించి అందరి కరకమలాలలో ఒదిగి అందరిని చదివించుచున్నది.

శ్రీసన్నిధానం పత్రికలో వచ్చు వ్యాసాలు ప్రామాణికులైన పెద్దల శ్రీసూక్తులు, పరమ ప్రమాణములై పాఠకులకు విజ్ఞానాన్ని సత్సంప్రదాయ పరిమళాలను వెదజల్లుతూ సర్వజనామోదాలుగా విలసిల్లుచున్నవి.

ఈ శ్రీసన్నిధానం పత్రిక ప్రారంభించి వర్షత్రయమగుచున్న సందర్భముగా ఈ పత్రిక "త్రి శతాధిక" వర్షములు పాఠకులకు హర్షాన్ని పంచాలని అనేక మంగళాశాసనములు చేయుచున్నాము.

మీ కృషి వర్ధతాం అభివర్ధతాం
రామానుజ దాస
**వంగల వెంకటాచార్యః, విజయనగరం**

ఓం నమో నారాయణాయ
మహామహోపాధ్యాయ, శాస్త్రభాస్కర,
శాస్త్రరత్నాకర
రాష్ట్రపతి అవార్డు గ్రహీత
**డా. సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు**
క్వార్టర్ నెం. 108, జీవా క్యాంపస్,
జీయర్ ఇండిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ క్వార్టర్స్
ఇమెయిల్: svrracharyulu@gmail.com
acharyulusvrr@yahoo.in



# శోభాయమానంగా 'ప్రపత్తి శ్రీసన్నిధానం'

శ్రీమతే రామానుజాయనమః

'పత్రికా' మాధ్యమం అనేది చాలా బలవత్తరమైన భావావిష్కరణ ప్రక్రియ. నోటిమాటతో మామూలుగా చెప్పే విషయంకంటే, వ్రాతపూర్వకంగా చెప్పినదానికి ప్రామాణికత ఎక్కువ. భావావిష్కరణంలో వ్రాతకు (రచనకు) సావకాశత విశేషంగా ఉంటుంది. కనుకనే, ఉపన్యాసాలకంటే రచనలు, స్థిరంగా సమాజంపై ప్రభావం చూపిస్తాయి.

ఈ ప్రక్రియను లోకానికి సార్వజనీనంగా తీసికొనివెళ్లే బాధ్యతకల రంగమే పత్రికారంగం.

ఆధ్యాత్మికరంగంలో కూడా పత్రికలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలుగులో ఎందరో మహానుభావులు పత్రికాముఖంగా ఆధ్యాత్మిక చైతన్యాన్ని సమాజంలో కలిగిస్తున్నారు. మన జీయర్ స్వాములంతా ఇంచుమించుగా తలొక పత్రికా నిర్వహిస్తున్నారు. కొందరు ఆధ్యాత్మికవేత్తలు, ఆధ్యాత్మిక సమాజాలూ పత్రికా నిర్వహణం చేయడం ప్రసిద్ధమే.

పత్రికా నిర్వహణం చాలా కష్టం. అయినా సాహసంతో ఆ పనిని కొందరు ముందుకు తీసికొని వెళ్తున్నారు. 'ప్రపత్తి శ్రీసన్నిధానం' అనే పత్రిక కూడా అలాంటి ఉద్యమంలో ముందుకు దూసుకువెళ్తోంది. రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల ఆలంబనంగా లబ్ధప్రతిష్ఠులైన పెద్దలెందరో ఈ పత్రికను ఆదరించడం ముదావహం. ఇది మరింత శోభాయమానంగా విస్తృతంగా ఆధ్యాత్మిక ప్రపంచంలో విశేషాదరణను పొందాలని, పొందగలదని ఆశిస్తూ అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.

భవదీయుడు
రాష్ట్రపతి పురస్కృతుడు
'మహామహోపాధ్యాయ' 'శాస్త్రరత్నాకర' 'శాస్త్రభాస్కర'
**డా. సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు**
డైరెక్టర్, జీవా సంశోధన ప్రకాశనము, శ్రీరామనగరం (ముచ్చింతల్)

# సులభ వ్యవహార తెలుగు భాషలో చక్కని పత్రిక



శ్రీమతే రామానుజాయ నమః

పపత్తి శ్రీసన్నిధానం పత్రిక వారు ఎంతో శ్రద్ధగా ఈ కాలంలో ఈ వేదాంత సంబంధమైన పత్రికను ధైర్యంగా నడుపుచున్నారు. ఇది భగవంతుని యొక్క కటాక్షమే! ఈ పత్రిక ప్రతినెల ఎన్నెన్నో కొత్త కొత్త శీర్షికలతో మహాత్ములు, భాగవతోత్తముల లేఖనములతో అందముగా అందరి చేతిలోనికి అందుతోంది. దీని ద్వారా అనేక విషయాలు నేటి యువతరం అందుకుంటున్నారు.

పదకేళి అయితేనేమి, వ్యాసములైతేనేమి, సూక్తులు అయితేనేమి, కథనాలు అయితే నేమి సులభ వ్యవహార తెలుగు భాషలో ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి ఇటువంటి చక్కనైన భావాలతో ఉన్న పత్రికలు అరుదుగా ఉంటాయి. మీరు ఎంతో వ్యయప్రయాసలను ఎదుర్కొని ఈ పత్రిక నడపడం ఒక పెద్ద సాహసమే! పరమాత్మ శ్రీమన్నారాయణుడు మీకు అన్ని విధాల సహకరిస్తూ పత్రికా రంగంలో మీ పత్రికకు ఒక ప్రత్యేకత సమకూరుస్తున్నారు.

ఈ పత్రిక నిరంతరం ఇదే విధంగా దినదినాభివృద్ధి చెంది పాఠకులకు మంచి ప్రయోజనాన్ని కల్పించాలని ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తున్నాను. మీకు అనేక మంగళా శాసనములు. ఈ సందర్భంగా పాఠకులందరికీ శుభాకాంక్షలు

ఇట్లు.
మీ అభిమాన పాఠకుడు
**డా. సాహిత్య శిరోమణి మరింగంటి తిరుమళిశై ఆళ్వార్**
విజయవాడ

# ప్రపత్తిని పెంపు చేస్తూ.. శ్రీసన్నిధానం

శ్రీమతే రామానుజాయనమ:



శ్రీసన్నిధానం పత్రిక మూడు సంవత్సరాలను పూర్తి చేసుకున్నది. ఈ ముద్దు బిడ్డ ఇట్లా సర్వజనాకర్షకంగా, సర్వజనా హ్లాదకముగా ఎదుగాలని ఆ సర్వేశ్వరేశుడు శ్రీమన్నారాయణుడు సర్వకారణ కారణుడైన వాని శ్రీపాదాల చెంత విన్నపము చేస్తున్నాను.

దీని ద్వారా ఆస్తికుల విశ్వాసాలు మరింత బలపడాలి. జనులలో ఆధ్యాత్మిక చింత వికసించాలని పరమ కారణికుడైన స్వామి యొక్క అనుగ్రహపాత్రులై సుఖసౌఖ్యాలతో వర్ధిల్లాలి అని నేను కోరుకుంటున్నాను. ఇటువంటి ప్రజాసమూహాలు వర్ధిల్లాలి అని మన ఆళ్వార్లు శ్రీమన్నమ్మాళ్వార్లు మంగళాశాసనము చేసినారు. అదే తిరువాయ్‌మొజిలోని 'పొలిక పొలిక' అనే దశకము. ఇది ఐదవ శతకములో రెండవ దశకము. **పొలికపొలిక పోయత్తు నల్లాయిర్ చ్చాపమ్ నలియుమ్ నరకముం నైందనమునుకు ఇంగుయా దొన్నుమిల్లై**

**కలియుమ్ కెడుమ్ కండు కోణ్మిన్ కడల్వణ్ణన్ పూల్ంగళ్**
**మలియుప్పుకుందిశై ప్పాడి ఆటయుష్టితరకండోమ్**

దీని తాత్పర్యము: మంగళము మంగళము ఓ చేతనులారా! ఈ ఆశ్చరమును వినండి. ఈ భూలోకమున విష్ణుభక్తులు భగవంతుని గుణములను పాడుచు పరవశులై యధేచ్ఛగా సర్వత్రా విహరించుతున్నారు. కనుక భగవన్నామ శ్రవణము సంకీర్తనముల వల్ల ప్రాణుల పాపములు నశించినవి. నరకమును చూడబోయేవారు ఎవ్వరూ లేరు. యమునికి పనిలేకున్నది. ఈ కలి యుగము ధ్వంసమై కృతయుగముగా మారినది. ఈ సమృద్ధి ఇట్లే ఎల్లప్పుడూ కొనసాగుతూ

మన శ్రీసన్నిధానము నిజముగా ప్రపత్తిని పెంపు చేస్తూ శ్రియః పతి యొక్క మంగళకర దృష్టులలో ఏటికేడు వర్ధిల్లునుగాక!

**కండ్లకుంట వెంకటనరసింహాచార్యులు, చైతన్యపురి**

## శ్రీసన్నిధానం - ఆధ్యాత్మిక సేవ

**శ్రీమద్వైదికసంప్రదాయవిదితా నంశా నమూల్యాన్ బహు గ్రంథస్థాం శ్చ విదాం వరైః సముదితాన్ శ్రీసన్నిధానాహ్వయా, సైషా మాసికపత్రికా ప్రదదతీ ప్రేమ్ణోపహారోపమాన్ ఆమోదం జనయేత్ సతాం చ సతతం సర్వాస్తికానాం హృది.**



వైదిక సంప్రదాయంలో ప్రసిద్ధమైనవి, అమూల్యమైనవి, అనేక గ్రంథాలలో ఉన్నవి, మహానుభావులైన పండితులచే అనుగ్రహింపబడినవి అయిన పలు విషయాలను ప్రేమతో, ఉపహారాలను వలె శ్రీసన్నిధానం అనే పేరు కలిగిన ఈ మాస పత్రిక అందజేస్తూ సత్పురుషుల హృదయాలలో, ఆస్తికులు అందరి హృదయాలలో ఎల్లప్పుడూ ఆనందాన్ని కలిగించాలి.

అనాదిగా మన భారత దేశంలో మన భారతీయులందరికీ జీవనాడిగా ప్రకాశిస్తున్నది. వైదిక సంప్రదాయం. ఈ వైదిక సంప్రదాయమే భారతీయులందరినీ ఒకే తాటిపై పూర్వకాలం నుండి నిలబెట్టింది, నిలబెడుతున్నది, నిలబెడుతుంది కూడా. ఈ సంప్రదాయాన్ని పరిరక్షించి, ప్రచారం చేయడానికి అనాదికాలంగా మహర్షుల నుండి ఈనాటి మహనీయుల వరకు ఎంతోమంది తమ వంతు కృషిని చేస్తూనే ఉన్నారు.

ఈ ప్రచారంలో భాగంగా, చాలా కాలం నుండి పలు భాషలలో పలు పత్రికలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయి. వాటిలో ప్రపత్తి శ్రీసన్నిధానం అనే తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక ఒకటి.

ఈ మాస పత్రిక ప్రారంభించి ఇప్పటికి మూడు సంవత్సరాలే అయినా ఇది ఎంతోమంది పెద్దల అభిమానాన్ని పొందిన అదృష్టాన్ని కలిగినది. పలువురు మహనీయులైన పండితుల వ్యాసాలు ప్రతినెలా ఈ మాసపత్రికలో ప్రచురింపబడడం దీనికి ఒక నిదర్శనం. నిర్వహకులు ఎంతో శ్రద్ధతో, చక్కగా ఈ పత్రికను పండిత పామర రంజకంగా నిర్వహించడం ఆస్తికులకందరికి ఆనందదాయకం అవుతున్నది.

ఈ శుభతరుణంలో, ఈ పత్రిక పాఠకునిగా, రాబోయే కాలంలో కూడా ఈ పత్రిక ఇంకా ఎంతో అభివృద్ధి చెంది, మరింత మంది పెద్దల మంగళాశాసనాలను పొంది, మరెన్నో మంచి మంచి వ్యాసాలతో ఆస్తిక పాఠకులను మెప్పించి, కృతార్థతను పొందగలదని ఆశిస్తూ, నిర్వహకులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. స్వస్తి.

**డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు, నర్సాపురం.**

## అభినందనలు

వార్షికోత్సవ సందర్భముగా ప్రపత్తి శ్రీసన్నిధానం 2025 జనవరి సంచికను ప్రత్యేక సంచికగా వెలువరించ బోవడం మాకు పరమానందాన్ని కలిగించే విషయం. సుప్రసిద్ధులైన,



అనుభవజ్ఞులైన ఉభయ వేదాంత పండితుల ద్వారా ప్రామాణికంగా సంప్రదాయ విషయా లను వ్యాసాల రూపంలో సులభ శైలిలో, సుందరంగా సంగ్రహంగా శ్రీసన్నిధానం పత్రికలో వరుసగా ప్రచురిస్తున్నారు.

మీ కృషి సర్వదా ప్రశంసనీయము. భక్తినివేదన, గోవిందప్రియ, భక్తామృతం వంటి మాసపత్రికల వలె శ్రీసన్నిధానం పత్రిక కూడా సంప్రదాయ ప్రచారములో ముఖ్యభూమికను పోషిస్తున్నందుకు పత్రికా నిర్వహణ బృందాన్ని త్రికరణ శుద్ధిగా అభినందిస్తున్నాను..

రామానుజ సంప్రదాయ సేవలో నిమగ్నులైన శ్రీసన్నిధానం పత్రికా నిర్వాహక బృందమునకు శ్రీశ్రియః పతులు సమస్త సన్మంగళాలను కలిగించాలని ఆకాంక్షిస్తూ

ఆచార్య పాదరేణువు,
**సముద్రాల శఠకోపాచార్యః,** ప్రధాన కార్యదర్శి
సత్సంప్రదాయ పరిరక్షణ సభట్రస్టు

### శ్రీసన్నిధి పదకేళి (10) విజేతలు

సమాధానాలు పంపినవారు. శ్రీమతి మామిడి విజయ, హైదరాబాద్, శ్రీ టి.జి. శ్రీనివాసాచార్యులు, తూ.గో.జిల్లా శ్రీమతి జి.సువర్ణ, సిరిసిల్ల, విజేతలకు డిసెంబర్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది. పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!! సరియైన సమాధానాలు జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

ప్రపత్తి శ్రీసన్నిధానం పత్రిక పంపించడానికి మీ పోస్టల్ చిరునామాను తప్పనిసరి పంపించగలరు

# జ్ఞాతవ్యార్థం-సార్థక జీవనం



- శ్రీమతి సముద్రాల శారద

ఆహార నిద్రామైథునాలనే లక్షణములున్ననూ సకల జీవరాశులలో మానవుడు మాత్రమే ప్రత్యేకంగా ఉత్కృష్టంగా నిలిచి ఉన్నాడు. కారణం! మానవునికి గల జ్ఞానము, ఆలోచనా వైచిత్రి, మరియు నిక్షిప్తీకరించిన పరంపరాగత జ్ఞాన వైదుష్యం. వాటివల్లనే మానవుడు - ఆధ్యాత్మిక సాధన, ఉజ్జీవనం అనేది పొందగలుగుతున్నాడు. జ్ఞానమంటే భగవద్విషయ జ్ఞానమనీ విద్య అంటే "యా విద్యా సావిముక్తమే' అని సకల దుఃఖ విమోచనమును కల్గించు ఆధ్యాత్మిక విద్య అనియే పరిపూర్ణమైన అర్థం. లౌకికార్థ ములను ఎన్ని విశ్లేషించినా విషయాంతము వరకు పరిశీలించినట్టయితే భగవద్విషయ జ్ఞానమే పరిపూర్ణ జ్ఞానము అనేది నిర్వివాదము.

అందుకే అనేక అంశాలలో ఎంత పరిజ్ఞానం ఉన్నా జ్ఞాతవ్య అర్థాలు (తెలుసుకోవలసినవి) తెలిసినపుడే జీవనం సార్థకం అవుతుంది అనేది సత్యం.

గొప్ప తపఃశక్తి ద్వారా, సాధన ద్వారా, అపౌరుషేయములగు వేదముల ద్వారా పరిపూర్ణ జ్ఞాన సారాన్ని లోక క్షేమం కొరకు శాశ్వతంగా నిలిచేట్టుగా చేసినవారు, మన ఋషులు, ఆళ్వారులు, ఆచార్యులు, మహాపురుషులు. నిర్మాణాత్మకంగా, (దేవాలయాది నిర్మాణముల ద్వారా), ఆచారముల ద్వారా (సంస్కృతి సంప్రదాయాల ద్వారా) జ్ఞానాత్మకంగా గ్రంథస్థమగు భావధారగా నిక్షిప్తం చేసి ఉంచారు. అందుకే ఆధ్యాత్మిక కట్టడాలయినా, సంస్కృతీ సంప్రదాయాలయినా, పాచీన గ్రంథాలయినా, మరేవయినా అవన్నీ జాతి సంపదలు. వాటిని నిక్షిప్తం చేయటం, రక్షించటం, సుసంపన్నం చేయటం. ప్రధానంగా తరతరాలకు అందేలా శాశ్వతం చేయటం అందరి కర్తవ్యం ! మరియు క్షేమకరంకూడా!

అందుకే అటువంటి గొప్పవారి చరిత, నడవడి విధానం మనకు ప్రేరణ కల్గిస్తుంది.

పూర్వాశ్రమంలో అద్వైత సన్యాసి, మహా విద్యాంసుడైన యజ్ఞమూర్తి అరుళాల పెరుమాళెంబెరుమానార్ గా (దేవరాజమునులుగా), త్రిదండి యతులుగా, భగవత్ రామానుజుల శిష్యులుగామారారు ఎంబెరుమానార్ అనే వారి పేరు, వైభవం కూడా చూసి కొందరు అపరిచితులు పొరపాటుగా వారినే యతిరాజులుగా భావించటం దేవారాజముని అపచారంగా భావించారు.

**"ఘుణాక్షత లిపిన్యాయాత్ అయం దేహ స్సమాగతః"** అని ఒక పురుగు కర్రను తొలుస్తూ వెళ్ళగా అది అక్షరాలుగా మారి దానికి పుణ్యం సిద్ధించినట్టు ఈ దేహం నాకు లభించింది. అని అంటూ మీ సేవే నాకర్తవ్యం అని ప్రార్థించారు. ఆచార్యుల ఆజ్ఞలో వారి మఠంలో సన్నిధిలోనే "వరదరాజ పెరుమాళ్ళకు ఆరాధన చేస్తూ అక్కడే నివాసం చేసారు దేవరాజమునులు.

జాతికి విలువైన సంపద గ్రంథములే! మహా మేథస్సుగల మహనీయులెందరో వారి సాధన ద్వారా గురువుల బోధనల ద్వారా పరిపక్వత పొంది, విలువైన విషయాలను వాఙ్మయ రూపంలో అందించారు. అలాగే

**చకార లోక రక్షార్థం**
**స్ఫుటం ద్రావిడభాషయా**
**ప్రబంధం జ్ఞాన సారాఖ్యం**
**సర్వశాస్త్రోప బృంహితం**

అని లోక రక్షణ కొరకే వారు ద్రావిడభాషలో సర్వశాస్త్ర సారాన్ని తెలిపే "జ్ఞాన సారం" అనే గ్రంథాన్ని దేవరాజ మునులు రచించారు. అలాగే గురువు యొక్క ప్రాధాన్యం తెలియ పరచే విధంగా **"గురుం భగవతస్సాక్షాత్ అవతారం**

# శ్రీరామానుజ సుధామాధురి



**విచింత యేత్"** ఆచార్యులను సాక్షాత్ భగవంతునిగా భావించాలి అని బోధిస్తూ 'ప్రమేయసార'మనే ప్రబంధాన్ని రచించారు.

ఈ రెండు గ్రంథాల ద్వారానే కాకుండా వారి చరిత్ర విశేషాల ద్వారా కూడా దేవరాజమునులకు ఆచార్యులయెడ (భగవద్రామానుజుల) గల భక్తి వెలివరించబడుతుంది.

తర్వాత వచ్చిన సాంప్రదాయ వాఙ్మయంలో, వ్యాఖ్యాన గ్రంథాల్లో ఎందరో కృతికర్తలు వీరి గొప్పతనాన్ని ప్రస్తావించారు. వడుగ నంబి పరమపదించినప్పుడు "తిరునాడుకు పోయారు." అని ఒక వైష్ణవ స్వామి అనగా, అలా అనకూడదు. "ఆచార్య తిరువడి చేరారు" అని ఆ మాటను సరి చేశారట! నేటికీ ప్రపన్నులు పరమపదిస్తే ఆచార్య తిరువడిగళ్ చేరారు అని చెప్తారు.

వారు మాట్లాడే మాటల్లో కూడా సంప్రదాయ రహస్యాలు ప్రతి బింబించేవట!

శ్రీ వచన భూషణం, గురు పరంపర ప్రభావం మొదలగు గ్రంథాలలో వీరి ప్రస్తావన ప్రశంస కనిపిస్తుంది.

గొప్ప సాంప్రదాయ గ్రంథాలు రచించిన వేదాంతదేశికులు కూడా తన "రహస్య త్రయసారం" అనే గ్రంథంలో వీరి రచనల్లోని కొన్ని కారికలను స్వీకరించారు అని పెద్దలు ఈ విధంగా విశ్లేషిస్తారు.

1) ఒక వస్తువు యొక్క నిరూపణ విశేషణం తెలుసు కున్నప్పుడే దాని అర్థాన్ని తెలుసుకోవటం వీలవుతుంది. అంటే భగవంతుని విశేషణమైన లక్ష్మీదేవి గురించి తెలిస్తేనే విశేష్యమయిన భగవంతుని గురించి తెలుస్తుంది.

2) అశక్తులయి ఏ సాధనములేక భగవత్ పాప్తిని పొందగోరినవారు మహా విశ్వాసంతో భగవత్ చరణాలనే ఆశ్రయించాలి.

3) 'నమః' అంటే తమ భారాన్ని భగవంతుని సన్నిధిలో సమర్పించటం. (ఏ ఉపాయ అనుష్ఠానం గురించి చూడక రక్షించమని) నమః అని రక్షణకై భగవంతుని ప్రార్థించటం.

అన్ని భారాలను భగవంతుని ఎదుట సమర్పించడమే నమః శబ్దం యొక్క అర్థం అను (ఈ మూడు కారికలను) దేవరాజమునుల గ్రంథాలలోని సారాన్ని స్వీకరించారు అని సాంప్రదాయ గ్రంథ విశ్లేషకులు వివరిస్తారు. అందుకే వీరిని జ్ఞాన భక్తి వైరాగ్య సంపన్నులుగా పంచమోపాయ నిష్ఠ కలవారిగా భగవద్రామానుజుల పదాశ్రితులుగా స్తుతిస్తారు.

"గురుపాదసేవయే శిష్యులకు ప్రాప్యము గురువును సాక్షాత్ భగవంతుని అవతారం అనే భావించాలి." అని ఆచార్య భక్తిని తెలియజేస్తూ, మానవులకు ముక్తి హేతువైన జీవన మార్గాన్ని తెలియజేస్తూ వారు జ్ఞాన సారము, ప్రమేయ సారము అను రెండు గొప్ప గ్రంథాలను ద్రావిడ భాషలో రచించారు.

ఈ గ్రంథాలకు ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలు కూడా వచ్చాయి. పెద్దల వివరణను అనుసరించి మరికొన్ని గ్రంథ విశేషాలను తెలుసుకుందాము.

ధర్మార్థ కామ మోక్షాలలో పరమపురుషార్థము మోక్షమే! సర్వ శాస్త్ర జ్ఞానము యొక్క పరాకాష్ట మోక్షమే! ఆ మోక్షాన్ని పొందటానికి తెలుసుకోవలసిన జ్ఞానాన్ని తెలియచెప్పే గ్రంథంగా "జ్ఞాన సారం" గ్రంథాన్ని గురించి పెద్దలు వివరిస్తారు. తత్త్వము హితము పురుషార్థము అను మూడు మానవులకు ఉత్తమమైన ఉజ్జీవన హేతువులు. అటువంటి జ్ఞానాన్ని తెలియచెప్పే గ్రంథంగా జ్ఞానసార గ్రంథాన్ని అభివర్ణిస్తారు. (మిగతా 18 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి - సుభాషితం | మంచి మాట

## పరత్వాది పంచక స్తుతి

రచయిత- వాచ్య వరదాచార్యుల గారు.

పరమార్థశ్లోకద్వయం (అర్చరాది) అనే శ్లోకాలు వ్రాసిన వారు. వీరు ఒక్కరే మహా విద్వాంసులు. ఎంతో గంభీరమైన వేదాంత విషయములను అతి సులభంగా అందించగలిగిన మహానుభావులు. వీరి పరిచయం కొంత అర్చిరాది శ్లోకముల వివరణ సందర్భంలో గ్రహించినాము.

ప్రస్తుతము వారు పరమాత్మకు సంబంధించి ప్రధానమైన 5 అవతారాల సంగ్రహ చరిత్ర తెలుపుచున్నారు మనకు.

పేరులోని ఔచిత్యం

పరత్వమే మొదలుగా గలిగిన పంచక = ఐదింటికి 5 శ్లోకములలో తెలిపిన అవతారాల గూర్చి స్తోత్రం చేయబడింది.

పరమాత్మకు 5 అవతారాలున్నవి.

వానినే పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారాలు అంటాము.

1. పరవాసుదేవస్తుతి
2. వ్యూహ వాసుదేవస్తుతి
3. విభవ స్తుతి
4. అంతర్యామిస్తుతి
5. అర్చావతారస్తుతి

ఆ పిదప ఫలశృతి. ఒకశ్లోకంలో మొత్తం 5+1 శ్లోకాలతో గూడినది.

1.పరవాసుదేవుడు: అంటే పరమ పదంలో ఆదిశేషునిపై శ్రీ, భూ, నీళాది దివ్య మహిషీ గణంతో ప్రకాశించే శ్రీమన్నారాయణుడు.


2.వ్యూహవాసుదేవుడు: అంటే క్షీరాబ్ధినాథుడు. పాలసముద్రంలో నున్న వ్యూహమూర్తి తక్కిన 3 మూర్తులకు మూలభూతుడై యున్నవాడు.

3.విభవావతారము: అనగా పది అవతారాలే గాక అనేకావతారములు గలిగిన అవతారము.

4.అంతర్యామి: అనగా అన్నింటి యందు చేరియున్నవాడు.

5.అర్చావతారం: అంటే మనందరికి దర్శన, స్పర్శనాదుల కనుగుణంగా అర్చించుటకు వీలుగా అక్కడక్కడ విగ్రహాది రూపంలో నున్నట్టిది.

ఇప్పుడు పైన చెప్పిన 5 అవతారములకు సంబంధించిన 5 శ్లోకములను ప్రతిపదార్థ తాత్పర్య విశేషాలను విందాము. అందు మొదటి పరవాసుదేవుని స్తుతిరూపమైన శ్లోకము



శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

ఉద్యద్భానుసహస్ర భాస్వర పరవ్యోమాస్పదం నిర్మల
జ్ఞానానంద ఘన స్వరూప మమల జ్ఞానాదిభిష్షడ్గుణైః
జుష్టం సూరి జనాధిపం ధృత రథాంగాబ్జాది భూషోజ్జ్వలం
శ్రీభూసేవ్యం అనంత భోగి నిలయం శ్రీవాసుదేవం భజే

ప్రతి పదార్థములు:-

ఉద్యత్ = ఒక్క సారిగా ఉదయించుచున్న భాను, సహస్ర భాస్వర = వేయిమంది సూర్యుల యొక్క కాంతి వంటి కాంతిగల, పరవ్యోమ = 'పరమాకాశము' అనబడు శ్రీ వైకుంఠమున, ఆస్పదం = నివసించుచున్నట్టి, నిర్మల = దోషము లేశమైనను లేని, జ్ఞాన = లోపల బయట అంతట గలిగిన జ్ఞానము, ఆనంద = ఆనందములచే, ఘన స్వరూపం = గొప్పయైన స్వరూపము కలిగియున్న, అమలం = దుర్గుణములకు దూరుడై యున్న, జ్ఞానాదిభిః = సమస్త కల్యాణగుణములను తమలో ఇముడ్చుకొని యున్న, జ్ఞాన- శక్తి, బల - ఐశ్వర్య, వీర్య - తేజములు అనబడు షడ్గుణైః = 6 గుణములతో, జుష్టం = కూడుకొని యున్న, సూరి జనాధిపం = నిత్య సూరుల సమస్తమైన ప్రవృత్తి నివృత్తులను తన స్వాధీనమున ఉంచుకొన్నట్టియు, ధృత = ఇతర భూషణ ములతో బాటుగా ధరింపబడిన, రథాంగ = చక్రము, అబ్జ = పద్మము, ఆది = మొదలైన, భూష = ఆభరణముల చేత, ఉజ్జ్వలం = ప్రకాశించుచున్న, శ్రీ భూసేవ్యం = శ్రీదేవి,

భూదేవి మూర్తుల చేత సేవింపబడుచున్న, అనంత భోగి నిలయం = ఆదిశేషుని యొక్క శరీరము నిలయముగా గలిగిన, శ్రీవాసుదేవం = శ్రీవాసుదేవుని, భజే = సేవించు చున్నాను.

తాత్పర్యము: శ్రీవైకుంఠంలో నున్న పరమాత్మ స్తోత్రం ఇది, వైకుంఠము, పరమపదము, అయోధ్య, అపరాజిత, పరమాకాశం, త్రిపాద్విభూతి మొదలైన పేర్లతో పిలువబడుతుంది. శ్రీమన్నారాయణుని దివ్య ధామము. "న తత్ర సూర్యోభాతి. న చంద్ర తారకా" అంటే అక్కడ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, అగ్ని మొదలైన తేజః పదార్థములు ప్రకాశించవు. ఆ ధామము వేయి సూర్యులు ఒక్క సారి ఉదయించితే ఎంత కాంతి ప్రసరించునో అంతటి కాంతితో వెలుగొందుతు ఉంటుంది. అది పరమాత్మకు నివాస స్థానము. పరమాత్మ రూపము శుద్ధమైన జ్ఞానానందాత్మకం. ఆయన రూపము ఆనందమే! అంటే ఆనందరూపము, ఆనందగుణకము, ఆనందప్రదము అన్నమాట.



పరమాత్మకు గల సహజమైన 6 గుణములు, జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వరము, వీర్యము, తేజము.

ఇవి ఎవరో ఇచ్చినవి, కొంత కాలమే ఉండునవి, తిరిగి పోవునవి కావు. ఎందుకివి? అంటే ఆశ్రిత రక్షణము కొఱకు. కల్యాణగుణములు గలవాడు. దుర్గుణాలు లేనివాడు. అక్కడ వుండే నిత్యసూరులు, వారు చేయవలసినవి, విడువవలసినవి అన్ని తన అధీనంలో వుంచుకొనువాడు. నిత్య సూరులంటే ఎట్లుందురో వారితోవున్న పరమపదము ఎట్లుంటుందో ఈ వాక్యం చెప్పుతుంది.

"తద్విష్ణోః పరమంపదం, సదా పశ్యంతి సూరయః, దివీవ చక్షు రాతతం, తద్విప్రాసో, విపన్యవో జాగృవాం సః సమిందతే" అనగా అది విష్ణువు యొక్క దివ్య ధామము. సదా పశ్యంతి సూరయః = అక్కడ నిత్యసూరులు ఎల్లప్పుడు పరమాత్మను చూస్తుంటారు. చక్షు రాతతం = కన్నులచే నిండినదిగా వుంటుంది. దివి = స్వర్గము, స్వర్గము అనగానే ఇంద్రునిది అనుకునేరు. మరేమిటంటే 'సస్వర్గః' అది స్వర్గము పరమపదమే స్వర్గమంటే! 'స్వర్గ పాథేయము' అంటాము గదా!

ఇక వారికి మూడు విశేషణాలున్నవి. 'విప్రాసః విపన్యవః జాగృవాంసః' దీనికి భాష్యకారులు వివరణ ఇచ్చారు.

విప్రాసః = మేధావంతులు, మేధావంతులు అంటే పరమాత్మకు సంబంధించిన యధార్థ తత్వజ్ఞానము పరిపూర్ణంగా గలవారు.

2. విపన్యవః = స్తుతి శీలురు, అంటే పరమాత్మను స్తోత్రం చేస్తుంటారు. 'ఏతత్సామగాయన్నాస్తే' ఎల్లప్పుడు సామగానం చేస్తుంటారు.

3. జాగృవాంసః = అస్ఖలితజ్ఞానులు. అంటే జ్ఞానం సంపూర్ణంగా ఎల్లప్పుడు భాసించుతూవుంటుంది. మనకు జ్ఞానం వుంటుంది గాని మరచిపోతాము. వాళ్ళకు మరపు వుండదు. అట్టి నిత్యసూరులకు అధిపుడు.

శంఖ చక్రాది పంచాయుధములు, అందమైన ఆభరణములు వీటి చేత ప్రకాశించుతూ వుంటాడు. దివ్య దేవేరులు శ్రీదేవి, భూదేవి, నీళాదేవి. ఇంతేనా 'దేవీ సహస్రం' అన్నారు భట్టరువారు శ్రీ గుణరత్నకోశంలో 'భోగ్యా వామపి నాంతరీయకతయా' అనే శ్లోకంలో శ్రీదేవి అందరిలో ప్రధానురాలు, ప్రథమురాలు, 2వ స్థానం భూదేవిది. తరువాతి స్థానం నీళాదేవిది. అందుకే భట్టర్ వారు "దేవి! త్వామను నీళయా సహ మహీ" అన్నారు అంటే ఓ శ్రీదేవీ! నీళయా సహ మహి త్వామను, మహీ= భూదేవి, నీళయా సహ = నీళాదేవితో గూడి, దేవీ సహస్రం = వేల సంఖ్యలు దేవేరులు, త్వాం = నిన్ను, అను = అనుసరించుచున్నారు అన్నారు. ఈ శ్లోకంలో వాచ్య వరదులు 'శ్రీభూసేవ్యం' అని చెప్పినారు. వారితో సేవింపబడుచున్న పరమాత్మ శేషశయ్యపై విరాజిల్లు చుండును.

అటువంటి వాసుదేవుని సేవించుచున్నాను.

అని మొదటి శ్లోకంలో మొదటి అవతారస్తోత్రం గలదు.

తర్వాత రెండవ అవతారస్తుతి.

(మరికొంత వచ్చే సంచికలో తెలుసుకొందాము)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

**శ్లో॥ అ.క.చ.ట.త.ప.య.శ.వర్గాః।**
**ఖగేశ మార్జాల సింహ శునాం।**
**సర్పా2ఖు మృగా దీనాం।**
**నిజ పంచమ వైరిణా మష్టౌ॥**

తా॥ అ.క.చ.ట.త.ప.య.శ. అని ఎనిమిది వర్గములు కలవు. గరుడము, మార్జాలము, సింహము, శునకము, సర్పము, మూషికము, గజము, శశకము అను యోనులు క్రమముగా నున్నవి. దీనిలో ప్రతి వర్గము తన వర్గస్థానము నుండి ఐదవ వర్గ స్థానముతో శతృత్వము గలదగుచున్నది.

(బృహత్సంహిత)

**శ్లో॥ అష్టవర్గ మనుసృత్య కథయామ్యపరాజిత।**
**దంపతీ స్వామి భృత్యౌచ గృహ గ్రామాధిపౌ సదా।**
**లాభా2లాభౌ చ యేషాంతే కథయేత్వపరాజిత॥**

తా॥ అష్టవర్గములను అనుసరించి భార్యా భర్తలకు, స్వామి, భృత్యులకు, గృహాధిపతి, గ్రామాధిపతులకు మిత్ర శతృత్వములను లాభనష్టములను నిర్ణయించడము ఫలములను తెలుసుకోవడము అవసరము. (అపరాజిత పృచ్ఛ)

**శ్లో॥ వర్గేశాస్తార్క్ష్య మార్జాల సింహాశ్వా స్సర్పమూషికాః।**
**ఇభే2ణౌ పూర్వతస్తేషాం స్వవర్గాత్పంచమోరిపుః।**
**తస్మాత్స్వవైరి వర్గస్య దిశి వాసోన శోభనః॥**

**శ్లో॥ అకారదిషు వర్గేషు దిక్ష్వష్టతు యధాక్రమం।**
**గృధ్ర మార్జాల సింహాశ్వ సర్పా2ఖుగజశాశకాః।**
**దిగ్వర్గానా మియం యోని స్వవర్గాత్పంచమో రిపుః।**
**రిపువర్గం పరిత్యజ్య శేషవర్గ శ్శుభప్రదః॥**

(వశిష్ఠసంహిత)

గ్రామ మధ్యన గల గ్రామదేవత నుండి గ్రామమునకు వర్గములను ఏర్పరచి అందులో గృహమును నిర్మించు యజమాని తన శతృవర్గ దిశా స్థానము నందు గ్రామములో గృహమును నిర్మించకూడదు. మిగతా వర్గ దిశ స్థానముల యందు గృహనిర్మాణము జరుప వచ్చుననియు యిందు స్పష్టముగా తెలియ చేయడమైనది.

**శ్లో॥ సాధ్యవర్గం పురః స్థాప్య పృష్టత స్సాధకం న్యసేత్।**
**విభజే దష్టభిశ్శేషం సాధకస్య ధనం భవేత్॥**

**వృత్యయే నాశనం తస్య**
**ఋణ మల్పం ధనాచ్ఛుభం।**
**ఆరభ్య సాధకం దిష్ట్వం**
**సాధ్యం యావచ్చతుర్గుణం॥**
**విభజే త్సప్తభి శ్శేషే**
**సాధకస్య ధనం తదా॥**

(నారద సంహిత)

**శ్లో॥ సాధ్యవర్గం పురః స్థాప్య**
**పృష్టత స్సాధకస్యచ।**



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల**
**సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

**విభజే దష్టభిశ్శేషం సాధకస్య ధనం స్మృతం।**
**వృత్యే యేనా2గతం శేషం సాధకస్య ఋణంస్మృతం।**
**ధనాధికం ఋణం స్వల్పం సర్వసంపత్ప్రదం స్మృతం॥**

(విశిష్ట సంహిత)

సంహితలలో పై ప్రమాణములుండుట వలన గృహ నిర్మాణము చేయు యజమాని గృహమును నిర్మించుటకు ఏ గ్రామమందు నిర్మించదలచునో ఆ గ్రామ వర్గమునకు యజమాని నామవర్గమునకు పై శ్లోకము యొక్క ప్రమాణములననుసరించి ధన ఋణములను చక్కగా తెలుసుకొని తన వర్గమునకు ఋణము కన్నను ధనము అధికముగా కలుగచేయునట్టి గ్రామ వర్గమునందు గృహనిర్మాణము చేసుకోవడము ఉత్తమమని నిరూపించబడియున్నది.

**శ్లో॥ స్వవర్గం ద్విగుణం కృత్వా పరవర్గేణ యోజయేత్।**
**అష్టభిస్తు హరేద్భాగం యో2ధిక స్స ఋణీభవేత్॥**

(జ్యోతిర్నిబంధం)

**శ్లో॥ స్వవర్గం ద్విగుణం విధాయ పరవర్గాఢ్యంగజైశ్శేషి తం।**
**కాకిణ్యా స్తనయో శ్శతద్వి వరతో యస్యాధిక స్సోర్దదః॥**

(ముహూర్త చింతామణి)

గృహము నిర్మించుటకు యజమాని తాను గృహము నిర్మించదలచిన గ్రామ వర్గమునకు యజమాని నామవర్గమునకు ధన ఋణాదులను తెలుపు కాకిణులను

నిర్ణయించి తెలుసుకొని యజమాని నామ వర్గ కాకిణుల కంటే గ్రామ వర్గ కాకిణులు యెక్కువగాయున్న గ్రామమున గృహమును నిర్మించుకొనవలయును.

గృహ నిర్మాణము చేయు యజమాని గ్రామ వర్గమునకు మరియు నామ వర్గమునకు కుల ధన ఋణములను. లాభ వ్యయములను, శుభ అశుభములను నిర్ణయించుకుని గృహమును నిర్మించు యజమాని తన నామవర్గమునకు సర్వవిధముల యోగ్యముగా ధనప్రదముగా సుఖదాయకముగ శుభఫలప్రదాయకముగా వున్న గ్రామము నందు గృహ నిర్మాణము జరుపుటకుగాను ఈవర్గములు ప్రయోజన కరములుగా వుండునని స్పష్టమగుచున్నది.

**శ్లో॥ అకారాదిషు వర్గేషు దిక్షు ప్రాగాదిషు క్రమాత్**
**గృధ్ర మార్జాల సింహ2శ్వఖరా2ఖు గజశాశకాః॥**
**దిగ్వర్గానా మియం యోని స్స్వవర్గాత్పంచ మోరిపుః॥**
**రిపువర్గం పరిత్యజ్య శేష వర్గా శుభ ప్రదాః॥**

గృహనిర్మాణము చేయు యజమాని తన నామ వర్గమునకు యోగ్యముగానుండు గ్రామమును నిర్ణయించుకొని తదుపరి గ్రామమునకు గ్రామ మధ్యము నుండి దిక్కులను, వర్గులను యోనులను ఏర్పరచుకొని అందులో తన నామాద్యక్షరము వున్నదిశ స్థానము స్వవర్గ మనియు ఆస్థానములో గృహ నిర్మాణము జరిపిన బలము తేజస్సు గలుగునని స్వవర్గ దిశాస్థానము మొదలు ఐదవ వర్గ దిశాస్థానము శత్రు స్థానమనియు, శతృస్థానమందు గృహనిర్మాణము కావించిన శతృభయము సర్వనాశనము కలుగును. మిగతా మిత్రవర్గ సమవర్గ దిశలలో మిత్రస్థానమందు గృహము నిర్మించిన మిత్రవృద్ధియు, సమవర్గ స్థానమందు గృహ నిర్మాణము కావించిన సామాన్యముగా నుండునని వర్గప్రయోజనము తెలియచేయబడినది.

**శ్లో॥ స్వవర్గ షష్టా విజయంచలక్ష్మీః**
**త్రిసప్తకో భోగ మతీవ సౌఖ్యం।**
**అష్టం చతుర్థీ నిధనం దరిద్రం**
**బాణే చ మృత్యుశ్చ యధా క్రమేణ॥**

ఈ ప్రమాణానుసారముగా గృహనిర్మాణము చేయు యజమానికి గల స్థలమునకు వర్గములను ఏర్పరచి గృహ యజమాని నామాద్యక్షరము ఏ వర్గ స్థానమున వున్నదో ఆవర్గ స్థానమున గృహనిర్మాణము కావించిన విజయము సమకూరునని, మూడవ వర్గ స్థానమున భోగమని, నాల్గవవర్గ స్థానమున దరిద్ర్యమని, ఐదవ వర్గ స్థానమున శతృభయమని మృత్యుబాధలని, ఆరవ స్థానము లక్ష్మీకరమని, ఏడవ వర్గ స్థానమున సౌఖ్యమని, ఎనిమిదవ వర్గ స్థానము మృత్యుభీతియు కలుగునని వ్యవహరించుదురు.

(మరొక శ్లోకములో )

శ్లో॥ సవర్గ షష్టౌ విజయంచలక్ష్మీ
త్రిసప్తకో భోగ మతీవ సౌఖ్యం
అష్టం చతుర్థీ ప్రథమే దరిద్రా
బాణేచ మృత్యుశ్చ యధాక్రమేణ॥ (ప్రాఠభేధము)

గృహయజమాని నిర్మాణము చేయు స్థలమునకు వర్గములను ఏర్పరచి అందులో గృహ నిర్మాణ కర్త నామాద్యక్షరము ఏవర్గ స్థాన మందున్నదో ఆవర్గ స్థానము ప్రథమ వర్గమనియు దీనినే స్వవర్గ మనియు క్రమముగా గణన చేయగా స్వషష్ఠ వర్గములు విజయలక్ష్మి నొసగుననియు, తృతీయ, సప్తమ వర్గ స్థానములు భోగసౌఖ్యముల నొసంగు ననియు చతుర్థ ప్రథమ వర్గ స్థానములు దారిద్ర్యము నిచ్చుననియు, పంచమ వర్గ స్థానము శతృభయము మృత్యుభయములను కలిగించునని ప్రమాణము తెలుపుచున్నది

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో) ★

## చక్కగా హాయిగా నవ్వితే ?

గుండె వేగం పెరిగి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. పదినిముషాల వ్యాయామమంత కొన్ని నవ్వులు అనేక అనారోగ్యాలు దూరమవుతాయి.




నవ్వటం చక్కటి మందు. దివ్య ఔషధం. చిన్నవయస్సులో రోజుకు 300 సార్లు, యుక్త వయస్సులో 47 సార్లు, వృద్ధాప్యంలో కేవలం ఆరుసార్లు నవ్వుతారు. ఇంకా గలగల నవ్వటం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ధైర్య గుణం వస్తుంది. చక్కెర వ్యాధి, రక్తపోటు తగ్గుతుంది.



# దాశరథి శతకము

*(భక్తరామదాసుగారి సత్కృతికి 'భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)*




శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

( గతసంచిక తరువాయి.)

1వ పద్యప్రసూనము – భద్రవేదివాఖ్యానము

## చారు తులసీదళదామ

శ్రీరామాయణమున శ్రీరాముడు తులసీదళ దామములను ధరించినట్లు ఎచ్చటనూ కానరాదు. రాజలాంఛనముల నెన్నింటినో ధరించి యున్నట్లు ఏ పురాణమునందును కనపించదు. విష్ణుప్రీతికరమైన తులసిని శ్రీరాముడు ధరించినాడని చెప్పుటలో ఆంతర్యము. శ్రీరాముడు విష్ణువే యనుట.



విభవావతార సంబంధముగా ఈ తులసీ సంబంధము మృగ్యమైనప్పటికీ అర్చావ తారపరముగా అద్భుతమైన సంబంధము ను ఆగమ సంహితలు ప్రకటించినవి.

**విష్ణోః త్రైలోక్యనాథస్య**
**రామస్య జనకాత్మజా।**
**ప్రియా తస్యైవ తులసీ**
**సర్వలోకైకపావనీ॥**

విభవ రామునికి జానకి యన్నచో ఎంతటి ప్రీతియో అర్చారామునికి తులసి అంత ప్రీతిపాత్రమైనది.

**యాద్యన్యూనం భవేత్తత్ర**
**రామారాధన కర్మణి।**
**తులసీ దళ మాత్రేణ**
**యుక్తం తత్పరిపూర్యతే॥**

శ్రీరాముని యొక్క ఆరాధనమునందు ఎటువంటి లోటుపాట్లు ఉన్నప్పటికీ ఒక్క తులసీ దళ మాత్రము చేతనే ఆ ఆరాధనము పరిపూర్ణము కాగలదు. సఫలము కాగలదు.

**తులసీదళమాదాయ రామం ధ్యాత్వా సమర్పయేత్।**
**రామాయనమ ఇత్యేతత్ అచ్యుతాయ నమస్తతః॥**
**...**
**కృతం సఫలతామేతి తులసీ సన్నిధౌ మునే।**

ఈ విధముగా అగస్త్య సంహిత శ్రీరామునికి తులసీ దళములకు కల ఆరాధనా బంధాన్ని సాఫల్య గంధాన్ని ఆమోదింప చేయుచున్నది. ఈ శ్లోకములలోని 'తులసీదళ మాత్రేణ' అను అంశమునే మన రామదాసుగారు 'ఒక్క తులసీదళ మర్పణసేయువాడు' అంటూ అనువదించిరి అనుట అతిశయోక్తి కానేరదు.

**తులసీ వాటికా యత్ర**
**పుష్పాంతరశతావృతా।**
**రమతే రాఘవస్తత్ర**
**సీతయా సహితస్స్వయమ్॥**

శ్రీరాముడు సీతతో కలిసి ఆనందముగా తులసీ వాటికయందు విహరించుచున్నాడని వర్తమానస్థితిని చెప్పుటచే తులసి శ్రీరామునికి ఎంత మనోజ్ఞమైనదో తెలియుచున్నది.

ఆ మనోజ్ఞతనే మన రామదాసుగారు 'చారు' అనే పదముతో తులసిని సంభావించిరి. **చరతి చిత్తే ఇతి చారుః** అనే నిఘంటు నిర్వచనాన్ని అనుసరించి 'చారు' అనగా మనోహరమైనది అని అర్థం. **చరతి దేవేషు గురుత్వేన ఇతి చారుః** అనే నిర్వచనం దేవతల యందు గురుత్వభావనతో చరించునది కావున చారుః అనే పదం తులసికి అన్ని విధములా సముచితమైన విశేషమై యున్నది. ఈ తత్త్వ మెరిగిన రామదాసుగారు **చారుతులసీదళదామ** అని కీర్తించుచున్నారు.

అంతియేగాక శ్రీవైష్ణవ సంప్రదాయ పరినిష్ఠితులైన మనరామదాసుగారికి ఆళ్వారుల శ్రీసూక్తులు కూడ ప్రమాణ మూర్ధన్యములైనవి.

శ్రీశఠకోపమునీంద్రులు (శ్రీమన్నమ్మాళ్వారులు) తిరువాయ్

## దాశరథి శతకము

మొజి ప్రథమ శతకం పంచమ దశకంలో (1-5) ప్రసాదించిన సూక్తి ఇది.

**అడియేన్ శిఱియజ్ఞానత్తన్ అఱితలార్కు మరియానై**
**కడి శేర్, తణ్, అమ్ తుళ్ళాయ్ కణ్ణిపునైన్దాన్ తన్నై కణ్ణనై**

దాసుడను, అల్పజ్ఞానిని మహాజ్ఞానులకు కూడా దుర్లభుడైన వాడు పరమాత్మ. సువాసనలను వెదజల్లే, చల్లని అందమైన తులసీ మాలికలను ధరించిన వాడై సులభుడై యున్నాడు. ఈ సూక్తిలోని కడిశేర్-తణ్- అమ్ అనే పదములకు ఏకాకృతిగా మన రామదాసుగారు 'చారు' పద ప్రయోగమును చేసినారు.

**తణ్ణమ్ తుళ్ళాయ్ విరైనాఱు కణ్ణియనే** (తి,వా,మొ 2-7) చల్లని అందమైన తులసీ పరిమాళాల మాలను ధరించినవాడా! అనే నమ్మాళ్వారుల శ్రీసూక్తికి చక్కని అనువాదమే ఈ చారు తులసీ దళదామ! అను ఈ సంబోధనము.

ఈ విధముగా శ్రీరామదాసుగారు మన శ్రీరఘురాముని చారు తులసీదళదామునిగా మనముందు సాక్షాత్కరింప జేసినారు.

**అడియేన్ శిఱియజ్ఞానత్తన్** అను శ్రీనమ్మాళ్వారుల శ్రీసూక్తికి అనుగుణంగా చారు తులసీదళదామ అని కీర్తించిన శ్రీరామదాసుగారి ఆంతర్యమున నైచ్యానుసంధానము, ఆకించన్యములు కూడ ధ్వనించుచున్నవి.

శతకారంభములోనే తమ ఆకించన్యమును ధ్వనింప చేసి తులసీ దళ మాలికలికలను ధరించిన శ్రీరాముని భక్త సులభునిగా కీర్తించుచూ శతకమును ఆరంభించుచున్నారు.

మూడవ సంబోధలోని విశేషములను వివరముగా తరువాయి సంచికలో తెలుసుకుందాము.

## శ్రీరామానుజ సుధామాధురి

(12 వ పేజీ తరువాయి)

సంప్రదాయంలో ప్రధానంగా చెప్పబడే "చరమ పర్వనిష్ఠ" అనగా అంతిమం వరకు ఉండవలసిన ఆచార్య నిష్ఠ వీరి రచనల్లో తెలుపబడినది. జ్ఞాతవ్యార్థాలు (మానవులు తెలుసుకొనే తగిన విషయములు) వారి గ్రంథాల్లో పొందుపరిచారని పెద్దలు చెబుతారు.

అలాగే జీవిత పరమావధి అనదగు ఆచార్య విశ్వాసనిరతిని తెలియజేస్తూ తిరుమంత్ర (అష్టాక్షరి) అర్థసారాన్ని కూడా వివరించారు.

నమశ్శబ్దాన్ని, ఓంకారాన్ని, జీవుడు పరమాత్మకే శేషభూతుడు అనే సత్యం ఈ గ్రంథంలో వివరించబడుతుంది. జీవుడు పరమాత్మకు చెందిన వాడు అని చెప్పేది ఆచార్యులే కనుక అకార వాచ్యుడైన పరమాత్మకు మకార వాచ్యుడయిన జీవుడు చెందినవాడు అని ఉకారంతో చెప్పబడుతున్నది. "ఓం" కారమందలి అ ఉ మ అను మూడు అక్షరములలో మధ్యగల ఉకారము ఆచార్యుడనే అర్థాన్ని బోధిస్తుందని వారు వివరిస్తారు. అనగా భగవంతుని పొందుటకు ఆచార్యుడే ఇద్దరి మధ్య గల పురుషకారము అని వారు ఆచార్యుల ప్రాధాన్యతను ఈ గ్రంథాలలో తెలుపుతారు.

వేద వేదాంత అర్థాలను ఎరిగి సకల విద్యాపారంగతులైన దేవరాజమునుల జీవిత చరిత్రలో, వారి ప్రతి మాటలోనూ, చర్యలోను నడవడిలోనూ, ఆచార్య భక్తి వెల్లడవుతుంది. వారు రచించిన వాఙ్మయ సారమంతా భగవద్రామానుజ మార్గాన్ని చక్కగా విశ్లేషించింది. విద్వాంసుడైన దేవరాజమునులు ప్రథమంలోనే యతిరాజులను గురువుగా స్వీకరించినప్పుడే భగవంతునిగా వారిని భావించారు. అందుకే 'గురురేవ పరబ్రహ్మ' అని ఆచార్యుడు అంటే భగవద్రామానుజులే అని వారు భావించి 'గురుం ప్రకాషయేత్' అని యతిరాజుల గొప్పతనాన్ని ప్రకాశింప చేసిన దేవరాజమునుల చరిత్ర ప్రసిద్ధికెక్కింది. **"యతిరాజ దయాపాత్రం యతిపంక్తి విభూషితం"** అని వారి చరిత్ర శ్లాఘనీయమై, సంప్రదాయ శోభితమై నిలిచింది.

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

## సనత్సుజాతీయం

ఇది సనత్సుజాత మహర్షి, ధృతరాష్ట్రునికి ఉపదేశించినది. ధృతరాష్ట్రుడు, తన మనసు కలత చెందినపు డెల్లా విదురుణ్ని పిలిపించి, అతడు బోధించే మంచి మాటలు వింటూ ఉండేవాడు. ఆవిధంగానే ఒకసారి విదురనీతి అంతా విని, "ఇంకా ఏవైనా ధర్మాలు చెప్పు" అని కోరాడు.

అప్పుడు విదురుడు, "నేను శూద్రుణ్ని కనుక, ఇంత కంటె చెప్పలేను. బ్రహ్మర్షి ఐన సనత్సుజాత మహర్షిని రప్పించి పరమోత్తమ ధర్మాలను ఆయన చేత చెప్పిస్తాను" అన్నాడు. తర్వాత మహర్షిని తలచుకొన్నాడు.

పరిశుద్ధ హృదయుడైన విదురుని తలంపు గ్రహించిన సనత్సుజాత మహర్షి, తత్ క్షణమే అక్కడ సాక్షాత్కరించాడు. విదురుని ఆదేశంతో, ధృతరాష్ట్రుడు, ఆయనను "మృత్యు తత్త్వం నాకు తెలియజేయండి" అని ప్రార్థించాడు.

అప్పుడు మహర్షి, "కొందరు మృత్యువు ఉంది అంటారు, మరి కొందరు మృత్యువు లేదు అంటారు. ఈ రెండూ నిజమే. మోహమే మృత్యువని పలువురు పలుకుతారు. నేను మాత్రం, ప్రమాదమే మరణం, అప్రమాదమే అమృతత్వం అంటాను. ప్రమాదం వల్లనే రాక్షసు లందరూ పరాభవం పొందారు. అప్రమాదం చేత దేవతలు బ్రహ్మభూతు లయ్యారు.

"మరణం అనేది ఒక పెద్ద పులేమీ కాదు. అది ఎవరినీ ఏ నాడూ మింగదు. కొందరు యముణ్నే మృత్యువు అంటారు. పుణ్యాత్ములను సుఖాలలో తేల్చి, పాపాత్ములను దుఃఖాలలో ముగ్గించే ఆ మహాపురుషుణ్ని మృత్యువు అనటం ధర్మం కాదు. 'నేను' అనే అహంకారం చేత కామం, కోరిక, కామం చేత క్రోధం, క్రోధం వల్ల లోభం, లోభం వల్ల మోహం, ఆ మోహం వల్ల మృత్యువు కలుగుతాయి. అవి లేనివారికి మృత్యువు లేనే లేదు. మోహం భయం ఈ రెండే నిజమైన మరణాలు. ఈ విషయం తెలుసుకొన్న వారికి చావు లేనే లేదు!" అని వివరించి చెప్పాడు.

ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు, "మహాత్మా! సంసారి యజ్ఞాలు చేసి మోక్షం పొందుతాడు అంటారు. కర్మలే కదా మోక్షం కలిగిస్తాయి?" అని ప్రశ్నించాడు.



దానికి సనత్సుజాత మహర్షి, "రాజా! కర్మలు చేయటం జ్ఞాన హీనుడు తప్పకుండా చేయ వలసిన పని. జ్ఞాని, తన జ్ఞానంతో కర్మఫలాలను అణగదొక్కుతూ, బ్రహ్మమును పొందుతాడు" అని సమాధానం చెప్పాడు.

పిమ్మట ధృతరాష్ట్రుడు,

**శ్రీమతి తిరుమల నీరజ**

"మానవుడు చేసే పాపాలను పుణ్యాలు నశింప చేస్తాయా?" అని అని అడిగాడు.

అప్పుడు మహర్షి, "అజ్ఞాని తాను చేసిన పాపానికి పాపఫలం, పుణ్యానికి పుణ్యఫలం అనుభవిస్తాడు. జ్ఞాని ఈ రెండిటికీ అతీతుడై, బ్రహ్మ భాజనుడవుతాడు" అని బదులు చెప్పాడు.

"జ్ఞాని ఐనవాడు స్వధర్మాన్ని ఆచరించడం వల్ల పుణ్యలోకాలు పొందుతాడు అన్నావు. అది ఏ విధంగా?" అని ధృతరాష్ట్రుడు అడిగాడు.

అప్పుడు సనత్సుజాతుడు, "జ్ఞాని స్వధర్మాన్ని చేయటం వల్ల అతని తపఃఫలం చాలా పెరుగుతుంది. దాని వల్ల అతనికి పునరావృత్తి రహితమైన మళ్లీ జన్మ అనేది లేని బ్రహ్మపదం లభిస్తుంది. అజ్ఞాని తాను సుకృతం చేత, అంటే తెలియకనే చేసిన సత్కార్యాల వల్ల, స్వర్గఫలాలు అనుభవించి, తిరిగి భూపతనం చెందుతాడు. అంటే మళ్లీ ఈ భూలోకంలో పుట్టి, దుఃఖాలు అనుభవిస్తాడు" అని వివరించాడు.

"కామం, క్రోధం, శోకం, జుగుప్స మొదలైన వాటిని వదిలిపెట్టిన బ్రాహ్మణుడే పండితుడు. వీటిని వదలని వారిని ఇవి పట్టుకుని, ఒక పట్టాన వదలిపెట్టవు, నానా యాతనలూ పెడతాయి. వికత్థనుడు ఆత్మస్తుతి చేసుకొనేవాడు, దంభాలు పలికేవాడు కోపిష్ఠి, చపలుడు చీటికీ మాటికీ చలించే మనసు కలవాడు తదితరులు, పాపకర్మలు చేస్తూ,


క్రూరాత్ములవుతారు.

జ్ఞానం, హ్రీ, లజ్జ, సత్యం, వేదం, దానం, ధైర్యం, శాంతం, ఇంద్రియ నిగ్రహం, యజ్ఞం, అనసూయ అసూయలేమి, తితిక్ష ఓర్పు మొదలైన వాటిని వదలకుండా నిలబడే వానికి, మోక్షం అరచేతిలో ఉసిరికకాయ అవుతుంది. సత్యంతో కూడిన దమం ఇంద్రియ నిగ్రహం, త్యాగం, అప్రమాదం  వీటి వల్లనే ముక్తి కలుగుతుందని పెద్దలు చెబుతారు. అనృత తృష్ణాదులైన అబద్ధం చెప్పటం, లోభం, అష్టాదశ  పద్దెనిమిది దోషాలు అంటని దమమే దమం. అదే విధంగా ఆరు సుగుణాలతో వెలసిన త్యాగమే త్యాగం. ధ్యానం, బ్రహ్మచర్యం, తపస్సు, వ్రతాలతో కలిసి ఉన్నదే సత్యం. ఇవి ఉన్నవాడే బ్రహ్మణ్యుడు బ్రహ్మతో సమాన మైన వాడు. మౌనంగా ఉండడం, వనవాసం చేయటం ఇవి మాత్రమే ఉంటే, ఎవ్వడూ ముని కాలేడు. అక్షరుడైన వాడిని క్షరం అంటే నాశనం లేనివాడు మహావిష్ణువు తెలుసుకొన్నవాడే నిజమైన ముని.     (సశేషం)


## పుస్తక పరిచయం

# తిరుప్పావై దివ్యార్థ సౌరభం

గోదాదేవి విరచిత తిరుప్పావై దివ్యప్రబంధం శ్రీ వైష్ణవలోకానికే గాక  సకల జనులకు పవిత్రమైనది, ఉపదేశ పూర్ణమైనది. గొప్ప వ్రతానుష్ఠానమును ఏర్పరిచిన ఆరాధనీయమైన ద్రావిడ వేదంగా భావించబడుతున్నది. ద్రావిడ భాషలో పూర్వాచార్యకృతమైన మువ్వాయిరప్పడి ఆరాయిరప్పడి, ఈరాయి రప్పడి, నాలాయిరప్పడి, మొదలగు వ్యాఖ్యాన గ్రంథాలు, ఆవ్యాఖ్యానాలను కూడా వివరించే పెరియ, శిరియ, కుట్టి అరుంబదాలు, వివరణలు ఉన్నాయి. వాటిని ఆధారంగా చేసుకొని ఆధునిక కాలంలో అన్ని భాషల్లో వివరణలు లభిస్తు న్నాయి. రెండు శతాబ్దాల క్రిందటి సుప్రసిద్ధ వైష్ణవ





భాగవతోత్తములు కాంచీ మహా విద్వాన్ ప్రతివాద భయంకరం అణ్ణంగరాచార్యస్వామివారు. ఎన్నో సాంప్రదాయ గ్రంథముల రచన గావించారు. వాటిలో వారు రచించిన 'తిరుప్పావై విశేషార్థము' అనే గ్రంథానికి తెలుగు అనువాదంగా వచ్చిన గ్రంథమే "తిరుప్పావై దివ్యార్థ సౌరభం". ఈ గ్రంథ రచయిత  200 లకు పైగా ఆధ్యాత్మిక సాంప్రదాయ గ్రంథాలను  రచించినవారు, నిరంతరం సంప్రదాయ రచనా వ్యాసంగంలోనే కొనసాగుతున్న పండిత రత్న  ఉ. వే. శ్రీమాన్ డా. ఈ. ఏ. సింగరాచార్యులు. ఈ గ్రంథం సార్థక నామంగానే  30 పాశురములకు దివ్య భావ పరిమళాలతో, స్పష్టమైన వాక్యాను క్రమణికతో చదువరులను భావానందంలో నిమగ్నం చేసే విధంగానే ఉంటుంది. అనువాదాంశమయినప్పటికి ప్రధాన విషయములు తెలుపడంలో తార్కిక విధానంతో సహేతుకంగా వివరించడం వల్ల అందరికీ సులభ గ్రాహ్యంగా ఉంటుంది. గ్రంథ ప్రారంభంలో రచయిత ఇతర రచనల వివరములు




"భాగవత ప్రాభృతకం" అని రచయిత హృదయావిష్కారం, మరియు శ్రీవిల్లిపుత్తూరు క్షేత్ర వైభవం సమగ్రంగా వివరించబడింది. తిరుప్పావై భగవద్ రామానుజులు, తిరుప్పావై అర్థపంచకం అనే విశేషాలను వివరించారు. ఆధునిక కాలంలో ఎన్నో గ్రంథాలను వచ్చినప్పటికీ సాంప్రదాయం తో సమన్వయ పరచే అరుదైన విశేషాలు ఈ గ్రంథంలో చూడవచ్చు. చక్కని ముఖ చిత్రంతో 320 పేజీలు కలిగిన, తిరుప్పావై ప్రవచనకారులకు, ఆసక్తి పరులకు, పండితులకు కూడా ఉపయుక్తమైన గ్రంథం. "తిరుప్పావై దివ్యార్థ సౌరభం". లభించు స్థలం. మనస్విని ప్రచురణలు, మోహన్ పబ్లికేషన్స్ అమెజాన్ లో కూడా లభిస్తుంది. వెల రూ. 330

# కర్మఫలం - ధర్మబలం

శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు



మనం ఏ పని చేసినా ఆ పనికి తగిన ఫలం లభిస్తుంది. అది మంచి పనైతే మంచి ఫలం. చెడు పనైతే చెడు ఫలం.

**అవశ్యం అనుభోక్తవ్యం కృతంకర్మ శుభా2శుభమ్।**
**నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి॥**

అని శాస్త్ర వచనం.

ఎవరు ఎన్ని నాస్తిక వాదాలు చేసినా, ఎన్నెన్ని రాద్ధాంతాలు చేసినా తప్పించలేనిది కర్మ సిద్ధాన్తం. లోకంలో చాలా మంది ఇతరులకి చెడు చేస్తూ తమకి మాత్రం మంచి జరగాలని భావిస్తారు. మనం

ముల్ల విత్తనాలు నాటితే ముల్ల చెట్టే వస్తుంది
మల్లె విత్తనాలు నాటితే మల్లె చెట్టే వస్తుంది

ముల్ల విత్తనాలు నాటి మల్లె చెట్టు రావాలనుకోవడం ఎంత అవివేకమో, ఇతరులకు చెడు చేస్తూ నాకు మంచి జరగాలనుకోవడం అంతకన్నా అజ్ఞానం (**what ever you give that you receive)** మనం ఏది ఇస్తామో, ఎలా చేస్తామో అలానే ఫలాన్ని పొందుతాం.

ఒక రాజసభలో దొంగ న్యాయం గురించి వాదిస్తూ, తన తప్పుని సమర్థించుకుంటూ "ఓ మహారాజ! మీరు అందరినీ సమానంగా చూసేవారు. అందరిలోను దైవాన్ని చూసేవారు, కాని ఇప్పుడు నా దొంగతనాన్ని ఖండిస్తూ, నాకు దండన విధిస్తున్నారు. పండితులకి దండ వేసి దండం పెడుతున్నారు. నాకో న్యాయం పండితులకో న్యాయమా" అని దొంగ మహారాజుని ప్రశ్నించాడు. దానికి రాజు గారు సమాధానమిస్తూ "ఇప్పుడు కూడా అందరినీ సమానంగానే చూస్తున్నాను. అందరిలోనూ దైవాన్ని భావిస్తున్నాను. పండితుడనే దైవానికి సన్మానమనే దైవాన్ని ఇస్తున్నాను. దొంగ అనే దైవానికి దండన అనే దైవాన్నిస్తున్నాను" అని చెప్పారు. మనందరిలోను ఆ దొంగలో ఉన్న ఆలోచనే చాలా పరకు ఉంది. చెడు కర్మలు చేస్తాం, మంచి ఫలాలను ఆశిస్తాం. కాని అది ముమ్మాటికీ తప్పు. భారతంలోని పర్వాలు తెలిసినవాడు, భారతీయ కర్మ సిద్ధాంత మర్మాలు తెలిసినవాడు అధర్మాన్ని ఆచరించడు. ధర్మాన్ని వీడి సంచరించడు.

మరి దారిద్ర్యాన్ని అనుభవించేవారు, ఆర్థికంగా వెనకబడినవారి సంగతేమిటి? కర్మఫలం వేటకుక్కల్లా వెంటాడుతుంటే, ఏమి చేయాలి? ధర్మబలం అనే బల్లెంతో కర్మఫలం అనే వేటకుక్కల్ని వెళ్ళగొట్టాలి. "ధర్మబలాన్నే సిబ్బందిగా మార్చుకుంటే కర్మఫలం ఇబ్బంది పెట్టదు"

ధర్మానికి నిజంగా అంత శక్తి ఉందా? అనంతశక్తి స్వరూపుడైన పరమాత్మే ధర్మరూపంలో ఉంటాడు. "రామో విగ్రహవాన్ ధర్మః" "కృష్ణం ధర్మం సనాతనం" "ధర్మస్య ప్రభురచ్యుతః" అంటూ శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

"పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేన బాధతే" అంటారు. పూర్వజన్మలో మనం చేసిన పాపాలు మానసిక, శారీరక వ్యాధులుగా మారి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ పాపపు వ్యాధులకి దివ్యౌషధమే ధర్మాచరణ.

"ధర్మేణ పాపమపనుదతి" అంటూ వేదవాక్కు. ధర్మాచరణ తోనే పాపాలు నశిస్తాయి. అన్ని ధర్మాలలో ఏది ఉత్తమ ధర్మమని ధర్మరాజు అడిగితే, భీష్మపితామహుడు సమాధానాన్నిస్తూ "ఏషమే సర్వ ధర్మానాం... స్తవైరర్చైనరస్సదా" అంటాడు. సహస్రనామములతో శ్రీమహావిష్ణువును స్తుతించడం, అర్చించడం ఉత్తమోత్తమ ధర్మంగా తెలిపాడు భీష్మపితామహుడు. వేలాది సంవత్సరాల ఋషుల తపః ఫలంగా అందిన 1000 మంత్రాలు ఎంతో మహిమాన్వితమైనవి. వాటిని వినడం ద్వారా, ఉచ్చరించడం ద్వారా అశుభములన్ని నశిస్తాయి. పెద్దల ద్వారా ఉపదేశం పొంది, అర్థాన్ని కూడా తెల్సుకునే ప్రయత్నం చేస్తే విశ్వవ్యాప్తమైన విష్ణు శక్తి అవగతమవుతుంది. మనలో పేరుకున్న పాపరాశి అంతమవుతుంది. "జగత్సర్వం శరీరంతే" అన్నట్టు ఈ జగత్తంతా శ్రీమన్నారాయణుని దివ్యదేహంగా భావిస్తూ "అందరికి శ్రీహరే అంతరాత్మ" అనే స్పృహలో జీవిస్తూ సాగితే కర్మఫలం మనల్ని ఏమి చేయలేదు. పరమాత్మ 1000 మంత్రముల శబ్దశక్తిని, అర్థశక్తిని మనలో నింపుకొని, భక్తితో నిలుపుకొని. కర్మఫలాన్ని ధర్మబలంతో జయిద్దాం!

★




# కృష్ణం వందే జగద్గురుం

ఆర్జునుని స్థితి:

(1) శోకము - మోహము

కృపయావిష్టం-స్నేహము, దయతో ఆవేశించబడినవాడు, అశ్రుపూర్ణాకులేక్షణం- శోకముతో కన్నీటితో నిండిన వ్యాకులమైన నేత్రములు కలవాడు, విషీదంతం- దు:ఖించుచున్నవాడు లోకమునందు ప్రతీ మానవుడు ఈస్థితిని అనుభవించుచున్నవాడే. యుద్ధము ద్వారా జరుగబోయే బంధు మిత్ర సంహారముతో కలుగు దు:ఖము అర్జునుడు యుద్ధరంగమున అనుభవించుట అనుచితము.

పై మూడు లక్షణములు ఆవశ్యకములే. కానీ, ఆ పరిస్థితులలో ఉచితమైన స్థానము కాదు.

(2) అవివేకము:

గురుహత్య, బంధుసంహారము ధర్మమా అధర్మమా? వారిని జయించి రాజభోగములను అనుభవించుట శ్రేయస్కరమేనా? తెలిసీ తెలియని ధర్మసందేహ పరిస్థితి అర్జునునిది. **కార్పణ్యదోషోపహత స్వభావః** తన క్షత్రియ స్వభావము బంధుస్నేహజనిత మనోదైన్యముచే క్షతమైనదని అంటాడు అర్జునుడు.

**యత్ శ్రేయః స్యాత్ నిశ్చితం బ్రూహి తత్ మే**
**శిష్యః తే అహం శాధి మాం ప్రపన్నం**

ఏది శ్రేయస్కరమో దాన్ని బోధించుమని శ్రీకృష్ణుని శరణువేడాడు అర్జునుడు.

(3) మనోదైన్యము :

**నహి ప్రపశ్యామి మమ అపనుద్యాత్**
**యత్ శోకం ఉఛ్ఛోషణం ఇంద్రియాణాం।**
**అవాప్య భూమౌ అసపత్నం ఋద్ధం**
**రాజ్యం సురాణాం అపి చ ఆధిపత్యం॥**

మానసిక దౌర్బల్యము, దుఃఖము ఇంద్రియములకు సంతాపకరము అనగా శరీరమునకు అస్వస్థత కలుగచేయునవి.

యెంత గొప్ప ఐశ్వర్యమును పొందినా మానసిక స్వస్థత లేనివాడు ఆనందమును సుఖమును పొందలేడు అంటాడు అర్జునుడు.

(4) వైరాగ్యము:

అధ్యాత్మ విద్యకు ప్రధాన ఆవశ్యకము లౌకిక విషయముల పట్ల వైరాగ్యము.

అధర్మ మార్గములో సాధించిన ఇంద్రభోగముల కంటె భిక్షుక



**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

జీవనమే శ్రేయస్కరమని భావించాడు అర్జునుడు.

శ్రీకృష్ణుడిచే ప్రేరణ:

**కుతః త్వా కశ్మలం ఇదం విషమే సముపస్థితం**

తగని సమయములో తీవ్రదు:ఖ స్థితిని పొందాడు అర్జునుడు.

**అనార్యజుష్టం, అస్వర్గ్యం, అకీర్తికరం**

ఈ శోకము లోకములో శ్రేష్ఠులకు (ఉన్నతమైన స్థితిలో ఉన్నవారికి) తగనిదని, శ్రేయోవిరోధియనీ, అపకీర్తికరమనీ అంటాడు శ్రీకృష్ణుడు.

**క్లైబ్యం మాస్మగమః**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వా ఉత్తిష్ఠ**

పరాక్రమహీనత్వముచే కలుగు అధైర్యమును చూపకుము. అధమాధమమైన హృదయదౌర్బల్యమును వీడి కార్యోన్ముఖుడవు కమ్ము అని అర్జునుని ప్రేరేపించాడు శ్రీకృష్ణుడు.

# త్రివిక్రముడిగా ఎదిగిన వామన మూర్తి



శ్రియఃపతి, వైకుంఠనికేతనుడు, అనంతకళ్యాణ గుణాత్మకుడు, అఖిలహేయప్రత్యనీకుడు అయిన భగవాన్ శ్రీమన్నారాయణుని యొక్క ఆజ్ఞతో జీవులను (చేతనులను) ఉద్ధరించుటకు కంకణము కట్టుకుని శ్రీవిల్లిపుత్తూర్ అనే దివ్యదేశములో కోద్దై గా (కోద్దై అనగా మాల = పుష్పమాల) అయోనిజగా (గర్భ సంబంధం లేకుండా) అవతరించింది. గోదాదేవి. గో శబ్దానికి అనేక అర్థములు కలవు. వాటిల్లో ముఖ్యమైన అర్థములు వాక్కులు, సంపదలు ఇత్యాదివి. వీటిని “దా” అనగా ఇచ్చునది అని అర్థము, శ్రీఆండాళ్ (రక్షకురాలు), శూడికొడుత్త నాచ్చియార్ (తానుదాల్చి విడిచిన పుష్పమాలను భగవంతునకు సమర్పించిన దేవి), పాడికొడుత్త నాచ్చియార్ (పాశురములు అనబడే పాటలమాలను భగవంతునకు సమర్పించిన దేవి) పెరియాళ్వార్ పెన్పిళ్ళై (పెరియాళ్వార్ల గారాలపట్టి) ఇత్యాది పేర్లతో కీర్తింపబడిన గోదమ్మ అనుగ్రహించిన తిరుప్పావై వ్రతమును ఆచరించు పరమపవిత్రమైన మాసం ఈ ధనుర్మాసం.

ముప్పై పాశురములు కల తిరుప్పావై ప్రబంధములో వామన మూర్తిని, వామనుడిగా అవతరించి త్రివిక్రముడిగా ఎదిగిన అవతారాన్ని మూడు పాశురములలో కీర్తించింది గోదమ్మ. మన చిట్టి గోదమ్మకు ఆ కుట్టి వామన మూర్తిపై ఎంత ప్రేమ ఉంటే, ప్రతి పది పాశురములకు ఒకటి చొప్పున మొత్తం మూడు పాశురములలో కీర్తిస్తుంది చెప్పండి!

ఎన్నో అంతరార్థములు కల అత్యంత వైభవోపేతమైన ఈ తిరుప్పావై దివ్యప్రబంధములో గంభీరమైన, రహస్యమైన అర్థములను మన పూర్వాచార్యులు శ్రీఆండాళ్ హృదయాన్ని ఆవిష్కరించుకున్న వారై అమ్మ అనుగ్రహముతో ఎన్నో వ్యాఖ్యానాలు అందించారు. దాసుని హృదయానికి తోచిన ఒక అర్థమును అహంకార, మమకార రహితుడనై అమ్మ అనే ఒక సంబంధముచేత భాగవతోత్తముల ముఖోల్లాసమునకై పంచుకునే ఒక సాహసమే ఈ వ్యాసం.

వామన మూర్తిని కీర్తించిన పాశురములు:

3వ పాశురంలో ఓంగి ఉలగ**ళన్దలో**, 17వ పాశురంలో **అంబర మూడఱుత్తు ఓంగి** ఉలగళన్ద, 24వ పాశురంలో **అన్టు ఇవ్వులగం అళన్ద**.

**శ్రీమాన్ డా॥ వోలేటి రవికుమారాచార్యులు**

ముందుగా ఓంగి ఉలగళన్ద పాశురములో మూడు అడుగులు అడగటం అనేది ఆచార్య సమాశ్రయణము పొంది మంత్ర త్రయాన్ని తిరు అష్టాక్షరీ, ద్వయ మంత్రము, చరమ శ్లోకము లను పొందటాన్ని సూచిస్తుంది. అంటే ముముక్షువు (మోక్షమునందు కోరిక కలవాడు) మొదటగా తెలుసుకోవసిన రహస్యములు మూడు అనే పిళ్ళై లోకాచార్యుల వారు అనుగ్రహించిన ముముక్షుప్పడి గ్రంథములోని మొదటి సూత్రము గుర్తుకువస్తుంది. అంతేకాదు శ్రీవైష్ణవ సంప్రదాయములోని ముఖ్యమైన మూడు వ్రతములు కూడా స్ఫురిస్తాయి. అవేమనగా ఏకాదశీ వ్రతం, తిరుప్పావై వ్రతం మరియు ఆచార్య వ్రతం అనగా ప్రతి నిత్యం శ్రీపాద తీర్థము తీసుకొనుట.

తరువాత 17వ పాశురం అంబర మూడఱుత్తులో మరోమారు వామనుని కీర్తించటం కనపడుతుంది కదా! ఈ పాశురములోని అంకెలను కూడితే 1 + 7 = 8. అంటే ఈ ఎనిమిది అనే సంఖ్య ముముక్షుప్పడి గ్రంథములోని రెండవ సూత్రమును తలపిస్తుంది. ముముక్షువు తెలుసుకోవాల్సిన మూడు రహస్యములలో మొదటిది తిరు అష్టాక్షరీ అనబడే ఎనిమిది అక్షరములు కల మహా మంత్రము. ఈ పదిహేడవ పాశురంలో **అంబర మూడఱుత్తు ఓంగి ఉలగళన్ద** అనే వాక్యానికి అర్థమేమంటే ఆకాశమును అంతయు మధ్య భేదించుకుని పరమపదము వరకు పెరిగి అని, మహా గొప్పగా పెరగటం అనే పద గుంభనం ఈ అష్టాక్షరీ మహామంత్రము యొక్క వైభవమును తెలుపటమే.

ఇకపోతే చివరగా అత్యంత ముఖ్యమైన మంగళాశాసన పాశురం 24వ పాశురం అన్టు ఇవ్వులగం అళన్ద. ఈ పాశురములోని అంకెలను కూడితే (మిగతా 27 వ పేజీలో)

# శ్రీ గోదా కల్యాణము

ప్రత్యేకం

దక్షిణ దేశమందలి శ్రీవిల్లిపుత్తూర్ అను దివ్యదేశమున 'శ్రీవిష్ణు చిత్తుడు' అను పేరుగల పెరియాళ్వార్ అనే కీర్తిని పొందిన మహనీయుని తులసీ వనమందు భగవత్ప్రసాదముగా లభించిన తల్లి 'గోద'.

జనక మహారాజుకు, యజ్ఞభూమిని దున్నుతుండగా లభించన సీతా దేవి వలె, శ్రీ విష్ణు చిత్తులకు తులసీ పాదులు చేయుచుండగా తులసీ వనలో దొరికినది ఈమె. జనకుడు తనకు లభించిన స్త్రీ శిశువును తన సంతానముగా భావించి నాగేటి చాలున దొరికినందున 'సీత' అను పేరు పెట్టి పెంచినట్లుగా, శ్రీ విష్ణుచిత్తులు కూడా తనకు తులసీ వనంలో పూల తోటలో దొరికిన స్త్రీ శిశువుకు 'కోదై' = మాల (అనే అర్థం) కలిగిన పేరుపెట్టి పెంచినారు. ఆ 'కోదై' అనే పేరే 'గోదా' అని వ్యవహారమున ఏర్పడింది.


'గోదా' అనగా, జ్ఞానమును ప్రసాదించునది, తేజస్సును ప్రసాదించునది, గో సంపదను ఇచ్చునది, భూమిని ఇచ్చునది అని అనేక అర్థములున్నాయి.

ఈ గోదాదేవి సాక్షాత్తు భూదేవి అంశమని, లక్ష్మీ స్వరూపమే నని వేదవేత్తలు కీర్తిస్తారు.

"పింజాయ్ పళుత్తాళై ఆండాళై' అంటూ వరవరముని అనే మహనీయులు, ఈ గోదాదేవిని 'చిన్న వయస్సులోనే జ్ఞానములో పండిపోయినదని కీర్తించారు. ఈమెకీ జ్ఞానము విష్ణుచిత్తుల పెంపకంలోనే ఏర్పడింది. నిరంతరం భగవద్ధ్యానంలో గడుపుతూ భగవంతుని సేవయే జీవిత పరమావధిగా గడిపిన మహనీయులు విష్ణుచిత్తులు. ఎల్లప్పుడూ భాగవత పఠనమునే చేస్తూ నిత్యకృత్యములు నిర్వర్తించుకొనే మహనీయుని పెంపకంలో గోదాదేవికి ఉగ్గుపాలతోనే కృష్ణభక్తి ఏర్పడింది. ఐదేళ్ళ చిన్నవయస్సులోనే నిరంతర కృష్ణ స్మరణము, తనకు భర్తగా ఆ కృష్ణుడే తగిన వాడనే నిర్ణయమునకు వచ్చింది.

కనులు మూసినా, తెరచినా, ఆడినా, పాడినా, కొసరినా, కసరినా నిరంతరం కృష్ణునిపైనే ఆమె ధ్యాస. అంత చిన్న వయస్సులో ఈమెకు కలిగిన కృష్ణభక్తి విష్ణుచిత్తులకు కూడా లేదేమో!

తండ్రి భాగవత కథలను, కృష్ణలీలలను చెపుతుంటే విని విని ఆ కృష్ణునే వరించింది. ఆయనను తప్ప మానవ మాత్రులను వివాహం చేసుకోనని తండ్రితో నిశ్చయంగా చెప్పింది. ఇప్పుడెలా? ఎప్పుడో ద్వాపర యుగంలో అవతరించిన శ్రీకృష్ణుణ్ణి ఇప్పుడు ఈ గోదాదేవికి వరునిగా తీసుకు రావటం పెద్ద సమస్య కదా! ఏమి చేయాలి?



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

అప్పుడు ఆయనకు అనిపించింది. ఆనాడు గోపికలంతా ఆచరించిన ధనుర్మాసవ్రతాన్ని చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందేమోనని.

హేమంత ఋతువులో మొదటి మాసమైన మార్గశిరమాసం, సూర్యుడు ధనూరాశిలో సంచరించే ధనుర్మాసంలో పార్వతీ దేవి పరమశివుని తనకు భర్తగా పొందాలనే కోరికతో వ్రతం చేసింది. వ్రతానికి ఫలితంగా పరమశివుని భార్యయైనది. అందుకే గోపికలు శ్రీకృష్ణుణ్ణి తమ భర్తగా పోందాలని ఈ ధనుర్మాసంలోనే వ్రత మాచరించి శ్రీకృష్ణుని తమ భర్తగా పొందారు. ఈ వ్రతమే గోదాదేవి కోరికకు తగిన వ్రతమని నిశ్చయించి, ఆమెకు ఈ వ్రతానికి సంబంధించిన వివరములను ఉపదేశించాడు విష్ణుచిత్తుడు.

గోదాదేవి ఈ వ్రతాన్ని తాను ఒక్కతే మాత్రం ఆచరించకుండా తన స్నేహితురాండ్రతో కలిసి ఆచరించ సంకల్పించింది. "ఏకః స్వాదు న భుంజీత = మధుర పదార్థమును ఒక్కడు మాత్రమే భుంజించరాదు. అందరికీ పంచి తాను తీసుకోవాలనే నియమంలాగే భగవద్విషయం కూడా మధురమైన అనుభూతిని ప్రసాదిస్తుంది. దానిని నలుగురితో పంచుకుంటేనే ఫలవత్తరమౌతుంది. అందుకే గోదాదేవి తాను అవతరించిన 'శ్రీవిల్లిపుత్తూరు' నే గోకులంగా, ఆ ఊరిలో నెలకొన్న వటపత్రశాయి

దేవాలయమే నంద గోప భవనంగా, దేవాలయమందలి వటపత్రశాయినే శ్రీకృష్ణుడుగా, తన స్నేహితురాండ్రే తోటి గోపికలుగా భావించి తన భావనా ప్రకర్షచే వ్రతమును చక్కగా నిర్వర్తించి శ్రీకృష్ణుని అర్చామూర్తియైన శ్రీరంగనాథుణ్ణి వివాహం చేసుకుంది. ద్వాపర యుగమున శ్రీకృష్ణునిగా అవతరించిన భగవానుడే శ్రీరంగమున రంగనాథునిగా అర్చావతారధారియై వేంచేసి యున్నాడు గదా! ఆయననే భర్తగా పొంది గోదాదేవి కూడా ఒక అర్చా = విగ్రహ మూర్తిగా శ్రీరంగమున రంగనాథుని సరసన ఆవిర్భవించింది. చిన్న వయస్సులోనే మహాభక్తి సంపన్నుడై తరించిన ప్రహ్లాదుని వలె, నారదుని అనుగ్రహంతో ఆరు సంవత్సరాల వయస్సులోనే ఆరు నెలల తపస్సుచే భగవంతుని ప్రత్యక్షం చేసుకొని ఆయన వరంతో ధ్రువ పదవిని సాధించిన ధ్రువుని వలె 'తిరుప్పావై' వ్రత మాచరించి శ్రీరంగనాథుని పట్టమహిషి యైనది.

పరమ పవిత్రమైన తులసి, నిరంతరం భగవంతుని పాదములను చేరుకోవాలని పరితపించినట్లుగానే తులసీ వనంలో అయోనిజగా అవతరించిన గోదాదేవి కూడా తనకు భగవంతుడే లభించాలని పరితపించి వ్రతం ద్వారా సాధించింది.

స్వచ్ఛమైన శుభ్రమైన పూల మాలికలను భగవంతునికి సమర్పించి, ఆయన ధరించిన తర్వాత నిర్మాల్యము మనకు ఇస్తే దానికి భగవంతుని అనుగ్రహంగా భావించి మనం స్వీకరించాలి. ఇది శాస్త్రక్రమం. కానీ, గోదాదేవి యొక్క నిష్కల్మషమైన భక్తి భావన, అది మధుర భక్తి భావన, అనగా భగవంతునే పతిగా భావించగలిగిన విలక్షణమైన మానసిక స్థితి. ఇది ఆమెను భగవంతునికి మరింతగా దగ్గర చేసింది. ఆ భగవంతుడే ఈమెపై మరులు గొనేట్లుగా ఈమె భక్తి పరిఢవిల్లింది. అందుకే ముందుగా ఈమె ధరించిన పూల మాలికలను భగవంతుడు ఇష్టపడ్డాడు. పైగా ఈమె ధరించి ఇచ్చిన పూల మలికలను తన మెడలో మాత్రమే కాక కిరీటానికి కూడా చుట్టుకొని ఆనందిచాడట. అందుకే ఈమెకు "శూడిక్కొడుత్త నాచ్చియార్" "ఆముక్త మాల్యద" అని పేరు వచ్చింది. అన్నమాచార్యుల వారు


**శ్రీమహాలక్ష్మి యట సింగారాల కేమరుదు**
**కాముని తల్లియట చక్కదనాల కేమరుదు**
**సోముని తోబుట్టువట సొంపుకళల కేమరుదు**
**కోమలాంగి శూడిక్కొడుత్తనాంచారి –శోభనే, శోభనే**
**చూడరమ్మ సతులారా సోభాన పాడరమ్మ**
**కూడున్నది పతి శూడిక్కొడుత్తనాంచారి** అంటూ ఈమెను సాక్షాత్తు మహాలక్ష్మిగానే అభివర్ణించారు.

కల్పారంభంలో వరాహస్వామి భూదేవికి, ఈ కలియుగంలో మానవులు సులభంగా తరించటానికి తగిన మూడు సాధకములను ఉపదేశించాడు. అవి భగవన్నామ సంకీర్తనం, శరణాగతి, మాలా సమర్పణం. ఈ మూడూ భగవంతుని అర్చావిగ్రహమునకు సేవగా సమర్పిస్తే చాలు ఈ కలియుగంలో మోక్షమును పొందవచ్చు. ఈ మూడంటిని తానే స్వయంగా ఆచరించి చూపటానికై అవతరిస్తానని వరాహస్వామికి మాట ఇచ్చి అయోనిజగా తులసీ వనంలో 'గోద'గా ఆవిర్భవించింది భూదేవి. కానీ, ఈమెకు గల 'కరుణ' ఈమెను సాక్షాత్తు మహాలక్ష్మియే అని భావింప చేస్తుంది.

ఈమె 'తిరుప్పావై' వ్రతం ఆచారించటం ద్వారా సంకీర్తనమును, శరణాగతిని, మాలా సమర్పణమును భగవంతునికి సమర్పించింది. పైగా అరమరికలు లేని నిష్కల్మషమైన మనస్సుతో తాను ఆ కృష్ణుని సౌందర్యానికి తగిన దానినా కాదా అని పరీక్షించుకోటానికై పూల మాలికను ధరించి, అద్దంలో చూసుకొని, అవును నేను ఆయనకు తగిన దానినే అని మనస్సులో అనుకొని సమర్పించిందట. ఇది తెలుసుకొన్న విష్ణుచిత్తులు గోదాదేవిని మందలించాడు. కానీ భగవంతుడు, "విష్ణుచిత్తా! నీకుమార్తె గోదాదేవి ధరించి ఇచ్చిన మాలికలే నాకు అత్యంత ప్రీతిని కలిగిస్తున్నాయయ్యా! ఇదిగో చూడు నేను ఈ వనమాలను నా మెడలో ధరించాను. గోద ధరించిన మాలను నా తలపై కిరీటానికి చుట్టుకున్నాను. గోద ధరించిన మాలిక వనమాల కంటే నాకు ఎక్కువ ఇష్టమైనది." అన్నాడు. ఇక ఆ విష్ణుచిత్తుని కంటే ధన్యులెవరు? సాక్షాత్తూ పరమపురుషునికే కన్యాదానం చేసుకొనే భాగ్యం. ఇది మరొకరికి దొరికేదా? పరమ సంతోషంతో విష్ణుచిత్తులు తన కుమార్తె 'గోద'ను చూసి "ఎన్నై ఆండాళే" 'నన్ను రక్షించుటకు వచ్చిన తల్లీ!' అని పిలిచారట. అప్పటి నుండి గోదాదేవికి 'ఆండాళ్' అనే పేరు కూడా ప్రసిద్ధమైంది. గోదారంగనాథుల కల్యాణాన్ని విష్ణుచిత్తులు అంగ రంగ వైభవంగా జరిపించారు. సాక్షాత్తు బ్రహ్మదేవుడే పురోహితుడై గోదా కల్యాణం నిర్వహించాడు. భూదేవంత మండపం, ఆకాశమంత పందిరిలో దేవతలు కూడా ఆశ్చర్యపడేలా కల్యాణం (మిగతా 27 వ పేజీలో)

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక



అలంకార వాస్తు గురించి తెలుసుకొంటున్నాము. ఇందులో వృక్షాలల్లో ప్రధానంగా పూజనీయమైన వృక్షాలు ఎన్నో వున్నాయి. అందులో ప్రధానంగా ప్రతి ఇంట్లో కూడా ఉండదగిన వృక్షం తులసి వృక్షం. ఈ తులసి వృక్షము వైద్య శాస్త్రములో, జ్యోతిష్యశాస్త్రములో, ఆగమశాస్త్రంలో ప్రసిద్ధమైన స్థానాన్ని పొందివుంది. ఏ చెట్టును ఇంట్లో పెట్టుకున్నా, పెట్టుకోలేకున్నా తులసి మొక్క తప్పనిసరిగా ప్రతి ఇంట్లో ఉండాలి అని సకలశాస్త్ర కోవిదులైన ప్రాచీనులు, ఋషులు వాళ్ళ వాళ్ళ అభిప్రాయాన్ని మనకు అందించారు. దానిలో విశేషించి తులసి మొక్క దగ్గర దీపం పెట్టడం గాని, ఆరాధించడం గాని చేయాలి. తులసి మొక్క పైనించి ప్రసరించిన గాలి గృహంలో ప్రవేశించి ఆరోగ్యానికి, ఆహ్లాదానికి, సంపదలకు కారణము అని మనకు పెద్దలు తెలియజేస్తున్నారు.

ప్రతి గృహము ముందు గద్దెను ఏర్పాటుచేసి అందులో తులసి మొక్కను నాటి తులసి కోటను ఏర్పాటు చేసుకొని దానికి ఆరాధనలు, ప్రదక్షిణాలు చేసేటువంటి ఆచార సంప్రదాయం మన భారత దేశంలో వుంది. దానిలో వాస్తు ప్రకారంగా గృహాల నిర్మాణం చేసేటప్పుడు కొన్ని రాశులకు తూర్పు ద్వారము, కొన్ని రాశులకు ఉత్తర ద్వారము శ్రేష్ఠమని, మరికొన్ని రాశులకు పశ్చిమ ద్వారము, కొన్ని రాశులకు దక్షిణ ద్వారము ప్రవేశము శ్రేష్ఠమని తెలియజేయడం జరిగింది. గృహ నిర్మాణం చేసేటప్పుడు ఏ రాశివారైనా గృహానికి నాలుగు ఏర్పాటు చేసుకుంటే అన్ని రాశుల వారికి శుభం కలుగుతుంది అని ప్రాచీనులు నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసేవారు. దానిని "చతుశ్శాల భవంతి" అనే పేరుతో నాలుగు దిశలకూ నాలుగు ద్వారాలు ఉండేవి. నాలుగు ద్వారాలకు నాలుగు తులసికోటలు కట్టుకునేవారు. ఏ ద్వారానికి ఏ ఫలితాలు ఇస్తుంది





**తులసికోట గృహము తూర్పు ద్వారము కెదుట**
**తరగని సంపదలు కలుగజేయు**
**ఉత్తర ద్వారమున కెదురు ఉన్నతమగు కీర్తి**
**పశ్చిమ ద్వారమందు పశుసమృద్ధి**
**యమద్వారమునకెదురు అపమృత్యుదోషములు**
**హరియించి కాపాడు అనుక్షణంబు**
**గృహము నలుదిశల తులసి కోటయున్న**
**దేహమీశాన్యమున తులసి తోటయున్న**
**కలుగు సౌభాగ్యములు**
**నిక్కముగా కలుగునచట...**

తూర్పుద్వారానికి ఎదురుగ సంపదల నిచ్చునని, ఉత్తరానికి కీర్తినిస్తుందని, పశ్చిమంలో పశు వృద్ధి కలుగుతుందని, దక్షిణ ద్వారములో అపమృత్యు హరించి కాపాడుతుంది అనుక్షణం. నాలుగు ద్వారాలుంటే నాలుగు తులసి కోటలుంటే ఆ ఇంట్లో సౌభాగ్యములు సమృద్ధిగా కలకాలం ఉంటాయి. తులసి మొక్కయే కాదు దళాలను ఆలయాల్లో భగవదారాధనలో సుగంధ ద్రవ్యాలతో తీర్థం తయారుచేసినప్పుడు సమపాళ్ళలో సమానం చేసే శక్తి తులసి దళానికి వుంది. విష్ణుపూజలో తప్పనిసరిగా వాడడం చెప్పబడ్డది. తీర్థం పెట్టేటప్పుడు తులసి దళం వస్తే అది అదృష్టంగా భావించేవాళ్లు పూర్వీకులు.

**అకాలమృత్యుహరణం**
**సర్వవ్యాధి నివారణం**

# జ్యోతిర్విజ్ఞానమ్


**సమస్త దురిత ఉపశమనం**

**దేవతా పాదోదకం పావనం శుభం** అని ఆలయాలలో పెడతారు. ఆ తులసి చెట్టు యొక్క శక్తి ఏమిటంటే ఏ చెట్టులో లేనట్టి ఆక్సిజన్ను తులసి చెట్టు వదులుతుంది అని వైద్యశాస్త్రం ద్వారా తెలుస్తుంది.

అలాగే దంతధావనం చేసుకునేటప్పుడు ఉత్తరేణి చెట్టును వాడేవారు. దాని వేరుగాని, కాండముగాని ఉపయోగించి పండ్లు తోముకోవటం ద్వారా చాలా బలిష్టంగా చిగుళ్లు వుండి పలువరస చాలా బలంగా ఉంటుంది, ఉత్తరేణిని సంస్కృతంలో అపామార్గము అంటారు. మహాభారత విరాటపర్వంలో ఉత్తరగోగ్రహణానికి కౌరవులు విరాటనగరానికి యుద్ధానికి వెళ్ళినప్పుడు సైన్యాధ్యక్షునిగా పెద్దలు భీష్మ ద్రోణాదులు వుంటారు. కత్తియుద్ధం చేసే సైనికులు ఉదయమంతా యుద్ధాన్ని చేసి సాయంత్రం వాటికి పదును పెట్టడానికోసం నూరుతూవుంటే ఆ ద్రోణ భీష్మాచార్యుల వారు చెప్తారు.

**అపామార్గ రాసేనైవ యాని శస్త్రాణి లేపయేత్**
**జ్యాయంతే తాని సంగ్రామే వజ్ర సారణి నిశ్చితం**

ఒకసారి కత్తి నూరిన తరువాత దానికి అపామార్గరసాన్ని అనగా ఉత్తరేణి చెట్టును దంచి దాని రసాన్ని పూస్తే అది వజ్రంతో సమానం అవుతుంది. ఆ కత్తి మొండి పోవడానికి అవకాశం లేదు. అలాంటి ఆయుధాలకే అంతటి పదునిచ్చిన ఆ ఉత్తరేణిని వైద్యశాస్త్రంలో దంతధావనానికి ఉపయోగిస్తే ఎంత గట్టి వస్తువులైనా నమిలేటి శక్తి వస్తుంది. ఒక్కొక్క వృక్షం ఒక్కొక్క గుణాన్ని మానవలోకానికి లాభాన్ని ఇస్తుంది. **వృక్షో రక్షతి రక్షితః.** ప్రతి చెట్టును కాపాడుకోవలసిన బాధ్యత మానవులది. మనుష్యులు లేకపోతే అవి సుఖంగా ఉంటాయి కానీ అవి లేక పోతే మనుష్యుల జీవితాలు సుఖమయంగా వుండవు. ఈ అలంకార వాస్తులో మొక్కల గురించి తెలుసుకొంటున్నాము. ముందు సంచికలో మరికొన్ని తెలుసుకొందాము.



# శ్రీ గోదా కల్యాణము

జరిగింది అని అంటారు. అందుకే శ్రీవైష్ణవాలయములలో ధనుర్మాసంలో 'తిరుప్పావై' వ్రతాన్ని ముప్పది రోజులపాటు ఆచరించి 'భోగి' నాడు గోదా కల్యాణాన్ని నిర్వహిస్తారు. భోగి మర్నాడే మకర సంక్రాంతి. ఈనాటి నుండి ఉత్తరాయణం ప్రారంభమౌతుంది. ఉత్తరాయణం అంటే దేవతలకి పగలు కదా! అంటే గోదా కల్యాణం సరిగ్గా దేవతల యొక్క బ్రహ్మముహూర్త కాలంలో చివరి ఘడియలలో అయ్యిందన్నమాట. ఈ కాలమంతా ఎంత మంచికాలమో కదా!

వైకుంఠ ఏకాదశి, 'భోగి' పండుగ, మకర సంక్రాంతి, తిరుమళిశైఆళ్వార్ తిరునక్షత్రం, శ్రీత్యాగరాజ స్వామి ఆరాధన, శ్రీకురత్తాళ్వాన్ తిరునక్షత్రం మొదలైన అనేక విశేష దినములన్నీ ఈ మాసంలో రాబోతున్నాయి. ఇన్ని మంచిరోజులను మనం సద్వినియోగం చేసుకొని తరిద్దాం. ★

## త్రివిక్రముడిగా ఎదిగిన వామన మూర్తి

(23 వ పేజీ తరువాయి)

2 + 4 = 6. ఈ సంఖ్య ఆరు పదములు షట్పది కల ద్వయమంత్రమును సూచిస్తుంది. అంటే తిరు అష్టాక్షరీ మహామంత్రములో శబ్ద రూపముగా వ్యక్తము కాని అర్థములు భాసించే మంత్ర రత్నము అనబడే ద్వయ మంత్రమును సూచిస్తుంది.

అంతేకాదు ఈ పాశురములోనే చరమశ్లోకము కూడా చెప్పినట్టయింది. అదెలాగంటారా? ఈ 24వ పాశురములో అధికంగా నాలుగు వరుసలలో (3, 4, 5, 6 పాదములలో) కీర్తింపబడినది శ్రీకృష్ణ పరమాత్మయే కాబట్టి ఆ కణ్ణన్ అనుగ్రహించిన చరమ శ్లోకము కూడా ఉపలక్షణతయా చెప్పినట్టయింది. ఈక్రమమును పరిశీలిస్తే శ్రీవైష్ణవ సంప్రదాయములో మనందరం తప్పక తెలుకోవాల్సిన మూడు రహస్యములను మరియు వాటి వైభవమును గోదాదేవి మూడు పాశురములలో వామన మూర్తిని కీర్తించుట ద్వారా తెలియచేసినది అనే ఒక రహస్యమైన భావము కనిపిస్తుంది. ఇట్టి ఎన్నో భావగర్భితములైన అర్థములతో కూడిన పాశురములను కృపచేసిన గోదమ్మకు కాలమున్నంతవరకు నమోవాకములు సమర్పిద్దాము. ★

# భగవదాలయములు - నియమ నిబంధనలు



శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు

(గత సంచిక తరువాయి)

ఆలయములలో జరగకూడని అపచారములు

1.ఏదైనా వాహనం ఎక్కి గాని, చెప్పులు వేసుకొని గాని దేవాలయానికి వెళ్ళకూడదు. 2.భగవంతునికి నమస్కరించకుండా ఉండుట. 3.ఒక చేతితో నమస్కరించు కొనుట, చేతిని ముద్దు పెట్టు కొనుట 4.స్త్రీలు జడ వేసుకొనకుండా, (విరబోసుకొని) దేవాలయానికి రావటం. 5.సంప్రదాయ దుస్తులు ధరించకుండా, ఫ్యాషన్ దుస్తులు ధరించుట. 6.భగవంతుని ఎదుట గర్భాలయం ముందు లేదా మంటపంలో ఆత్మప్రదక్షిణం చేయటం. (తన చుట్టూ తాను తిరుగుట) 7.ఎంగిలి చేతితో నమస్కరించుట. 8. ఆలయంలో లౌకిక విషయాలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం. 9.గట్టిగా వదరుట, మాట్లాడుట. 10. అనవసరమైన ప్రసంగాలు చేయుట. 11.గట్టిగా ఏడ్చుట. 12.ఒకరితో ఒకరు కలహించుట. 13.స్త్రీలతో పరిహాసముగా మాట్లాడుట. 14.ఇతరులను పొగడుట. 15.ఇతరులను నిందించుట. 16. శక్తి (ధనం) ఉన్నా కూడా భగవంతునికి కొద్దిగా (అల్పంగా) సమర్పించుట. 17.ఆరగింపు కాని పదార్ధాలను సన్నిధిలో కూర్చొని తినుట. (అంటే బయటి పదార్ధములను) 18.భగవంతుని ఎదుట ఇతరులకు నమస్కరించుట.

ఈ తప్పులను ఆలయంలో చేసినచో భగవంతున్ని సేవించటం ద్వారా పొందిన పుణ్యం రాకుండా పోవటమే కాక మనకు మిక్కిలి పాపం వస్తుంది. అని వరాహ పురాణంలో తెలియచేసినారు.

ఈమధ్య కాలంలో అన్ని దేవాలయాలలో జరిగే ఉత్సవ కార్యక్రమాలను యూట్యూబ్ లైవ్ టెలికాస్ట్ చేస్తున్నారు. కాని స్వయం వ్యక్తములైన ( స్వయం భూః ) మూర్తులను, లేదా ఆగమ శాస్త్ర ప్రకారం ప్రతిష్ఠ చేయబడినవి అయిన దేవుని మూర్తులను బింబములు లేదా బేరములు అంటారు. వాటికి షోడశోపచారాలతో ఆరాధనలు, హోమ, పారాయణాదులు వాటిని ఉద్దేశించినవే కనుక ఆలయ మంటపాదులలో జరుగాలి అని శాస్త్రంలో తెలియచేసినారు. కొన్నచోట్ల టి.వి చానళ్ళలో ప్రసారం అవుతున్నవి ఛాయా మూర్తులు అని అంటారు. వీటిని దర్శించినంత మాత్రన తృప్తిగా అనిపించవచ్చును. కాని వాటికి ప్రాముఖ్యత లేదు. ఇది అశాస్త్రీయమైనది. భగవంతుని ఆరాధనలో కొన్ని ఉదాహరణగా వస్త్రాలంకరణ, నైవేద్యము, వాహనాలపైన దేవతా మూర్తులను ఉంచి వాటిని తగిన విధంగా తయారు చేయటం సాక్షాత్తుగా చూపరాదనీ తెర లోపల కేవలం అర్చకులు మాత్రమే చేయవలెననే నియమము ఉన్నది. అలాగే అందరూ దర్శించదగిన సహస్ర నామార్చనాదులు, డోలోత్సవాదులు గూడా మూల మూర్తుల వద్దనే దర్శింప తగినవి.

ఈ మధ్య రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగటం ఒక అలవాటు సంప్రదాయంగా మారింది. కాని అందులో ఉండే విషయాలను అమలు చేయటానికి, అనుసరించటానికి ఎవరికి ఉత్సాహం లేదు.

అదే విధంగా దేవాలయాలను నిర్మిస్తున్నారు కాని ఉన్నవాటిని అభివృద్ధి అనే పేరుతో కూల్చి వేస్తూ ఆగమాలను అనుసరించడం కాని వాటి అమలుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగటం లేదు. అలా జరిగినట్టయితే రాజ్యాంగం, చట్టం అమలు వలన ఆ ఫలాలు అందరికి పంచబడుతాయి, అందుతాయి. దేవాలయాల వలన అనేకమైన మన భారత దేశపు కళలు, సంస్కృతి సంప్రదాయాలు మనకు, మన తరువాత తరాలకు అందించబడతాయి "సర్వేజనాః సుఖనో భవంతు" అనే వేద వాక్కు నిజమవుతుంది.

# అహల్యా మాత



## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు


**తిరుక్కోళూరు పెణ్ ఎళ్ళై చెప్పిన**

**82 వార్తల్లో ఆమె తెలిపిన 10వ వార్తను గురించి తెలుసుకుందాము .**

**ముదలడియై నెత్తేనో, అహల్యయై ప్పోలే**

భగవద్ రామానుజుల వారికి తాను తిరుక్కోళూరు దివ్యదేశము నుండి ఎందుకు వెళ్ళిపోతోందో తెలియ చేస్తున్న ఈ పెణ్ పిళ్ళై మరొక గొప్ప ఐతిహ్యాన్ని తెలియ జేస్తుంది.

“నేను అహల్య వంటి పరమ పవిత్రురాలను కాదు, ఆమెలాంటి గొప్ప రామానుగ్రహ మహా భాగ్యం నాకు లేదు కదా, అంటూ రామాయణంలోని ఒక చక్కని అహల్యా వృతాంతాన్ని తెలియ జేస్తున్నారు. పెణ్ పిళ్ళై గారు.



విశ్వామిత్రుని వెంట, దశరథ పుత్రులైన రామ లక్ష్మణులు యాగ సంరక్షణ కొరకు అరణ్యాలకు వెళ్ళి, ఆకార్యము పూర్తి కాగానే, మునులతో కలిసి, విశ్వామిత్రుని వెంట, రామ లక్ష్మణులు మిథిలా నగరమునకు బయలుదేరారు. మునులంతా మిథిలానగరపు పురవీధులను, మనోహరమగు జనకుని రాజ్యమును చూసి కొనియాడుచున్నారు, మిథిలకు నమస్కరిస్తున్నారు.

ఆసమయమున వారు సమీపమున గల వనమునందు ఒక ఆశ్రమమును చూశారు. అది ప్రాచీనమైనది, చాలా అందంగా ఉన్నది. కానీ, నిర్జనముగా కనపడుతోంది. శ్రీరాముడు విశ్వామిత్రుని చూచి, “మహాత్మా ఇంతటి పురాతనమైన, రమ్యమైన, ఈ ఆశ్రమము ఎవరిది. మునులెవ్వరూ లేరెందుకు”? అని అడిగాడు శ్రీరాముడు.

తేజోవంతుడు, వాక్ చతురుడు అయిన విశ్వామిత్ర మహర్షి ఇలా తెలియ చేశాడు. “రామా! విను ఈ ఆశ్రమము ఒక మహాత్ముని కోప కారణంగా, శాపానికి గురి అయింది. వివరంగా చెబుతా విను అని చెప్పసాగాడు.

“ఈ ఆశ్రమం మహాత్ముడైన గౌతమ మహర్షి ఆశ్రమము. ఒకానొకప్పుడు దివ్యమైన శోభలతో అలరారేది. దేవతలు కూడా పూజించుకునేవారట. పూర్వ కాలములో గౌతమ మహర్షి, తన భార్య అయిన అహల్యతో కూడి ఈ ఆశ్రమము

**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

నందు నివసిస్తూ చాలా సంవత్సరములు తపస్సు చేసెను. ఇద్దరూ అన్యోన్యంగా కాలం గడిపే వారు. ఒకానొక రోజు మహర్షి తెల్లవారు ఝామున నదికి స్నానానికై బయలుదేరి వెళ్ళారు. అలా గౌతమ ముని ఆశ్రమ మందు లేని వేళ శచీపతి (ఇంద్రుడు) గౌతముని రూపం ధరించి, అహల్యను సమీపించి, తాను అహల్యను సంగమింప కోరుతున్నాను అనగా, అహల్య ఆతనిని మారు వేషములో వచ్చిన యింద్రుడు అని తన తపశ్శక్తి చేత గుర్తించింది.

ఓ సురపతి! దాంపత్య జీవనమున నేను సంతుష్టురాలను, వెంటనే నీవు ఇచట నుండి వెళ్ళుమని, నీ, నా గౌరవములు నిలుపుము అని పలికింది , ఇంద్రుడు ఆమె పలికిన రీతికి పాశ్చాత్తప్తుడై గౌతమ ముని వచ్చునేమో అని శంకతో భయపడి వెళ్ళిపోబోయాడు. భయంతో పర్ణశాల నుండి త్వరత్వరగా బయటికి రాగా, ఎదురుగా గౌతమ ముని పర్ణశాలకు రానే వచ్చాడు.

అగ్ని తేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్న ఆయన ముఖాన్ని చూస్తూనే యింద్రుని ముఖం భయంతో వెలవెలా పోయింది. “నారూపము ధరించి వచ్చి, అనుచితముగా ప్రవర్తించావు అని మహర్షి రోషముతో, ఇంద్రుడిని శపించాడు. యిలా యింద్రుని శపించిన మహర్షి అహల్యను కూడా శపించాడు. “వేల సంవత్సరములు అన్న పానాదులు లేక, వాయు భక్షణం తో, దుమ్ము ధూళిలో చలనం లేకుండా శిలా భావనతో ఉండు మని, భస్మశాయినివై ఎవరికి కనపడకుండా ఉండెదవు అంటూ శపించాడు. (మిగతా 31 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# శంబూకవధ 2



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

శ్రీ రాముడు శంబూకుడిని వధించినది కేవలం ఒక వర్ణం వారి కోసమే కాదు, లేక ఒక వర్ణం పైన కోపంతోనూ కాదు. తన రాజ్యంలో ఉన్న ప్రజల సంక్షేమాన్ని కోరి చేశాడు. రాజు ప్రజా క్షేమం కోరుకోవాలి కానీ ఒకరి శ్రేయస్సు మాత్రమే కోరకూడదు. పైగా అతని కోరిక కూడా ధర్మబద్ధం అయినది కాదు. అధర్మం ఆచరిస్తున్న శంబూకుడు అనే శూద్రుడిని వధించాడు. అది ప్రజా సంక్షేమం కోసం వధించాడు. ఆ ప్రజలలో నాలుగు వర్ణాల వాళ్ళు ఉన్నారు అన్న విషయం గ్రహించాలి.

శ్రీరాముడు అన్ని వర్ణాల వారిని సుఖశాంతులతో జీవించేలా పరిపాలించాడు అనేది వాల్మీకి రామాయణంలో రామరాజ్యవర్ణనలో స్పష్టంగా చూడవచ్చు. అధర్మవర్తనుడైన ఒక శూద్రుడిని వధించాడు. అధర్మవర్తనులైన క్షత్రియులను సంహరించాడు. అంతకు ముందు పరశురాముడు కూడా ఎందరో అధర్మపరులైన క్షత్రియులను సంహరించాడు. అలాగే రాముడి ఆదేశానుసారం శత్రుఘ్నుడు అధర్మము చేసిన గంధర్వుడిని సంహరించడం కూడా చూడవచ్చును. అదే రామాయణంలో ఒక బ్రాహ్మణుడైన రావణుడిని చంపడానికే రాముడు పుట్టాడు కదా! సాక్షాత్ బ్రహ్మ వంశముకి చెందిన రావణ బ్రహ్మను అధర్మపరుడయ్యాడని రాముడు సంహరించాడు. కాబట్టి శంబూక వధ శూద్రుడిని వధించడంగా కాకుండా అధర్మపరుడిని వధించడం అనీ, అధర్మపరులు ఎవరైనా బ్రాహ్మణుడు, శూద్రుడు, క్షత్రియులు, అసురులు అని చూడకుండా వధించడం జరిగింది. దాని వలన పదకొండు వేల సంవత్సరాల రామరాజ్యంలో అన్ని వర్ణాల వారు ఆనందంగా సుఖ సంతోషాలతో జీవించారు అనేది ప్రామాణికమైన సత్యం.

యుగములు ఉన్నాయి అందులో ఆ యుగములో ఇలా జరిగింది అని ఎవరు మాట్లాడుతున్నా ఆయా యుగాలలో మనుష్యుల శక్తులను బట్టి, ఆయా యుగాలలో ఉండే వ్యవస్థలను బట్టి యుగ ధర్మాలు కూడా ఉంటాయని మనము తప్పక అంగీకరించవలసి ఉంటుంది. అదీ కాకపోతే "రామో విగ్రహవాన్ ధర్మః" మూర్తీభవించిన ధర్మం రాముడు. మీరు నన్ను వద్దనుకున్నా ధర్మముతో ఉండండి ధర్మములో జీవించండి నాకు అందరూ సమానులే మీకు నేనున్నాను అంటూ శ్రీరామ రక్షను ప్రసాదిస్తున్నాడు. తనను శరణు కోరినవారిని శరణాగతవత్సలుడైన రాముడు తప్పక తన రక్షణలో ఉంచుతాడు.

మధ్వాచార్యులు 'మహాభారత తాత్పర్య నిర్ణయం' అన్న గ్రంథంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ కొన్ని అంశాలను చెప్పారు. శంబూకుడి అసలు పేరు గంగడు. అతని ప్రవృత్తి వలన వచ్చిన పేరు శంబుకః. ఈ పదాన్ని విడదీస్తే శంబుంకామః అని వస్తుంది. శంబుని కామించినవాడు. శంబూకుడు మునుపే శివుడి కోసం తీవ్రమైన తపస్సు చేసి కైలాస ఆధిపత్యం పొందాడు. ఇప్పుడు ఉమను పొందడం కోసం ఈ తీవ్ర తపస్సు చేస్తున్నాడని తెలిసి శ్రీరాముడు సంహరించాడు. సీతను కోరుకున్న రావణునికి పట్టిన గతి శంబూకుడికి కూడా పట్టింది అని చెప్పారు.

కంబ రామాయణం, ఉత్తరకాండలో ఈ కథ గురించి ఇంకాస్త వివరంగా రాయబడింది.

శంబూకుడు ఒక శూద్ర ముని. శ్రీరాముని పాలనలో దేశంలో చాలా మంది పిల్లలు మరణించారు. చాలా మంది తల్లిదండ్రులు తమ సంతానం కోల్పోయినందుకు రాజు ముందు విలపించారు. వశిష్ఠుని సలహా మేరకు రాముడు, తన రాజ్యంలో ఎవరైనా వాళ్ల స్థాయికి తగని చర్యలకు పాల్పడ్డారా! అని అన్వేషణ మొదలుపెట్టాడు. శ్రీ రాముడు పుష్పక విమానంలో ప్రయాణం చేస్తూ ఆకాశం నుండి రాజ్యాన్ని పరిశీలించడం కోసం అన్నీ దిక్కులకు ప్రయాణం చేశాడు. ఆ సమయంలో దక్షిణ దిక్కులో అడవిలో తలకిందులుగా వ్రేలాడుతూ తల క్రింద మంటలు వేసుకుని తీవ్రమైన తపస్సు చేస్తున్న శంబూకుడు జాడ కనుక్కున్నాడు, ఆ శూద్ర ముని చెట్టు నుంచి తల క్రిందులుగా వేలాడుతూ, తల క్రింద మంటలు వేసుకుని తపస్సు చేయడం, ఆ అగ్ని

నుంచి వచ్చే పొగను పీల్చడం గమనించాడు. అందువలననే రాజ్యంలో అకాల మరణాలు జరుగుతున్నాయి తెలుసుకున్నాడు. ప్రజాక్షేమాన్ని కాంక్షించిన రాముడు వెంటనే శంబుకుడిని సంహరించాడు.' అని రాశారు.

ఇక్కడ రామాయణము ద్వారా మనము గ్రహించవలసిన సత్యం ఏమిటంటే

**భవిష్యచ్ఛూద్రయోన్యాం వై తపశ్చర్యా కలౌ యుగే**

అనగా కలియుగంలో శూద్రులకు కూడా తపశ్చర్య ప్రవృత్తి ఏర్పడి అందరూ సమానులుగా ఉంటారు. అని చెప్పబడింది. కాబట్టి యుగాలలో ధర్మాలు మారుతూ ఉంటాయి.

యుగయుగానికీ మనుష్యుల శక్తి క్షీణిస్తుంది. అన్ని యుగాలలో అన్ని వర్ణాల వారు తమ తమ కర్మలను ఆచరించే వాళ్ళు. వాళ్ళలో హెచ్చుతగ్గులు లేవు. కృత యుగములో మనుష్యులకు ఎక్కువ శక్తి ఉండటం చేత బ్రాహ్మణుల తపస్సు మొత్తం సమాజానికి సరిపోయింది. త్రేతా యుగములో మనుష్యుల శక్తి కొంత క్షీణించి క్షత్రియులు కూడా తపశ్చర్య చేయవలసి వచ్చింది. ద్వాపర యుగములో ఇంకొంత శక్తి క్షీణించింది కాబట్టి వైశ్యులు కూడా తపశ్చర్య చేయవలసి వచ్చింది. కలియుగానికి వచ్చేసరికి మనుష్యుల శక్తి మరింత క్షీణించడం వలన అందరూ ధర్మం ద్వారా లోకాన్ని కాపాడటం కోసం అందరూ వాళ్ళ వాళ్ళ శక్తి కొద్దీ చేతనైన తపస్సు చేయవలసి ఉంది. దీని అర్థం ఆ ముందు యుగాలలో మిగతా వారికి ఆ అర్హత లేదు అని కాదు, అవసరం లేదు అని శాస్త్రం చెబుతుంది. ఆ మాటకొస్తే కృతయుగంలో అందరూ బ్రాహ్మణులే అని శాస్త్రాలు చెపుతున్నాయి. ఆనాటి వ్యవస్థ వివిధ కర్మలు, పనులను బట్టి నడిచే వ్యవస్థలే కానీ అనేక ఉద్యోగాలు ఉండే వ్యవస్థ కాదు. అలాంటప్పుడు వివిధ పనులకు ఆ యా వర్ణాలవాళ్ళు మాత్రమే ఆయా పనులు లేదా కర్మలు చేయడం అనే నియమం ఉండేది. అలా నియమం లేకపోతే ఆనాటి వ్యవస్థలలో జనజీవనం సాగేది కాదు. కాబట్టి ఎవరి విద్యుక్త ధర్మాన్ని బట్టి వాళ్ళ ఆచరణ నిర్ణయింపబడింది. దానిపైనే సృష్టి, మానవ మనుగడ ఆధారపడి ఉంది. అదే లేకపోతే ఇవాళ వాటి గురించి మాట్లాడుకోవడానికి, ఈ నాగరికత ఉండేది కాదు. ప్రపంచానికే నాగరికత నేర్పిన సనాతన ధర్మం, సంస్కృతి మనది. దానిని మనం కాపాడుకోవాలి, ముందు తరాల వారికి అందజేయాలి. శ్రీరామ రక్ష సర్వ జగద్రక్ష. ★

# అహల్యా మాతే

(29 వ పేజీ తరువాయి)

దశరథ కుమారుడైన అజేయుడగు శ్రీరాముడు ఈ ఘోర వనమునకు వచ్చిన సమయంలో రామపాద ధూళి స్పర్శతో శాపవిముక్తిని పొంది పవిత్రురాలవు కాగలవు, శ్రీరామునకు అతిథి సత్కార ములు చేసిన తరువాత లోభ, మోహములు తొలగి, సంతోషముతో నన్ను చేరగలవు అని ఆశ్రమము విడిచి వెళ్ళాడు మహర్షి. మహా తేజస్సుతో వెలుగుతున్న గౌతమ మహర్షి, సిద్ధులు, చారణులు నివసించు పవిత్రమైన హిమాచల పర్వత శిఖరములలో తపమాచరించి, యింద్రుని, అహల్యను శపించిన పాపం తొలగించుకున్నాడు. ఈవిధంగా తన భర్తచే నిరాకరించ బడిన అహల్య ఆకారము కోల్పోయి, ఆనాటి నుండి రామ చంద్రుని రాకకై శిలాభావనలో ఎదురు చూస్తోంది.


అలా ఎదురు చూస్తున్న అహల్యకు ఆ రామ పాదము తనంత తానుగా వెళ్ళి తరింపచేసింది.

శ్రీరాముని దర్శనము వరకు గౌతమ మహర్షి యొక్క శాప వచనపు భారముచే, ముల్లోకములకు ఆమె కనపడక ఉండెను. శ్రీరామ దర్శనం కాగానే శాప విముక్తి చెందిన ఆమె, రామ లక్ష్మణులకు పాదాభివందనం చేసి అర్ఘ్యపాద్యములు సమర్పించి, అతిథి సత్కారములు ఆచరించింది. దేవతలు పుష్ప వృష్టి కురిపించారు. గంధర్వులు గానం, అప్సరసలు నృత్యం చేశారు. తన ఆశ్రమమునకు శ్రీరాముడు వేంచేసిన విషయం తెలిసి మహర్షి కూడా అక్కడికి రాగా, తపోబలం చేత పవిత్రురాలైన అహల్య భర్త చెంతకు చేరింది. మహా తపస్వి తయిన మహర్షి భార్యతో కూడి శ్రీరాముని భక్తిశ్రద్ధలతో పూజించి ఆనందభరితుడై ఆశ్రమము నందు తపోనిష్ఠుడయ్యెను. శ్రీరామచంద్రుడు కూడా గౌతముని పూజలను స్వీకరించి మిథిలకు బయలుదేరాడు. ఈ విధంగా పరమ పావని అహల్య వృత్తాంతం తెలిపి "అలా నేనేమైనా అహల్యమ్మ వలె రాముని పాద స్పర్శను పొందిన భాగ్యవంతురాలను కాదు కదా! అంటూ పెణ్ పిళ్ళై రామానుజుల వద్ద, నైచ్యానుసంధానంతో పలికింది ★

# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు

పరమాత్మచేత నిలబెట్టబడే, జీవుడు కార్యాలని చేస్తున్నాడు అని చెప్పటం కుదరదు అన్నదే ఆ ఆక్షేపం.

ఈ ఆక్షేపానికి సూత్రకారులే తరువాతి సూత్రంలో సమాధానాన్ని ప్రసాదిస్తున్నారు.

**కృతప్రయత్నాపేక్షస్తు విహితప్రతిషిద్ధ-అవైయర్థ్యాదిభ్యః** అన్ని కర్మలలోనూ జీవుడిచేత చెయ్యబడిన (మొదటి) ప్రయత్నాన్ని ఆశించే ఆప్రయత్నాన్ని అనుమతించి, పరమాత్మ ఆకార్యాన్ని చేయిస్తున్నాడు. ఎందుకంటే విధినిషేధశాస్త్రాలు వ్యర్థం కాకపోవటం మొదలైనకారణాలచేత అన్నది ఆ సూత్రం. "కర్తృత్వం పరమాత్మాధీనమైనది". అన్నట్లైతే విధినిషేధ శాస్త్రాలు వ్యర్థమే అని చెప్పబడిన ఆక్షేపానికి ఇందులో పరిహారం చెప్పబడుతున్నది.

అన్నికర్మలనీ ప్రారంభించేటప్పుడు జీవుడు తన ఇష్టప్రకారం మొదటి క్షణంలో చేసే ప్రయత్నాన్ని పరమాత్మ అనుమతించకుండానో, అడ్డుకొనకుండానో ఉపేక్షించి ఉంటాడు. రెండవక్షణంనుంచీ చేసే ప్రయత్నాలని మొదటి ప్రయత్నానికి అనుగుణంగా చెయ్యటానికి అనుమతించటం ద్వారా జీవుడిచేత కర్మలని చేయిస్తున్నాడు. ఇలా ఎందుకు ఒప్పుకోవాలి? అంటే, మొదటి ప్రయత్నంలోకూడా జీవుడిని కార్యం చెయ్యటానికి పరమాత్మే నిలబెడుతున్నాడు అని ఒప్పుకుంటే, ఇది చెయ్యి, అది చెయ్యి అని విధించే శాస్త్రాలూ, ఇది చెయ్యవద్దు అది చెయ్యవద్దు అని నిషేధించే శాస్త్రాలూ నిష్ప్రయోజనాలే అవుతాయి. తానే నిలబెట్టిన పుణ్యపాపకర్మలని గురించి పరమాత్మ తానే క్రమంగా ప్రీత్యప్రీతులని చూపటం, ఆ కారణంగానే పుణ్యం చేసినవాడికి సుఖాన్నీ, పాపం చేసినవాడికి దుఃఖాన్నీ కలిగించటం కుదరకపోతుంది.

కనుక, పరమాత్మచేత జీవుడు కార్యాలని చేయించేవాడైనా, జీవుడు మొదటి ప్రయత్నంలో స్వతంత్రుడుగనుక, వాడు శాస్త్రవిధినిషేధాలకీ అర్హతపొందినవాడే అవుతున్నాడు.

జీవుడు కర్మలని చేసేటప్పుడు 1. ఉదాసీనుడై ఉండటం, 2. అనుమతించేవాడై ఉండటం, 3. నిలబెట్టేవాడవటం

అనే మూడు ఆకారాలు పరమాత్మకి ఉన్నాయి. 1. వాటిలో జీవుడి మొదటి క్షణప్రయత్నంలో పరమాత్మ దానిని తాను అనుమతించకుండా, అడ్డుకొన కుండా జీవుడిని వాడి మార్గంలో వదిలివేసి వాడి ప్రయత్నాలలో ఉదాసీనుడై ఉంటాడు.

2.జీవుడు మొదటి క్షణంలో తాను ఇష్టపడి ఒకవిధంగా కార్యాన్ని ప్రారంభించిన తరువాత, రెండో క్షణంనుంచి వాడు చేసే క్రియలని అనుమతిస్తుంటాడు. ఇలా ఎందుకు? అంటే, పరమాత్మయొక్క అనుమతి లేకపోతే జీవుడిచేత ప్రారంభించిన పనిని చేస్తూండటం సాధ్యం కాదు గనుక అనుమతిస్తున్నాడు అని శాస్త్రవచనాలతో ఒప్పుకుంటున్నాం.

పరమాత్మ యొక్క అనుమతి లేకుండా మొదటి క్షణంలోనే జీవుడు ఎలా కార్యం మొదలుపెట్టగలడు? అంటే, విధినిషేధశాస్త్రాలు వ్యర్థం అవటం మొదలైన వెనుకచెప్పిన దోషాలు రాకుండా ఉండటానికి పరమాత్మే జీవుడికి ఆ స్వతంత్రబుద్ధిని ఇవ్వటంచేత మొదటి క్షణంలో జీవుడే కార్యాన్ని ప్రారంభించటానికి ఆటంకం ఏమీ లేదు.

రాజు మొదలైనవాళ్ళు తమ ఇష్టప్రకారం మంత్రులు మొదలైనవాళ్ళకి కొన్ని విషయాల్లో స్వాతంత్ర్యం ఇస్తే, దాంతో మంత్రులు మొదలైనవాళ్ళు తమ ఇష్టానుసారంగా కార్యం చేసేటప్పుడు రాజుయొక్క స్వాతంత్ర్యానికి, మంత్రులు పారతంత్ర్యానికీ లోటు ఎలా ఉండదో అలాగే పరమాత్మచేత తన ఇష్టప్రకారం ప్రసాదించబడిన స్వతంత్రబుద్ధితో జీవుడు పూర్వకర్మని, వాసనని కూడా లెక్కచెయ్యకుండా మొదటి ప్రయత్నాన్ని చేసేటప్పుడుకూడా పరమాత్మయొక్క స్వాతంత్ర్యానికో. సర్వకారణత్వానికో కర్మానుగుణ ఫల ప్రదత్వానికో జీవుడి పారతంత్ర్యానికో ఏలోటూరాకుండానే ఉంటుంది.

(మరికొంత వచ్చే సంచికలో)

శ్రీసంప్రదాయ సేవలో (శ్వాస్)

# శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి




## శ్రీవైష్ణవ తత్త్వ పరిరక్షణకై ఆవిర్భవించిన శ్వాస్

## శ్రీమాన్ మంగళగిరి యాదగిరి స్వామి నుండి సేకరణ

శ్రీవైష్ణవ ధర్మ పరిరక్షణకై, ఇతరుల ఆనందమును, కాంక్షించే 'శ్రీవైష్ణవ తత్త్వము' యొక్క వైభవాన్ని పెంచుటకు. భద్రాద్రిలో సాక్షాత్తు వైకుంఠ నారాయణుడే శ్రీరామనారాయణుడిగా వెలసినాడని నిరూపిస్తూ ఉద్భవించినది శ్వాస్. నాటి నుండి నేటి వరకు శ్రీవైష్ణవ తత్త్వ పరిరక్షణమే ప్రథమ కర్తవ్యంగా భావించి జగద్గురువు, జగదాచార్యుల పరిపూర్ణ మంగళాశాసనములతో ఆవిష్కరించబడింది. ఆలయాలల్లో ఆగమోక్త విధానాలు కొనసాగవలసిన ఆవశ్యకమును ఎలుగెత్తి చాటుతూ, హైందవ ధర్మములో పరమ పవిత్ర గ్రంథాలు శ్రీరామాయణము, శ్రీమద్భాగవతం, మహాభారత ఇత్యాది గ్రంథాల సారము అందరికి అందేలా చేయటం, తద్వారా అందరూ ఉత్తమ మానవులుగా జీవనమును కొనసాగించుటకై ఇతరుల బాధను తమ బాధగా భావించే సౌందర్య శీలమును పెంపొందించుకునేలా చేయుట, తత్సంబంధిత జ్ఞాన సంపద అందరికి అందించే ప్రయత్నాలుగా 'వార్షికోత్సవము'ల పేరిట శ్వాస్ ప్రమత్నిస్తూ ఉన్నది.

మన ఆళ్వారులు, ఆచార్యులు, పూర్వీకులు నిలబెట్టిన పరంపరాగతమైన జ్ఞాన సంపద, సమాజ వికాసానికై అందించే మార్గాలను శ్వాస్ అనుసరిస్తున్నది. అందరికి ప్రయోజనకరమైన గొప్ప సాఫల్యతను సాధించేలా శ్యాస్ ప్రమత్నిస్తునే ఉంది.



విపత్కరమైన కరోనా ప్రబలిన సమయంలో అర్చకులకు అవసరమయ్యే నిత్యావసర వస్తు వితరణ గావించింది. సమాజ క్షేమాన్ని కోరే అనేక మంది పురోహితుల హితాన్ని కాంక్షించి విస్తృత రీతిలో సేవావితరణలకు శ్వాస్ పూనుకున్నది.

శ్రీవైష్ణవత్వము పెంచేలా తద్వారా అందరి బాధలు పంచుకునే తత్త్వమును పెంపొందింప జేయుటకు గాను అందరిలో ఐక్యత పెరిగాలా ఆత్మీయ సమ్మేళనాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా శ్వాస్ నిర్వహించింది. ఎందరో ఉభయ వేదాంతులను భాగవతోత్తములను సత్కరించింది. వారు చేయు కార్యములు, శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయములు వృద్ధి పొందేలా, కొనసాగేలా ప్రోత్సహపూరిత సమ్మేళనాలు చేపట్టింది శ్వాస్.











భగవంతుని కళ్యాణ గుణ సౌందర్యమును అనుభవించి, తరించి, ఆళ్వారులు పాడిన దివ్య ప్రబంధ పాశురములు, వివిధ స్తోత్రములు అందరికి అందుబాటులోకి తీసుకువచ్చే విశేష శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది శ్వాస్.

ధర్మశాస్త్రమును గురించి తెలుసుకొనుట అత్యంత ఆవశ్యకమని ధర్మశాస్త్ర శిక్షణను కూడా చేపట్టింది శ్వాస్.

శ్రీవైష్ణవ దివ్య దేశాలు, ఆళ్వారాచార్య తిర్నక్షత్రములు వాటి వైభవమును తెలియపరుస్తూ, 'కాలదర్శిని' ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం. తద్వారా దివ్యదేశాలను ఎందరో దర్శించుకునే అవకాశానికి మార్గాలను ఏర్పాటు చేసింది శ్వాస్. ఆపదలో ఉన్న కొందరికి ధనరూపేన సహాయ సహాకారాలను అందించటం, ఆరోగ్యాన్ని పెంపొందించే మార్గాలను చూపించటం చేసింది శ్వాస్.

'శ్వాస్ నిత్యకాలదర్శి'ని ద్వారా సంప్రదాయ, విశిష్టాద్వైత సిద్ధాంత మార్గమును అందరికీ చేరువయ్యేలా కాలదర్శిని పనిచేయుచున్నది. పంచాంగాలు, పర్వదినాల నిర్ణయము చేయు విధివిధానాలు రూపకల్పనలు సమాజమునకు మేలు చేసేలా కార్యాచరణలు రూపొందించింది శ్వాస్. సంప్రదాయ ఆచరణా కుసుమాలు వికసించేలా, నిరంతరం అందరికి అవి చేరువయ్యేలా ప్రయత్నాలు కొనసాగిస్తుంది శ్వాస్.

ముచ్చింతల్లో ప్రతిష్ఠించబడిన సమతామూర్తి ప్రతిష్ఠాపన సమయంలో శ్వాస్ కార్యకర్తలు అనేక విధాలుగా సేవలనందించారు.

హైదరాబాద్ నగరం కేంద్రంగా 2020 అక్టోబర్ 31న జగదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీమాన్ మంగళగిరి యాదగిరి స్వామి రాష్ట్ర ప్రధాన అధ్యక్షులుగా, శ్రీమాన్ వెంకటకిషోర్ కార్యదర్శిగా శ్వాస్‌సంస్థ ప్రారంభించబడింది. శ్రీ వైష్ణవ ఆగమ సంప్రదాయ పరిరక్షణ సంస్థగా ప్రారంభింపబడిన శ్వాస విస్తరిస్తూ వివిధ జిల్లాల శాఖలను కూడా ఏర్పాటు చేసింది. వార్షికోత్సవంలో భాగంగా ప్రముఖులైన పండితుల సంప్రదాయ ప్రవచనాలతో సభలను ఏర్పాటు చేసింది. ప్రథమ వార్షిక సభ శంషాబాద్ ముచ్చింతలో మహా మహోపాధ్యాయ పండిత రత్న శ్రీమాన్ రంగ రామానుజాచార్యుల అధ్యక్షతన జీయర్ స్వాముల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. రెండవ వార్షిక సభ సూర్యాపేటలో మూడవ వార్షిక సభ అత్యంత వైభవంగా వైకుంఠపురం సంగారెడ్డి క్షేత్రంగా ఆగమాలు వాటి వైభవం అను ప్రత్యేక అంశముపై పండితుల ప్రవచనాలతో సాగింది. శ్వాస్ సంప్రదాయ సేవలో ముందుకు సాగుతున్నది.





# ఋషి వాక్య ప్రబోధాలు



శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

**శ్లో॥ కథా రామయణస్యాపి**
**నిత్యం భవతి యద్గృహే।**
**తద్గృహం తీర్థరూపం హి**
**దుష్టానాం పాపనాశనమ్॥**

(స్కంద పురాణమ్)

ఎవరి యింటిలో నిత్యము శ్రీరామ చరితం గానం చేయబడుతుందో ఆ ఇల్లు. గొప్ప తీర్థ క్షేత్రమగును. వారి ఇంటిలో ప్రవేశించిన దుష్టులు కూడా పాపము పోయి పవిత్రులగుదురు.

**శ్లో॥ తావత్ పాపాని దేహేస్మిన్**
**నివసంతి తపోధనాః।**
**యావన్న శ్రూయతే సమ్యక్**
**శ్రీమద్రామాయణం నరైః॥**

(శ్రీరామాయణ మహత్యం)

ఓమహాత్ములారా! మానవులు ఎంతవరకు శ్రీమద్రామాయణాన్ని ఆలకించరో అంతవరకు వారి దేహాలలో పాపాలు గూడుకట్టుకొని ఉంటాయి. శ్రీమద్రామాయణం విననివారికి పాపాలు పోవు.

**శ్లో॥ యత్రస్యాత్ మహాతాం ప్రేమ**
**తత్ర స్యుః సర్వ సంపదః।**
**తేజః, కీర్తిం, ధనం, పుత్రాః**
**ఇతి ప్రాహు ర్విపశ్చితః॥**

**శ్లో॥ తత్ర వృద్ధిం గమిష్యంతి**
**శ్రేయాంస్యనుదినం మునే।**
**యత్ర సంతః ప్రకుర్వంతి**
**మహతీం కరుణాం ప్రభో॥** (నారద సూ.)

మహాత్ముని ప్రేమ ఎవరియందు ప్రసరిస్తుందో వారికి సర్వ సంపాదలతో పాటు తేజస్సు ధనము సంపదలు లభిస్తాయి అంతేగాక అలా లభించినవి దినదినము అభివృద్ధి చెందుతాయి

**శ్లో॥ మృగ మీన సజ్జనానామ్**
**తృణ జల సంతోష విహిత వృత్తీనాం।**
**లుబ్ధక ధీవర పిశునా**
**నిష్కారణ వైరిణో జగతి॥**

అడవిలో గడ్డి పోచలు తినే జింకలకు వేటగాళ్ళు, నీటిలో ఉన్న చేపలకు జాలరులు, సత్ పురుషులకు చాడీలు చెప్పే వారు శతృవులే!. ఎందుకిలా ప్రవర్తిస్తారు అంటే! ఏ కారణము లేదు సహజంగా శత్రుత్వమే నిష్కారణ వైరము ఆ ధర్మాన్ని కలిగిస్తుంది. అని తెలుసుకోవాలి.

**శ్లో॥ ఆర్జితం తు ధనం సర్వే**
**భుంజంతే బాంధవా స్సదా।**
**సర్వేష్వేకతమో మూఢః**
**తత్పాప ఫలమశ్నుతే॥**

మానవుడు అధర్మంగా సంపదలు కూడబెడితే వారి బంధువులంతా వాటిని అనుభవించడానికి సిద్ధంగా ఉంటారు. మరి పాపాన్ని మాత్రం ఒక్కడే (ఆ అధర్మపరుడే) అనుభవించగలడు. ఇంతకంటే మూర్ఖుడు ఎవరుంటారు? అందుకనే మనం న్యాయార్జితమైన ధనాన్ని వారసులకు ఇవ్వాలి. ( ధర్మో రక్షతి రక్షితః )

# తెలుసు కోవలసినది మూడే!



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

(క్రిందటి సంచిక తరువాయి)

ఆత్మ జ్ఞాతా తెలుసుకొనువాడు, కర్త చేయువాడు భోక్త భుజించువాడు అను ఈ మూడు లక్షణములు చెప్పవలసియుండగా మూటినీ చెప్పకుండా కేవలం జ్ఞాతాయని మాత్రమే ఎందుకు చెప్పారు. మిగిలిన రెండు ఎందుకు చెప్పలేదు యనగా జ్ఞాతా అని చెప్పినంత మాత్రమునే కర్త భోక్త యనునవి కూడా చెప్పినట్లే యగును. ఎందులకనగా కర్తృత్వ భోక్తృత్వములు రెండూను జ్ఞానము యొక్క వేరువేరు అవస్థలే కనుక జ్ఞాతాయని చెప్పినచో ఈమూడూ చెప్పినట్లేయగును.

ఈ ఆత్మ "నియామ్యము". అంటే నియమింపబడునది. దీనిని ఎవరు నియమిస్తారు ఎట్లు నియమిస్తారో చూద్దాం.

"యఆత్మని తిష్ఠన్... యమ యతి" అని ఉపనిషత్తులలో చెప్పబడుచున్నది. దీనిచే పరమాత్మ ఈ ఆత్మలో అంతరాత్మగా నిలచియుండి నియమించును. ఇట్లు ఎప్పుడూ ఈ ఆత్మ నందేయుంటూ ఎల్లప్పుడూ ఈ ఆత్మను నియమించును.

ఎట్లు నియమించును యనగా ఈ ఆత్మ తానున్న శరీరమును తనకు తోచినట్లు నడిపించునో అట్లు పరమాత్మ జీవునిలో అంతర్యామిగా యుండి తనకు తోచినట్లు ఈ జీవుని నడిపించును. కనుక ఆత్మ నియామ్యము పరమాత్మ నియామకుడు అనితేలింది కదా!

ఇట్లు పరమాత్మ చేత ఈ జీవుడు నియమింప బడుచున్నప్పటికీ ఈ జీవుడు శరీరము వలే తన పని తాను చేసుకోలేని అచేతనము కాదు. ఈ జీవునికి జ్ఞాతృత్వము తెలుసుకొనుట, కర్తృత్వము పనిచేయుట భోక్తృత్వము ఫలమును అనుభవించుట అను లక్షణములు సహజంగా ఉండుట చేత ఈ జీవుడు ఆయా పనుల యందు ప్రవర్తించుటకు తగిన శక్తి కలవాడుగా యుండును. కాని వీడు చేయు పనులకు వీడి ప్రయత్నమును చూచి పరమాత్మ ఆయా పనులకు తన అనుమతినిచ్చును. వీడి ప్రయత్నాన్ని తదనుగుణముగా ఆ పనిలో వీడు స్వయంగా ప్రవర్తించుటను బట్టి పరమాత్మ నిగ్రహం (కోపం) అనుగ్రహం చూపుచు ఫలము నిచ్చును. కనుక దీనిలో శాస్త్ర విరోధము లేదు రాదు.

ఇక "ధార్యము" అంటే ఏమిటో చూద్దాం. ధార్యము అనగా పరమాత్మ చేత ధరింపబడి యుండును. ఆధారముగా యుండును. పరమాత్మ జీవునిలో అంతర్యామిగా యుండి తన సంకల్పము చేత, తన ఇచ్ఛ (కోరిక) చేత ఎప్పుడూ ఈ ఆత్మను నిలబెడుతూ ఉండును. అట్లు పరమాత్మ సంకల్పము మరియు ఇచ్ఛ లేనిచో ఈ జీవుడు ఉండనేయుండడు. లోకంలో శరీరము ఆ శరీరము నందుండే జీవునిపై ఆధారపడి జీవుని సంకల్పముపై ఆధార పడి యుండుట మనం చూచుచునే యున్నాము. అట్లే జీవుడు కూడా పరమాత్మపై ఆధారపడి యుండుటయే ఇచట ధార్యము యని చెప్పబడుచున్నది.


ఈ ఆత్మ శేషము అనీ ఆత్మ యొక్క ప్రధానలక్షణమైన శేషత్వమును తెలుపుచున్నారు. ఈ ఆత్మ భగవంతునికి శేషము. శేషము అనగా భగవానుని ఇష్టానికి అనుగుణముగా ఆయన మనని ఉపయోగించుటకు అనువుగా ఉండుట. ఇష్టానికి అనుగుణముగా ఉపయోగపడుటయే శేషత్వము. అట్లు ఉపయోగపడుట ఎట్లు అనగా చందనము, పూలు తాంబూలాదులు ఒకవ్యక్తి వానికి ఇష్టానికి అనుగుణంగా ఆ వ్యక్తి ఉపయోగించు కొనుచున్నాడో అట్లే జీవుడు, పరమాత్మకు ఉపయోగపడును ఇదే శేషత్వము అంటే.

ఇష్టానికి అనువుగా ఉండుట అనగా ఈ చందనాదులు ఒకనికి వినియోపడునప్పుడు తమకంటూ ఎట్టి ప్రయోజనమును కోరకనే, వ్యక్తి తన కుపయోగించు కొన్నచో ఉపయోగపడుచున్నది. తను వేరొకరికి ఇచ్చునపుడు ఏమీ అడ్డుపడక ఇచ్చుటకు అనువైన విధంగా ఉందంటున్నవి కదా!

అట్లే ఈ జీవుడు కూడా భగవానునికి ఉపయోగపడాలి. అట్లు ఉపయోగపడునపుడు తన కెట్టి ప్రయోజనము కోరక తనని ఉపయోగించు కొనుట భగవానునికి ఆనందము కలుగునట్లు ఉండవలెను. ఇట్లు ఉండుటను తిరుప్పాణ్యాళ్వార్లు అమలనాదిపిరాన్ అను గ్రంథములో

(మిగతా 40 వ పేజీలో)

# వానమామలై దివ్య చరిత్ర



రోమస మహర్షి క్షేత్రం అదే తోతాద్రి.

**ఆద్యం ప్రోక్తం స్వయం వ్యక్తం వినుతమ్ రంగ సంజ్ఞాతం।**
**శ్రీ మూష్ణం వేంకటాద్రీశ్చసాలగ్రామంచ నైమిశం॥**
**తోతాద్రి పుష్కరంచయేవ నరనారాయణాశ్రమం।**
**స్వయం వ్యక్తేశు సర్వేశు తోతాద్రి స్థలం ఉత్తమం।**
**యత్రాస్తే భగవాన్ విష్ణు నిత్యం సన్నిహితో హరిః॥**

రోమస మహర్షి చేసిన మహా తపస్సు ఫలితంగా పరమపద నాథుడి సేవా భాగ్యం ఈ భూలోకంలో మనందరికీ అనుగ్రహించబడింది. మనందరికీ ఆ చరిత్ర గురించి తెలుసుకునే అవసరం ఉంది.

పరమపదనాథుడు ఈ వానమామలై క్షేత్రానికి రావాలని, ఈ భూలోకంలో జనులంతా తనను దర్శనం చేసుకొని, తనయందు విశ్వాసం ఉంచుకొని సంతోషంగా ఉండాలని అనుకుంటూ అవకాశం కోసం ఎదురు చూస్తుండగా, రోమస మహర్షి వైకుంఠనాథుడి సేవ కోసం గంగానది తీరంలో చాలా సంవత్సరాలు తపస్సు చేస్తుండగా వైకుంఠనాథుడు ప్రత్యక్షమైనాడు. మహర్షి తనకు మాత్రమేకాక భూలోకంలో అందరికీ ఆ పరమపదనాథుడి దర్శనం కలిగించాలని ప్రార్థించినాడు. స్వామివారు సంతోషించి తాను వానమామలై వస్తున్నానని అభయమిచ్చినాడు పరమపదనాథుడు.

రోమస మహర్షి:

రోమస మహర్షి పుట్టు గుడ్డి. ఆయనకు దేహమంతా రోమాలుంటాయి. ఒక్క రోమం క్రింద పడితే ఒక్క ఆయుశ్శు తో సమానం. ఎన్నిరోమాలు ఉంటే అన్ని బ్రహ్మల కాలం ఆయన ఆయుశ్శు.

సృష్టి చేసే బ్రహ్మకు నారాయణుడు చాలా ఆయుశ్శు ఇచ్చినందుకు బ్రహ్మకు గర్వం పెరిగింది. ఈ గర్వం పోగొట్టడానికి స్వామివారు సమయం కోసం చూస్తుండగా అదే సమయంలో వేదాధ్యయనం చేసిన రోమస మహర్షి వేదం తెలిసిన బ్రహ్మ ఆయుశ్శును తెలుసుకొని అంతే ఆయుశ్శు తనకు ఉండివుంటే ఈ భూలోకంలో ఉన్న జనులకు స్వామివారి గురించి ప్రార్థనా పద్ధతి బోధించగలనని అనుకున్నాడు. అంతే కాక ఎన్నెన్నో ఆరాధనలు కూడా చేయగలనని రోమస మహర్షి అనుకున్నాడు. స్వామి వారు కూడా ఆయనకు వరమిచ్చినారు.

బ్రహ్మ ఆయుశ్శు కల్పాంతరం తో పూర్తవుతుంది.

అందులో

**శ్రీమతి వనం ఉషా రాణి**

| | | |
|---|---|---|
| 1. | కృతయుగం | = 1728000 సం॥లు |
| 2. | త్రేతాయుగం | = 1296000 సం॥లు |
| 3. | ద్వాపరయుగం | = 864000 సం॥లు |
| 4. | కలియుగం | = 432000 సం॥లు |
| 5. | చతుర్యుగం | = 4320000 సం॥లు |
| 6. | 71 చతుర్యుగాలు | = 1 మన్వంతరం |
| 7. | 14 మన్వంతరాలు | = 1 కల్పం |

కల్పం ప్రారంభంలో బ్రహ్మసృష్టి అవుతారు. కల్పాంతరంలో బ్రహ్మ ఆయుశ్శు పూర్తవుతుంది. ఇది గీతలో 2.20 వ్యాఖ్యానంలో ఉంది. ఇట్లా రోమస మహర్షికి ఒక్కొక్క కల్పంకు ఒక్కొక్క రోమం క్రింద పడింది. ఆ రోమాలున్నంతకాలం మహర్షి వానమామలైలో భగవత్ కైంకర్యం చేస్తూనే ఉండెను. వానమామలై ఎంత ప్రాచీనమైనదో స్థల పురాణంలో ఉన్నది. బ్రహ్మదేవుని దగ్గరున్న వేదమును దొంగలించిన మధుకైటభులనిద్దరినీ తన తొడపై పెట్టుకుని సంహారం చేసి, ఆ ఇద్దరి దేహాలను భూమిపై పడవేసినాడు విష్ణుమూర్తి. భూమి అంతా దుర్గంధం వ్యాపిస్తే భూమాత వానమామలై వచ్చి తపస్సు చేసినది. శ్రీదేవి కూడా భృగుమహర్షికి కూతురిగా పుట్టి ఇక్కడికి వచ్చినది. ఆదిశేషుడు పరమపదనాథుని వదిలి ఉండలేక ఆయనా ఇక్కడికి వచ్చినారు. అట్లే గరుత్మంతుడు కూడా తానూ స్వామితో ఉండాలని వానమామలైలో వాహన సేవా కైంకర్య రూపంలో, స్వామివారిని వైకుంఠానికి గొనిపోవుటకు సిద్ధంగా ఉన్నట్టు కొలువుదీరియున్నాడు. ★

(మిగతా వచ్చే సంచికలో)

# శ్రీభాష్యంలో శ్రీరామాయణ సూక్తుల ఉట్టంకనం



శ్రీమాన్ శ్రీ డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు

శ్రీభాష్యంలో రెండు శ్రీరామాయణ శ్లోకాల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ రెండు విశిష్టాద్వైత తత్త్వాలను వివరించడంలో సహాయపడుతున్నవి.

బాలకాండలోని మొదటి సర్గలో "దేవమాయేవ నిర్మితా" అనే వాల్మీకి మహాముని సీతను వర్ణించాడు. ఈ శ్లోకం శ్రీభాష్యంలోని సంధ్యాధికరణంలో

**మాయామాత్రం తు కార్త్స్న్యేన అనభివ్యక్తస్వరూపత్వాత్**

(3-2-3) అనే సూత్రవ్యాఖ్యానంలో ఉదాహరింపబడింది. **మాయాశబ్దోహ్యాశ్చర్యవాచీ, 'జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితే'త్యాత్యాదిషు తథా దర్శనాత్."** అనేది అక్కడ శ్రీభాష్యవివరణం. కలలో కనిపించేది అంతా యథార్థమే, అసత్యం కాదు. అనే అర్థాన్ని సమర్థిస్తూ, సూత్రంలో ఉండే 'మాయా' అనే పదానికి అర్థం చెప్పడంకోసం శ్రీ రామానుజులు ఈ వాల్మీకి సూక్తిని ఉదాహరించారు.



"స్వప్నంలో కనిపించేవి భగవంతునిచేత ఆశ్చర్యాన్ని కలిగించే రీతిలో సృష్టింపబడుతున్నాయి. వానిని కలను కనేవాడు మాత్రమే, అతడు కలను కనే సమయంలో మాత్రమే చూడగలుగుతున్నాడు. పై వాల్మీకి సూక్తికి "సీతాదేవి, పరమాత్మయొక్క ఆశ్చర్యకరమైన శక్తి అవతరించినట్లుగా ఉన్నది" అని అర్థం.

విలక్షణత్వాధికరణంలో శరీరలక్షణాన్ని చెప్పే సమయంలో, **న తు దృష్టాంతభావాత్** (2-1-9) అనే సూత్రవ్యాఖ్యానంలో, "అన్నీ భగవంతునకు శరీరమై ఉన్నాయి" అని వివరించడానికి శ్రుతులనుండి, స్మృతులనుండి పలు ప్రమాణాలను ఉదాహరించే సమయంలో,

**జగత్ సర్వం శరీరం తే** ( శ్రీరామాయణం- యుద్ధకాండ- 120-25) అనే వాల్మీకి రామాయణ వచనం శ్రీరామానుజులచేత ఉదాహరింపబడింది. ఈ ప్రమాణం శ్రీరామాయణం యుద్ధకాండ చివరిలో ఉన్నది. ఇక్కడ ఈ సూక్తిని వ్యాఖ్యానిస్తూ గోవిందరాజాచార్యులవారు

**తవ నియమేన ఆధేయం విధేయం, శేషభూతం చ. ఇదమేవ హి శరీరలక్షణమ్**

అని అనడం గమనించ దగినది.

రావణుడు మరణించిన తరువాత, సీతాదేవిని పరిగ్రహించటానికి ఇష్టపడనప్పుడు, సీతాదేవి అగ్నిప్రవేశం చేసినది. అప్పుడు బ్రహ్మ, శివుడు మొదలైన దేవతలు అందరూ ప్రత్యక్షమై, శ్రీరాముని స్తుతించారు. రాముడు తనను మానవునిగానే భావిస్తున్నట్లుగా పలికాడు. అప్పుడు బ్రహ్మ, శ్రీరాముని నారాయణ స్వరూపంగా స్తుతించేటప్పుడు, ఈ సూక్తిని పలికాడు. ఇది, విశిష్టాద్వైత సిద్ధాంతానికి ప్రతితంత్రార్థం అనదగిన, భగవంతునకు, చేతనాచేతనాలకు మధ్య ఉండే శరీరాత్మభావాన్ని వివరిస్తున్నది.

**భగవాన్ నారాయణో దేవః** అని ఆరంభించి, తరువాత తాను వివరించినదానిని సంగ్రహంగా చెప్పడంకోసం,

**బ్రహ్మ న తదస్తి త్వయా వినా,**

**జగత్ సర్వం శరీరం తే** అని అన్నాడు. "నిన్ను ఆత్మగా లేనిది ఏదీ ఈ లోకంలో లేదు, లోకం అంతా నీకు శరీరమే" అని దీనికి అర్థం. జగత్తులో, అంతటా లోపల, బయట వ్యాపించి, భగవానుడు నియమిస్తున్నాడు. అతడు అన్నిటికీ అంతర్యామి, చేతనాచేతనాలు అన్నీ అతనికి శరీరం అనేదేకదా, విశిష్టాద్వైతసిద్ధాంతంలో మౌలికమైన అంశం.★

# పాదుకాసహస్రావిర్భావమ్

**శ్రీమాన్ శ్రీ ఇయుణ్ణి శ్రీనివాసాచార్యులు**

**పద్మాధాత్రీ కరాభ్యాం పరిచితచరణం**
**రంగరాజం భజేహం'**

అని శ్రీరంగనాథుని దివ్యమంగళవిగ్రహసందర్శనజనిత పులకిత తనువులైన శ్రీవేదాంతదేశికుల పాండిత్యప్రతిభను తెలుసుకున్న ఓ పండితుడు ఆయనను ఎలాగైనా ఓడించాలని కంకణం కట్టుకుని ఆయన దగ్గరకు వచ్చారు. నీవు కవితార్కిక సింహం అని నిరూపించుకోవాలంటే శ్రీరంగనాథుని మీద ఒకే ఒక రాత్రిలో వేయి శ్లోకాలను రచించి చూపించమన్నారు. అప్పుడు దేశికులవారు ఎంతో వినమ్రతతో "స్వామీ! నాకు పోటీపడాలన్న ఉద్దేశ్యం లేదు. అందువల్ల నాకు ఈ బిరుదు వద్దు, కావాల్సివస్తే మీరే పెట్టుకోండని" చెప్పారు. తనకు భగవత్ కైంకర్యమే ముఖ్యమని విన్నవించారు. ఈ మాటలను విన్న ఆ పండితుడు "కాదు కాదు పోటీపడాల్సిందే" నంటూ నేను దేవదేవుని దివ్యపాదారవిందముల మీద వేయి శ్లోకాలను వ్రాస్తాను. మీరు కూడా ఈ రాత్రిలోపల వేయి శ్లోకాలను రచించి చూపించమని పోటీకి మరోసారి ఆహ్వానించారు. పోటీయే వద్దని అనుకుంటున్న తరుణంలో శ్రీ వేదాంత దేశికులవారి శిరస్సు మీద అర్చకోత్తములు శ్రీశఠారిని అనుగ్రహించినప్పుడు ఆయనకు ఒక దివ్యానుభూతి కలిగినట్లు అనిపించింది. వెంటనే ఆ పండితునితో "స్వామీ, ఈ దాసుడు ప్రయత్నించగలడని" పోటీకి అంగీకరించారు.



ఇదంతా ఆ నమ్మాళ్వార్లస్వరూపమైన శ్రీ శఠారిగా పిలిచే ఆ దివ్యపాదుకాప్రభావం వల్ల దేశికులవారి నోటి నుంచి పై మాటలు వెలువడ్డాయి. తాను కవిత్వం రాయాలని సంకల్పించి దేశికులవారు నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో ఆ పండితుడు దేశికులవారు నిద్రపోతుండటాన్ని చూసి, ఆయన ఎంతో కష్టపడి 300 శ్లోకాలను రాసి నిద్రపోయారు. అదే సమయంలో 3వ ఝాములో పాదుకల సవ్వడి విని దేశికులవారు నిద్రలేచారు. భగవదనుగ్రహ విశేషంచేత పాదుకాప్రభావ విషయంగా 1008 శ్లోకాలను సునాయాసంగా, రసరమ్యభరితంగా వివిధ ఛందో అలంకారగుణవృత్తిరీతి యుక్తంగా రచించారు. అదే 'పాదుకా సహస్రం'. అద్భుతమైన, అద్వితీయమైన ఈ కావ్యాన్ని స్వామి పాదాలకు సమర్పించడానికై నిత్యకర్మానుష్ఠానాలను నిర్వర్తించి శ్రీరంగనాథుని సన్నిధికి చేరుకున్నారు. స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి వినయంగా నిలిచి ఉన్నప్పుడు, పోటీ చేయమని చెప్పిన పండితుడు అక్కడకు వచ్చి దేశికులవారు ఏమీ రాయలేదని, 'కవితార్కిక సింహ' బిరుదును వారినుండి తనకు వస్తుందనే ఆశతో తాను రచించిన 300 శ్లోకాలను సమర్పించారు.

తరువాత దేశికులవారు వినయంగా, ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీరంగనాథుల ఎదుట

**సంతః శ్రీరంగపృథ్వీశచరణత్రాణ శేఖరాః।**
**జయంతి భువనత్రాణపదపంకజరేణవః॥**

అని వైదిక ఛందస్సు అయిన అనుష్టుప్ ఛందస్సులో ప్రారంభించి 32 పద్ధతులతో 1008 శ్లోకాలను స్వామివారికి సమర్పించగా శ్రీరంగమహిషితో కూడిన శ్రీరంగనాథులు అమందానందంతో 'కవితార్కికసింహ' అను బిరుదు శ్రీదేశికులవారికే తగునని అనుగ్రహించారు.

దేశికులవారి కవితాశక్తికి ఆశ్చర్యపడిన ఆ పండితుడు తనను క్షమించమని ప్రార్థించినప్పుడు దేశికులవారు “స్వామీ! పాదాల కింద ఉండే పాదుకలపై నేను రాసిన పాదుకాసహస్రం కన్నా స్వామిపాదాలను గురించి మీరు చెప్పిన పదకమలస్తోత్రమే గొప్పది. పాదాల కిందనే పాదుకలు ఉంటాయి కదా! అందుకే మీరు రాసిన స్తోత్రము విశేషమైనదని నేను భావిస్తాను” అని వినయంగా చెప్పారు.

అక్కడ ఉన్న పండితులు దేశికులవారి సహృదయతకు సంతోషించారు. ఈ గుణం ఎలా సాధ్యమని ప్రశ్నించినప్పుడు ఇదే రామానుజ సిద్ధాంతమని నిర్మలహృదయంతో భగవంతుడిని సేవించడమే ముఖ్యమని, కవితార్కిక సింహ అనే బిరుదు తనకు గొప్ప కాదని, పాదుకాసేవక’ అన్న బిరుదమే తన జీవితానికి సార్ధకతను ఇస్తుందని దేశికులవారు సెలవిచ్చారు.

ఈ పరమోత్కృష్ట, సుప్రసిద్ధ కావ్యంలో 1,000 పద్యాలను 32 అధ్యాయాలలో (పద్ధతులలో) నిబంధించారు దేశకులు ఈ సహస్రం ఒక భవ్య, తాత్త్విక, వేదాంత రచన, దేశికుల భక్తి తత్పరత, వేదంత భక్తి తత్పరత యొక్క పరిపూర్ణ వికాసాన్ని ఈ స్తోత్రం చూస్తాము.

కలి ప్రభావంతో కష్టపడుతున్న జనులను సంరక్షించేందుకు అవతరించిన వేదాంతదేశికులవారు చెప్పిన శ్రీ రంగనాథ పాదుకాసహస్ర పారాయణం సకలదోషనివారకం, సర్వమంగళకారకం. అందు నవగ్రహశాంతి క్రింది శ్లోకం ద్వారా కలుగునని దేశికులవారు ప్రస్తావించారు

**కనకరుచిరా కావ్యాఖ్యాతా శనైశ్చరణోచితా**
**శ్రితగురుబుధా భాస్వద్రూపా ద్విజాధిపసేవితా।**
**విహితవిభవా నిత్యం విష్ణోః పదే మణిపాదుకే**
**త్వమసి మహతీ విశ్వేషాం నః శుభా గ్రహమండలీ॥**

వేదాంత దేశికులు విశిష్ట కావ్యకర్తలు, తత్త్వవేత్తలు, గ్రంథకర్తలు. వీరు 120కి పైగా సద్గ్రంథాలను రచించారు. ఆ గ్రంథాలను ఎన్నో అంశాలుగా వర్గీకరించవచ్చు. సులభ గ్రాహ్యమైనవి క్లిష్టతరమైనవి. మూలగ్రంథాలు వ్యాఖ్యానాలు, భాషాప్రాధాన్యత గలవి భావ ప్రాధాన్యత గలవి, కావ్యాలు నాటకాలు, స్తోత్రాలు, తత్త్వోపదేశాలు మొదలైనవి. ఇవే గాక, తానై వ్రాసినవీ, ఇతరుల అభ్యర్థనపై వ్రాసినవి అనే వర్గంలోకి కూడా వారి రచనలు వచ్చి చేరుతాయి.

## తెలుసు కోవలసినవి మూడే!

(36 వ పేజీ తరువాయి)

“అడియాత్కెన్నై తూళ్పడుత్తవిమలన్” తన దాసులకు నన్ను దాసునిగా చేసిన పవిత్రుడు రంగనాథుడు అనటం ద్వారా తనను (ఆళ్వార్లు) స్వామి తన దాసులను ఉపయోగించుకున్నాడు. అనగా తనకు నచ్చిన వారికి నన్ను శేషము చేసాడు అని పలికెను. కనుక జీవుని శేషత్వము స్వామి తనకైనా ఉపయోగంచుకుంటాడు, తనవారైన భక్తులకు వినియోగించుకుంటాడు అనునదితేలినది.

(మరికొంత వచ్చే సంచికలో తెలుసుకుందాము) ★

## వైభవంగా శ్రీశ్రీశ్రీ శతచండీ - మహాసుదర్శన నారసింహ యాగం

వేంపేట గ్రామము, మెట్‌పల్లి మండలము, జగిత్యాల జిల్లా యందు శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానములో శ్రీశ్రీశ్రీహరిత తీర్థస్వామి, శ్రీచక్రపాణి వాసుదేవాచార్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో, శ్రీచక్రపాణి మాధవాచార్యులు, నరసింహమూర్తి గార్ల వైదిక నిర్వహణలో, శ్రీచక్రపాణి వామనాచార్యులు ఆధ్వర్యంలో డిసెంబర్ 25 నుండి 28 వరకు వైభవంగా జరిగింది. ★






# అమృతత్వము

శ్రీమాన్ శ్రీ మరింగంటి కులశేఖరాళ్వారు



సకల చరాచర ప్రాణికి దైవముతో విడదీయరాని సంబంధం ఉంది. మన పెద్దవాళ్లు ఎవరిని ఆరాధించారో అదే మనకు దైవం. ఈ దైవానికి భగవంతుడు అని మరో పేరు. అతడు సామాన్యుడు కాక ఉత్తమోత్తముడై అసాధారణ శక్తిమంతుడై మన స్థితికి కారణం అవుతుంటాడు.అటువంటి దైవం ఎవరు అని కనుక్కోవడానికి సాధన చేసే వాడే జ్ఞాని. సరైన అవగాహనం చేసుకోవడమే జ్ఞానం.ఇట్టి జ్ఞానం ఉన్నవాడే పరమాత్మకు ప్రీతిపాత్రుడు.ఈ విషయాలను భగవద్గీతలో పరమాత్మ అనేక చోట్ల ప్రవచిస్తాడు దానిలో భాగంగా ఇప్పుడు కొన్ని విషయాలు గ్రహిద్దాం'

మనమందరం జనన మరణాలనే సంసారంలో ఉన్నాం .ఇది దుఃఖమయమైనది. దీని నుండి తప్పించుకోవడమే మోక్షం. ఈ బంధ విమోచనమే మన అసలైన లక్ష్యం. ఈ లక్ష్యం తెలియకుండా ముందుగా భజనలు పూజలు దానాలు ధర్మాలు తీర్థయాత్రలు చేస్తుంటాము కానీ, చివరికి వాటి కృషి ఫలితమంతా బంధ విముక్తే. బంధ విముక్తి అయితే గాని మోక్షం లభించదు. లభించే వరకు పుట్టడం గిట్టడం అనేక బాధలు అనుభవించడం తప్పదు.

మోక్షం రావాలి అంటే కైవల్య ఉపనిషత్తు **త్యాగే నైకేన అమృతత్వ మానసు** అని తెలిపింది ఒక్క త్యాగముచేతనే మోక్షం లభిస్తుంది అని, త్యాగము అంటే సన్యాసము. కనిపించే సమస్తము తనది కాదు అని భావన. సర్వవ్యాపి అయిన భగవంతుడే మనందరికీ మూలము సర్వశేషి. ప్రకృతికి సంబంధించిన సకల చరాచరమంతా ఆయనకు శేషభూతమైనది. ఈ భావన కలిగి ప్రవర్తించడమే సన్యాసం దానివలననే మోక్షం. అదే అమృతత్వం!

మోక్షం అంటే భగవంతుడు. సన్యాసం అంటే సమస్త కర్మలు అర్పించడం.అలాగనే కర్మఫలములు కూడా ఆశించక కైంకర్యబుద్ధితో ఆరాధించాలి. దాన్ని మోక్ష సన్యాసం అంటారు. సామాన్యంగా భక్తి సన్యాసం కర్మ సన్యాసం ఉంటాయి. కర్మలతో భగవంతుని సేవించడం కర్మసన్యాసం. భక్తితో భగవంతుని సేవించడం భక్తి సన్యాసం. మోక్ష సాధన కొరకు త్యాగం చేయాలి అని ఉపనిషత్తులలో ఉంది.

**సన్యాస యోగాత్ యతయఃశుద్ధ సత్వా, త్యాగేనైకేన అమృతత్వ మానసు** అని ఉంది. అంటే కామ్యకర్మలను వదలడం సన్యాసం, సర్వకర్మల ఫలం త్యజించడం త్యాగం అని అర్థం. సన్యాసమనే పేరుతో అడవులకు చేరి ఒంటరిగా ఉండడం సన్యాసం కాదు. గృహస్థులైన వారు కూడా ఇంట్లో దీనిని ఆచరించవచ్చు. ఆశ్రమ స్వీకారమే చేయక్కరలేదు. మనందరం ఆ ఉత్తమ యోగం ఆచరించవచ్చు. కొందరు కర్మలు చేస్తే ఎక్కడ లోపం జరిగి పాపాలు అంటుకుంటాయో, దాని వలన మరల పునర్జన్మలు ఏర్పడతాయో అని దైవికమైన ఏ కర్మలు చేయకుండా ఉంటారు. కానీ దాని అర్థం అది కాదు. భగవంతుడు తెలిపినది "మీరు తప్పక పవిత్రమైన కర్మలు చేయుము దానిలో **యజ్ఞోదానతప శ్చైవ పావనాని మనీషిణామ్** బుద్ధిమంతులైన వారు ఫలాన్ని కోరకుండా ధర్మాన్ని ఆచరించే వారికి ఇవి చాలా పవిత్రతను కలిగిస్తాయి అని మూడిటి గూర్చి తెలియజేస్తాడు. యజ్ఞము దానము తపస్సు ఇవి మోక్ష కారకాలు. కానీ వీటిని నిష్కామంగా సాగించాలి. దీనికి కర్తను నేనే. ఈ ఫలం కోసమే చేస్తున్నాను అని తలచకూడదు అలా చేస్తే ఫలితం తగ్గిపోతుంది. ఈ సమయంలో గుర్తించవలసినవి సాత్విక రాజస, తామస, త్యాగాలు.

1.సోమరితనం అజ్ఞానం వీటితో పెరిగి ధర్మ పరమైన కర్మలు మానేసి జీవిస్తూ ఏదో త్యాగం చేస్తున్నట్టుగా భావిస్తారు, కానీ అది కూడదు దానిని తామస త్యాగం అంటారు. నింద్యము.

2.విద్యుత్ ధర్మాలను చేయడంలో తమ శరీరానికి ప్రయాస కలుగుతుందని భయము దుఃఖము కలిగి వాటిని వదిలి జీవిస్తే అది రాజసత్యాగం అంటారు. అదీ తగదు

3.సాత్విక త్యాగం ఇది సత్సంప్రదాయమైనట్టి మార్గం. ఏదో ఒక విధానం దీనిని గ్రహించి మనంచేసే కర్మపై అభిమానం భక్తిశ్రద్ధ అభిరుచి కలిగి ఫల త్యాగం చేస్తూ సత్కర్మలు ఆచరించాలి. విజ్ఞులైన వారందరూ ఇలానే ఆచరిస్తూ ఉంటారు.

మనందరం సామాన్య దేహధారులం దేహ సంరక్షణ మన కర్తవ్యం దానికోసం కర్మలు (మిగతా 44 వ పేజీలో)

# శ్రీపరాంకుశ సుధాంబోధి

శ్రీమాన్ పి.కృష్ణమూర్తి



(గత సంచిక తరువాయి)

సీ.కర్మబంధము చేతగలిగెడి క్లేశముల్
తన్నాశ్రయించిన తరిమి గొట్టు
మెఱుపుతో గూడిన మేఘముల్ దోగాడు
బహుసుందరంబైన పర్వతమున
గోవర్ధనమునెత్తి గొల్లల గోవుల
గోడు బాపిన మేటి గోప కుండు
తన దొడ్డ మహిమను ధరణిలో వ్యాపింప
తిరుమాలిరుం శోలి దేవళమున

తే.గీ.వెలసియున్నాడు దీనుల వెతలు బాప
దివ్యమంగళాకారుడు దీన బంధు
అట్టి పర్వతరాజమే ఆశ్రయింప
దగిన సంతాపనాశిని తలప వలయు

సీ.పాపాల గుంపులు బాధించు జీవుల
భయంకపితుల జేసి పలువిధాల
అత్యంత చతురతన్ ఆ పాప రాశుల
నశియింప జేయును నల్లనయ్య
ఆశ్రిత రక్షణ అలవోకగా జేయు
చక్రాయుధము దాల్చు చక్రవర్తి
నిర్మలమై యొప్పు నిత్యనివాసంబు
తిరుమలిరుంశోలి దివ్యనగము

తే.గీ. ఊటనీటి ప్రవాహంబు ఉరకలేయు
దోషరహితమై వికసించు దొడ్డ దరము
పరమ పురుషార్థ మొసగెడి పసిడికొండ
ఉల్లమా దాని జేరుటే ఉత్తమంబు

సీ.శోకింపజేసెడు శోకంబు గలిగించు
దుష్ట విషయ వాంఛ దూరముంచి
ఉట్టిపై దాచిన చట్టిలోపలి వెన్న
చాటున మెక్కిన చక్కనయ్య
గోవులు గాచిన గోపాల కృష్ణుడు
వెలసిన స్థానంబు వేల్పు విడిది
సారంగములు పిల్ల సారంగములగూడి
చెవులను రిక్కించి చెంగునెగురు

తే.గీ.పరమ పురుషార్థములకదే పటుగొమ్మ
మోక్షమార్గంబు జూపించు మొదటి మెట్టు
అట్టి తిరుమలిరుంశోలి నాశ్రయించి
దాని నిరతంబు దలచుటే తగిన మతము

సీ.సంసారసాగర జలమగ్నులైసదా
మనమున చింతతో మడియనేల?
ఆదివరాహమై అవనిని రక్షించె
పద్మనాభుడు శౌరి పావనుండు
ఆస్వామి నెలవైన అత్యంత సుందర
తిరుమాలిరుంశోలి దివ్య శిఖరి
ఏకలంకములేని ఎకిమీడు సోముని
నిండారు చంద్రిక నిలుచు చోటు

తే.గీ.శ్రేయమొసగెడి మహిమల శ్రేష్ఠమైన
వాస యోగ్య ప్రదేశంబు వసుధయందు
చేరు ఏకాగ్ర చిత్తాన సేవ జేయ
పొంద దగినట్టిమేలదే పొందరేమి?

సీ.సర్వావయమ్ముల సంపూర్ణ శక్తితో
అతి హేయ కార్యాల నాచరించి
సడల జేయదగదు సంసార బంధాలు
మాయావి చేష్టల మహిమవాడు
నారాయణుడు సదా నడయాడు శైలంబు
తిరుమాలిరుంశోలి దివ్య పథము
గరుడుడు, శేషుడు ఘనునలై సూరులు
నిత్యము సేవించునిండుకొండ

తే.గీ.చేరినిత్యకైంకర్యము జేయనెంచి
సతతమాస్థలితలపుతో సాగవలయు
కోటి అనుభూతు లొసగెడి మేటి నగము
ఆశ్రయింపుట కనువైన అచల మదియె.

సీ.పాపాలు జేయుచు భయమాక్రమించగా
బలిమిని బాధింప బడుటదేల?
పరిమార్చువాంఛతో పాలిండ్ల విషముంచి
పూతన పాలిడ పూనుకొనగ
సంహరించిన మేటి సర్వోన్నతుడు శౌరి
నిత్య వాసము జేయు నిలయమదియె
కలభములన్గూడి కరులసమూహముల్
విహరించునచ్చోట వేడ్క గలుగు

ఆ.వె.దివ్యదేశమైన తిరుమాలిరుంశోలి
అండ నొసగుగాన అందుకొనుడు
పర్వతంబు పేరుపలికి నంత తొలగు
భవము వలన గలుగు బాధలన్ని

సీ.ధనము నార్జించుటే ధర్మంబుగా నెంచి
దొంగతనము జేసి దొంగలగుట
జూదంబు నాడుచు జూదరులగుటయు
చెడు కార్యములు జేసి చెడుట దేల?
వేదాలు తొలినాడే వేడుకన్ కీర్తించు
శ్రీరమానాథుడు శ్రీధరుండు
పరమాత్మ వెలసిన పర్వతమల్లదే
పలు జాతి పక్షుల పట్టు గొమ్మ

తే.గీ.విరివిగా నున్నవనములు విందుజేయు
నమ్మి జతగూడి సొగసుగా నాట్య మాడు
కోకిలలు కూయు కూయంచు కొమ్మలెక్కి
అదియే తిరుమాలిరుంశోలి ఆశ్రయించు

సీ.లోకముల్ సృష్టించి లోకులు మక్కువన్
తన్నాశ్రయింపగ దారిజూపు
కళ్యాణ గుణముల కరుణాంతరంగడౌ
పరమాత్మతత్వంబు పరుస వేధి
మోహంబుతొలగించి మోక్షమొసగెడిమేటి
సర్వేశ్వరుని కీర్తి సంపదలను
వర్ణించి నమ్మాళవార్లందజేసెను
వేయిపాశురముల వేదనిధిని

తే.గీ.అందు నీపది పాశురాలభ్యసింప
దొడ్డసంసారబంధముల్ తొలగిపోవు
పరమపురుషుని కరుణకుపాత్రులగును
చేర్చు పరమాత్మపాదాల చెంత మనల

★

# పురాతన గోదా వేణుగోపాలస్వామి దేవాలయం





పురాతన గోదా వేణుగోపాలస్వామి దేవాలయం


అత్యంత పురాతనమైన గోదా వేణుగోపాలస్వామి దేవాలయం బండ లింగాపురం గ్రామంలో ఉంది.

పచ్చని పంటలతో అలరారుతూ సంస్థానాల పాలనల నాటి చారిత్రక కట్టడాలు కలిగినది బండలింగాపురం గ్రామం. ఎందరో గ్రంథ కర్తలకు, భగవతోత్తములకు జన్మనిచ్చిన పవిత్ర ప్రదేశం ఈ గ్రామం. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో గల ఈ దేవాలయాన్ని అనేకమంది భక్తులు ప్రత్యేకంగా ఈ మార్గళి మాసంలో దర్శించుకుని తరిస్తారు.

1340 ప్రాంతాల్లో కుంభకోణం నుంచి తరలివచ్చిన చక్రపాణి వంశస్థులు ఆనాటి నుండే వేణుగోపాల స్వామికి ఆరాధనలు అర్చకత్వం నిర్వహిస్తున్నారని ఇక్కడి సమాచారం. ఇక్కడ స్థానికులు భక్తులు చెప్పే అరుదైన అద్భుతం ఏమిటంటే ఈ దేవాలయంలో గల ఆండాళ్ తల్లి ఉత్సవ అర్చామూర్తి శ్రీరంగంలోని గోదాదేవి మూర్తిని పోలి ఉంటుందట! అలాగే సమీపంలోని తక్కళ్ళపల్లి గ్రామంలో గల ఆండాళ్ మూర్తి కూడా ఈ మూర్తిని పోలే ఉంటుందని కథనం కూడా ఉంది. గోదా వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు గొప్ప వేడుకగా వైభవంగా నిర్వహిస్తారు.

ధనుర్మాసంలో తిరుప్పావై సేవా కాలం, ప్రత్యేక పాశురాల ఉత్సవాలు, భోగికి ముందు రోజున గోదా వేణుగోపాలస్వామి వివాహ మహోత్సవం అద్భుతంగా జరుగుతుంది. ఆరోజు ఊరందరికీ విందును ఏర్పాటు చేస్తారు. మరియు అనేక ప్రాంతాల నుండి భక్తులు విచ్చేస్తారు. గర్భాలయంలో భగవద్ రామానుజుల మూలమూర్తి కూడా దర్శనమిస్తుంది. శ్రీనమ్మాళ్వార్, భగవత్ రామానుజుల ఉత్సవమూర్తులు కూడా ఉంటాయి. ఈ దేవాలయానికి సమీపంలోనే రామాలయం, గండి హనుమాన్ కొండ స్వామి దేవాలయాలు ఉంటాయి. ఇక్కడ కూడా పూర్వకాలం నుండి నేటి వరకు చక్రపాణి వంశీయులే అర్చకత్వం నిర్వహిస్తున్నారు. నేదు

**సేకరణ : చక్రపాణి మాధవాచార్యులు**





శ్రీమాన్ చక్రపాణి మాధవాచార్యులు వేణుగోపాలస్వామి అర్చకారాధన నిర్వహిస్తూనే ఇతర దేవాలయాల్లో కూడా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీలో కూడా ఉండి వీరు సేవలందిస్తున్నారు. ఇక్కడ ఆలయాలలో జరిగే వివిధ ఉత్సవాల వివరాలు

ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాలు

చైత్ర మాసం ఉగాది ఆస్థానం, వైశాఖమాసం ఉత్సవ మూర్తులు కొండస్వామి వారి సన్నిధిలో సప్త అహ్నిక బ్రహ్మోత్సవాలు, జ్యేష్ఠమాసం సీతారామ స్వామి వారి వార్షిక ఉత్సవం శ్రీ గండి హనుమాన్ స్వామి వారి సన్నిధిలో ఆషాఢం మాసం భాగవత సప్తహం , గోపాల కాల్వ ఉత్సవం, శ్రావణం మాసం ఆండాళ్ , కన్నన్ తిరు నక్షత్ర ఉత్సవ ఉట్ల పండుగ, భాద్రపదం శ్రీగండి హనుమాన్‌స్వామివారి సన్నిధిలో వినాయక ఉత్సవం, ఆశ్వీయుజ నవరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీస్వామివారికి విజయోత్సవం, కార్తీక మాసం వైకుంఠ చతుర్దశి ఉత్సవం, మార్గశిర మాసం అత్యంతవైభవంగా ధనుర్మాస ఉత్సవం, పుష్యమాసం తిరుకళ్యాణం, మాఘ మాసం శ్రీవారి వార్షిక ఉత్సవం, ఫాల్గుణ మాసం ఆలయం లో వివిధ సేవా కార్యక్రమాలు జరుగుతాయి. ★

## అమృతత్వము


(41 వ పేజీ తరువాయి) చేయవలసినదే! చేస్తుంటాం! కానీ మనం చేసే కర్మలు తిరిగి మనని చుట్టుకోకూడదు. కానీ చేయకుండా ఉండలేము అందుకే భగవదాజ్ఞయా భగవత్ కైంకర్య రూపం అని తలుస్తూ కర్మలు ఆచరిస్తే అది త్యాగమే అవుతుంది. కర్మలు వదిలేస్తే త్యాగి కాలేడు త్యాగం చేయలేకపోతే అమృతత్వాన్ని (మోక్షం) పొందలేడు. ★

న్యూజెర్సి,యు.యస్,ఏ లో ధనుర్మాసోత్సవాలు





## ధనుర్మాస ఉత్సవాలు







యజ్ఞవరాహక్షేత్రం కరీంనగర్‌లో ధనుర్మాస ఉత్సవాల్లో శ్రీమాన్ శ్రీ సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు గారిచే ఉదయం శ్రీవచన భూషణం, సాయంత్రం తిరుప్పావై ప్రవచన కార్యక్రమములు జరుపబడుతున్నాయి. ★





# వైష్ణవ ఆలయాల్లో వైభవంగా

# ధనుర్మాస ఉత్సవాలు



వనపర్తి జిల్లా పెద్ద దగడ గ్రామంలోని శ్రీపద్మావతీ సమేత తిరుమలనాథస్వామివారి దేవాలయం ధనుర్మాసం సందర్భంగా



శ్రీ తాపాల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయము మహాత్మానగర్ మండలము తిమ్మాపూర్, జిల్లా కరీంనగర్



రఘునాథపురం, గ్రామం రాజాపేట మం, యాదాద్రి జిల్లా శ్రీవేంకటేశ్వర ఆలయంలో జరిగిన ధనుర్మాసోత్సవాలు.

**పుణ్యకోటి వాహనంపై స్వామి వారి తిరువీధి సేవ.** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవములు



శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామివారి దేవాలయం, ఈస్ట్ యడవల్లి, కామవరపు కోట మండలం. ద్వారతిరుమల, దత్తత దేవాలయం



తిరుమల తిరుపతి దేవస్థానములు ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారిచే ధనుర్మాస తిరుప్పావై ప్రవచనములు. నిజామాబాదులోని బ్రహ్మపురి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం చక్రంగుట్ట ధనుర్మాస సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కందాళై నాగరాజు ఆచార్య ఆధ్వర్యంలో సేనాపతి సంపత్ కుమార్ ఆచార్యులు గారిచే తిరుప్పావై దివ్య ప్రబంధం ప్రవచన కార్యక్రమములు.



# పూర్తయిన భగవద్గీత శిక్షణా తరగతులు




శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి వారి మంగళాశాసనములతో కరీంనగర్ వికాసతరగిణి వారు కోవిడ్ సమయములో (2021–2022) కుమారి శ్రీదేవి గారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత శిక్షణాతరగతులు నిర్వహించారు. ఆరు సంవత్సరముల నుండి అన్ని వయసుల వారికి శిక్షణ నిర్వహించారు. మొదటి బ్యాచ్‌లో 75 మంది విద్యార్థులు సంపూర్ణ భగవద్గీత నేర్చుకున్నారు. ఈ ముగింపు కార్యక్రమం శంషాబాద్‌లో ఆచార్యుల సన్నిధిలో జరిగింది. ఆ సందర్భంగా 9 మందికి బంగారు, 9 మందికి వెండి పథకాలు పాల్గొన్న విద్యార్థులకు అందరికీ సర్టిఫికేట్‌లు తులసి మాలలు బహూకరించారు. శ్రీచిన్న జీయర్ స్వామివారి ఆదేశానుసారంగా వీరు అవధానంలో శిక్షణ పొందారు. వివిధ సందర్భాలలో భగవద్గీత అవధానాన్ని ప్రదర్శించారు.

1) శ్రీస్వామివారి తిరునక్షత్ర సందర్భంగా అల్లంపల్లిలో అవధాన కార్యక్రమం జరిగింది. (నవంబర్ 2022)

2) సమతామూర్తి రామానుజులవారి మొదటి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీచిన్నజీయర్ స్వామివారి సన్నిధిలో శంషాబాద్ లో అవధాన కార్యక్రమం (ఫిబ్రవరి 2023)

3) రామానుజుల వారి తిరునక్షత్ర సందర్భంగా 5 రోజుల శంషాబాద్ లో అవధానం కార్యక్రమం (మే 2023) జరిగింది.

4) గీతాజయంతి సందర్భంగా కరీంనగర్ వేదభవనంలో శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివారి సమక్షంలో కార్యక్రమం. (డిసెంబర్ 2023)

5) నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లో శ్రీచిన్నజీయర్ స్వామి వారి సన్నిధిలో అవధాన కార్యక్రమము. (ఏప్రిల్ 2024)

23-24 లో కూడా ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత శిక్షణలు కొనసాగాయి. 80 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ ముగింపు కార్యక్రమం శ్రీచిన్నజీయర్ స్వామి వారి సమక్షంలో మంగళగిరిలో ధనుర్మాస కార్యక్రమ సందర్భంగా డిసెంబర్ 24న జరిగింది. ఈ కార్యక్రమంలో 8 మందికి బంగారు, 8 మందికి వెండి పథకాలు సర్టిఫికేట్‌లు తులసి మాలలు బహూకరించారు. శ్రీచిన్నజీయర్ స్వామి వారు విద్యార్థులకు, గురువులకు, నిర్వాహకులకు మంగళాశాసనాలు అందించారు. నిర్వాహణ కె.గౌతమ్‌రావు గారు, అధ్యక్షులు, యాదాకిషన్ గారు, కార్యదర్శి. ఉపాధ్యాయులు 1. కుమారి శ్రీదేవి గారు, 2. శ్రీమతి రమ్య గారు, 3. శ్రీనాథ్ కుమార్ గారు, 4. శ్రీమతి సముద్రాల శారద గారు, 5. శ్రీమతి అనంతలక్ష్మి గారు, 6. శ్రీమాన్ పార్థసారథి గారు







# బాలవిజ్ఞానం

# అహం నేర్పిన గుణపాఠం

శ్రీమతి విజయ కందాళ


భీమసేనుడు కుంతీపుత్రుడు. ఒకసారి అతడి అహంకారం అతనికి గొప్ప పాఠాన్ని నేర్పింది. అదేదో తెలుసుకుందాం!

భీమసేనుడు అత్యంత బలశాలిగా చిన్ననాటి నుండి పేరుతెచ్చుకున్నాడు. కొండలను సైతం పిండి చేయగల బలం అతడిది. అంతటి మేటి బలశాలి ఒకనాడు పరాభవితుడైనాడని మహాభారతం తెలియజేస్తుంది.

ఒకసారి పాండవులంతా ద్రౌపదితో కలిసి అడవిలో ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో ఒక మంచి పరిమళం వారికి తెలిసింది. ద్రౌపతి ఆ సువాసనకు ఆకర్షితురాలు అయింది. అలా ముందుకు వెళ్తే గాలివాటుగా పడిన ఒక వెయ్యి రేకుల అరుదైన తామర పుష్పం కనిపించింది. ఆ సౌగంధికా పుష్పాన్ని (సువాసనగల పువ్వును) చూసి పరవశించిన ద్రౌపదీదేవి అటువంటి పుష్పాలు మరికొన్ని కావాలని భీముడిని కోరింది. దానికి ఒప్పుకున్న భీముడు ఆ సువాసన వస్తున్న దిక్కుగా ముందుకు వెళ్లి గంధమాదన పర్వత శ్రేణిని చేరాడు. పర్వతాన్ని ఎక్కడం మొదలుపెట్టాడు పువ్వుల కోసం.

అలా ముందుకు వెళుతున్న భీమునికి దారి పక్కగా ఒక వృద్ధ వానరం పడుకుని తన తోకను నిర్లక్ష్యంగా మార్గమధ్యంలో పడవేసి ఉంచడం చూశాడు. దాన్ని తొక్కి వెళ్లడం కానీ దాటి వెళ్లడం కానీ ఇష్టపడని భీముడు ఆ కోతిని తోకను పక్కకు పెట్టమన్నాడు. అప్పుడు ఆ కోతి ఇలా జవాబు ఇచ్చింది. 'అయ్యా నేను ఒక వృద్ధ వానరాన్ని. నాతోక జరిపే శక్తి నాలో లేదు. మీరు దయచేసి దానిని పక్కన పెట్టి వెళ్ళండి ఆ పుష్పాన్ని పొందాలనే తొందరలో ఉన్న భీమసేనుడు నిర్లక్ష్యంగా తోకని జరపాలని చూసాడు. కదల్లేదు! అందుకే మరింత శ్రద్ధతో దాని జరపాలని మళ్ళీ ప్రయత్నించాడు. ఆశ్చర్యం! తోక కదలలేదు. కండబలంతో పర్వతాలను కదిలించగల భీమసేనుడు ఇప్పుడు ఒక ముసలి కోతి తోకను జరపలేకపోయాడు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన భీముడు తన బలమంతటినీ ఉపయోగించి ప్రయత్నించాడు. అయినా తోక కదలలేదు.

మహా బలశాలి అయిన భీముడు ఓటమిని ఒప్పుకునేందుకు ఇష్టపడక, శక్తియుక్తులు యావత్తు వినియోగించి మరోసారి తోకను కదపాలని చూసాడు. చెమటలు పట్టాయి కానీ, అతని వల్ల కాలేదు. తన శక్తి అంతా ఏమైందని మధన పడసాగాడు. బుద్ధిమంతుడు కనుక అంతలోనే వివేకం తెచ్చుకుని, తన బలాన్ని చూసుకుని తనలో కలిగిన అహంకారానికి ఇది శాస్తి అని భావించాడు. అంతే కాదు తన ముందు ఉన్నది



సాధారణ కోతి కాదని తెలుసుకున్నాడు. వెంటనే వినయంగా చేతులు జోడించి "ఓ వానరమా మీరు సామాన్యులు కారు. ఎవరో దైవాంశ సంభూతులు. నా యందు దయవుంచి మీరు ఎవరో తెలపండి" అని ప్రార్థించాడు.

వెంటనే వృద్ధ వానర రూపానికి బదులుగా బహు పరాక్రమశాలి అయిన హనుమంతుడు అక్కడ నిలిచాడు. రామాయణ గాథలో అత్యంత కీలకపాత్రను వహించిన హనుమ చిరంజీవిత్వాన్ని కలిగి ఉన్నవాడు. హనుమంతుడు కూడా భీముని వలె వాయు పుత్రుడే కనుక వారు ఇరువురు అన్నదమ్ములే. భీమసేనుడు ఏ కార్యం మీద వెళ్తున్నాడో హనుమంతుడు గ్రహించాడు. అది దేవతలకు సంబంధించిన ప్రదేశం. అందులోకి ప్రవేశించడం నేరం కనుక, అహంకారంతో ముందుకు సాగుతున్న భీమునికి ఆ సంగతిని తెలియజేసి, వారించేందుకే హనుమ అక్కడ కూర్చున్నాడు. విషయాన్ని పూర్తిగా తెలుసుకున్న భీముడు హనుమకు తన ప్రణామాలను అర్పించాడు. "అహం నేర్పిన పాఠాన్ని గ్రహించగలగడమే విజ్ఞుల లక్షణము". ఎంత వారికైనా అహంకారం పనికి రాదు. గ్రహించాలి. ★

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **JAN 2025** **RNI NO : TELTEL/2024/89280**
Publication Date 1st of Every Month, Posted at Karimnagar, DOP : Every month 5th / 6th

# శ్రీసన్నిధి పదకేళి 11

**అడ్డం**

1.శ్రీకృష్ణదేవరాయలు గోదాదేవిపై రచించిన గ్రంథం (6)
2 శ్రీవిల్లిపుత్తూరు క్షేత్ర అధినాథుడు (6)
3.విశ్వరథరాజు కుమారుడు (5)
7 గోపికలు శ్రీకృష్ణున్ని పతిగా పొందగోరి ఏవ్రతాన్ని ఆచరించారు 4)

**నిలువు**

4. గోవుల రక్షించువాడు (4)
5.మహాభారతంలో ద్రోణుని ఎవరుచంపారు 5
6.ధనూరాశిలో సూర్యుడు సంచరించేమాసం 5
8.సమస్త ప్రజలకు పతి (4)
9.గాంధారి సోదరుడు (3)
10.కృష్ణ,బలరాముల చెల్లెలు (3)
11.శ్రీరామాయణ ఉపకథ రాముడు వధించినది? (3)
12.బకాసురుని ఎవరు సంహరించారు (3)
13. కౌసల్య దశరథుల కూతురు (2)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | | | | | | ■ | ■ |
| ■ | ■ | 2 | | | | | | ■ |
| 4 | ■ | 3 | | | | | ■ | 5 |
| | ■ | 7 | | | | ■ | 6 | |
| | 8 | ■ | ■ | ■ | ■ | ■ | | |
| | | 9 | 10 | 11 | 12 | ■ | | |
| ■ | | | | | | ■ | | |
| 13 | | | | | | ■ | | ■ |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | ■ |





## యాత్రాస్థలం

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో ఉభయ వేదాంత పీఠం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న వసతి గృహం.

భగవద్రామానుజాచార్యుల అవతారస్థలం నందు భగవత్ భక్తులైన యాత్రికుల కొరకు సకల వసతి సౌకర్యాలతో శ్రీకంచికి అతి సమీపంలో ఆదికేశవ పెరుమాళ్ల కోవెల ముందుగల భవనం.



**Contact : GEMENI RAO. SRIPERAMBADHUR T.N, RAMANUJULAVARY JENMASTHALAM. SANNIDHI ST. SRIMATH UBHAYAVEDANTHAKACHARYA PEETAM. 9908829839./ 8838489556.**


From : **PRAPATTI SRISANNIDHANAM,** Telugu Monthly, H No 10-2-225, VIDYANAGAR, KARIMNAGAR -505 001.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI No. TELTEL/2024/89280,
Cell No : 9502583323, Land line No 0878-2253323, Email Id prapatti.srisannidhanam9@gmail.com.